శనివారం
24•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 258
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

అన్ని భూములకూ ఆధార్



- ఆధార్ లింక్ చేయని భూములను బినామీగా గుర్తింపు
- అసైనీలకూ పాస్ పుస్తకాలు
- అసలు లబ్ధిదారుల యాజమాన్యంపై స్పష్టత
- తప్పులకు అవకాశమివ్వొద్దు
- పక్కాగా రూపొందాకే పంపిణీ
- పాస్‌పుస్తకాల పంపిణీపై సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో అన్ని భూములకూ ఆధార్‌ను అనుసంధానించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. భూరికార్డులకు ఆధార్‌కార్డు లింక్‌చేయడానికి కొందరు ముందుకు రావటంలేదని.. ఇప్పటికైనా వారు ఆధార్ నంబర్‌ను తమ భూ రికార్డులతో లింక్ చేయించుకోవాలని.. ఆధార్ అనుసంధానం కాని భూములను బినామీ ఆస్తులుగా గుర్తించాల్సి వస్తుందని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. దీంతోపాటు ఇతర పట్టాదారులతోపాటుగానే అసైన్డ్ భూములు కలిగినవారికి కూడా కచ్చితంగా కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఆదేశించారు. అసలైన లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్న అసైన్డ్ భూములను గుర్తించి, వాటి యాజమాన్యంపై స్పష్టతనివ్వాలని, వారిపేరు మీద పాస్‌పుస్తకాలు తయారుచేయాలని చెప్పారు. అసైన్డ్‌దారులకు భూ యాజమాన్య హక్కులపై స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. అసైనీలకు సంబంధించిన పాస్‌పుస్తకాల మిగతా 2వ పేజీలో

జిల్లా రైతు సమన్వయకర్తల నియామకం

25, 26 తేదీల్లో రైతు సమన్వయ సమితి సదస్సులు 11

రైతు విజయం

కాళేశ్వరం వ్యతిరేకులకు షాక్

- పనులను నిలిపివేయాలనే అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- అనుకూలమైన ఉత్తర్వుల కోసం 'ఫోరం హంటింగ్' చేస్తున్నారా?
- పిటిషనర్ ఉద్దేశాలపై మండిపాటు
- చెన్నై ఎన్జీటీని కాదని ఢిల్లీకి ఎందుకు వచ్చారని సుప్రీం నిలదీత



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల దృశ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం వ్యతిరేకులు సుప్రీంకోర్టులో బొక్కబోర్లా పడ్డారు. చారిత్రాత్మకమైన ప్రాజెక్టును ఎలాగైనా అడ్డుకోవాలనే కుయుక్తులకు సర్వోన్నత న్యాయస్థానం వాతలు పెట్టింది. కుంటిసాకులతో, కుటిల పన్నాగాలతో కోర్టును బురిడీ కొట్టించేందుకు చేసిన ప్రయత్నాలకు తీవ్రస్థాయిలో మందలింపులు ఎదురయ్యాయి. జనహిత జలసాధనకు అడ్డుపడుతున్న నక్కజిత్తులకు సర్వోన్నత న్యాయస్థానం తలంటుపోసింది. తెలంగాణను సస్యశ్యామలం చేయాలన్న కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టుకు మోకాలడ్డుపెట్టేందుకు కుట్రలు పన్నినవారికి సుప్రీంకోర్టులో తలబొప్పికట్టింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను నిలిపివేయాలన్న వితండవాదనను సుప్రీంకోర్టు శుక్రవారం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఇష్టానుసారంగా కోర్టుల్లో కేసులను దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది. విచారణ పరిధిలోలేని ఫోరంలను ఆశ్రయించడం, విచ్చలవిడి వాదనలు చేయడంపై నిప్పులు చెరిగింది. మీ ఉద్దేశాలను నెరవేర్చుకోవాలనే ఆలోచనతో ఫోరం హంటింగ్ (అనుకూలమైన తీర్పులు ఇచ్చే కోర్టు కోసం వేట) సాగిస్తున్నారా? అంటూ పిటిషనర్‌ను నిలదీసింది. ఇలాంటి ఉద్దేశాలతో న్యాయస్థానాలను ఆశ్రయించవద్దని గట్టిగా మిగతా 2వ పేజీలో

రైతు వ్యతిరేకులకు చెంపపెట్టు



- కేసుల వెనుక ఎవరున్నది బయటపెడుతం
- కాంగ్రెస్, కోదండరాం.. ఒక చెట్టు కొమ్మలే
- రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించడం తెలంగాణ ప్రజలు, రైతాంగానికి గొప్ప శుభవార్త అని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అభివర్ణించారు. శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఆయన ఢిల్లీలో విలేకరులతో మిగతా 11వ పేజీలో

వారంలో నందిమేడారం పూర్తి

వచ్చేనెల నుంచి చెరువులకు నీళ్లు.. 1.65 లక్షలకు సాగునీరు అందే అవకాశం 14

కాళేశ్వరంతో అద్భుత ఫలితాలు ఖాయం

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ ప్రశంస 2



హైదరాబాద్‌లో మరో బయోకాన్ సెంటర్

జీనోమ్ వ్యాలీలో ఆర్ అండ్ డీ కేంద్రం
కిరణ్ మజుందార్‌షా ప్రకటన
ఫార్మా దిగ్గజాలతో మంత్రి కేటీఆర్ సమావేశం

బయోఏషియా సదస్సులో బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్‌షా, భారత డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఈశ్వరరెడ్డితో మంత్రి కేటీఆర్ 2

- చేనేత కార్మికులకు శుభవార్త!

లక్షలోపు రుణాల మాఫీ

ఇప్పటికే రుణాలు చెల్లిస్తే ఆ మొత్తం వారి ఖాతాల్లో జమ
ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం 12

రాజ్యసభ ఎన్నికలకు మోగిన నగారా

16 రాష్ట్రాల్లో 59 స్థానాలకు నోటిఫికేషన్
మార్చి 23న పోలింగ్.. కౌంటింగ్
తెలంగాణ నుంచి మూడు స్థానాలకు..
ఆ మూడూ గులాబీ ఖాతాలోకే! 5, 11

నేటి నుంచి టీఆర్టీ

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ
నేడు పరీక్ష రాయనున్న 34,827 మంది అభ్యర్థులు
45 నిమిషాల ముందే ఎగ్జామ్ సెంటర్‌లోకి వెళ్లాలి
టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి 2

సౌర విద్యుత్‌లో మనమే నంబర్ 1

3 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యమున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ 11

ఎంసెట్‌లోకి బీఎస్సీ ఫారెస్ట్రీ

నిబంధనలు సవరిస్తూ నోటిఫికేషన్ జారీ 3

భారత ఐటీకి హెచ్1బీ దెబ్బ

- వీసా జారీ ప్రక్రియ మరింత కఠినతరం
- ఇకపై కాలపరిమితి మూడేండ్ల లోపే..
- నూతన విధానాన్ని ప్రకటించిన అమెరికా 5

హైదరాబాద్‌లో మరో బయోకాన్ సెంటర్

ఫార్మా దిగ్గజాలతో మంత్రి కేటీఆర్ సమావేశం ● జీనోమ్ వ్యాలీలో బయోకాన్ ఆర్ అండ్ డీ కేంద్రం

కిరణ్ మజుందార్‌షా ప్రకటన ● జీఈ ప్రెసిడెంట్, సీఈవో టెర్రీ బ్రెసెన్హమ్‌తో మంత్రి భేటీ

మెడికల్ డివైజెస్‌లో పెట్టుబడులకు అహ్వానం ● టాస్క్‌తో హెల్త్‌కేర్ స్కిల్లింగ్‌లో పనిచేసేందుకు జీఈ రెడీ

మెర్క్ లైఫ్‌సైన్సెస్ సీవోవో ఉదిత్ బాత్రా, థాయ్‌లాండ్ మంత్రి, ఇటలీ కాన్సుల్ జనరల్‌తో మంతనాలు



శుక్రవారం హైటెక్స్ హెచ్‌ఐసీసీలో బయో ఏషియా 2018 సదస్సులో మంత్రి కేటీఆర్, బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్‌షా, రెడ్డి ల్యాబ్స్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, సీఎన్‌బీసీ ఫైనాన్సియల్ ఎనలిస్ట్ ఎక్తాబత్రా, డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ డాక్టర్ ఎస్ ఈశ్వరరెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బయోఏషియా సదస్సులో భాగంగా రెండోరోజు పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు పలువురు ఫార్మా దిగ్గజాలతో సమావేశమయ్యారు. నోవార్టిస్, బయోకాన్, మెర్క్, డెలాయిట్, జీఈ కంపెనీల సీఈవోలు, సీనియర్ ప్రతినిధులతో మంతనాలు జరిపారు. థాయ్‌లాండ్ వాణిజ్య ఉప మంత్రి, ఇటాలియన్ కాన్సుల్ జనరల్‌తో భేటీ అయ్యారు. బయోటెక్నాలజీ దిగ్గజం బయోకాన్ నగరంలో నూతన యూనిట్ ప్రారంభించనున్నది. దీనితోపాటు ప్రస్తుత యూనిట్‌ను మరింత విస్తరించనున్నది. హెచ్‌ఐసీసీలో మంత్రి కేటీఆర్ శుక్రవారం బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్‌షాతో సమావేశమయ్యారు. జీనోమ్‌వ్యాలీలో బయోకాన్ నూతన ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె మంత్రికి తెలిపారు. తమ అనుబంధ కంపెనీ అయిన సింజెన్ ద్వారా ఈ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ యూనిట్ ద్వారా 1000 హైస్కిల్స్ ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. బయోకాన్‌లోని సిబ్బందిని రెట్టింపు చేస్తామని, వీటికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అందజేస్తానని ఆమె మంత్రికి తెలిపారు. బయోకాన్ నూతన యూనిట్ ఏర్పాటును స్వాగతించిన మంత్రి కేటీఆర్.. కిరణ్ మజుందార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు విస్తరణలో ఫార్మాసిటీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ స్టార్టప్ ఇకోసిస్టమ్ గురించి ప్రస్తావించిన మంత్రి.. కిరణ్ మజుందార్ షా తదుపరి హైదరాబాద్ పర్యటన సందర్భంగా నగరంలోని 20 టాప్ స్టార్టప్స్‌తో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో దేశంలో ఎట్టకేలకు ఉన్నత ప్రమాణాలున్న సైన్స్, ఇన్నోవేషన్ పరిశోధనలకు బీజం పడిందని కిరణ్ అభినందించారు. పారిశ్రామికవేత్తలకు కేటీఆర్ లాంటి నాయకులను చూసినప్పుడు స్ఫూర్తి కలుగుతుందని ఆమె అన్నారు. ఇలాంటి నాయకులను బలపర్చాలనిపిస్తుందని చెప్పారు. హైదరాబాద్‌పై కూడా కిరణ్ ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్ భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత పురోగతి సాధించేందుకు ఆయారంగాల్లోని నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాధికారులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

హైదరాబాద్‌లో 30 లక్షల అడుగుల ల్యాబరేటరీ స్పేస్

జీఈ (సస్టెయినబుల్ హెల్త్‌కేర్ సొల్యూషన్) ప్రెసిడెంట్, సీఈవో టెర్రీ బ్రెసెన్హమ్‌తో మంత్రి సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మెడ్ డివైసెస్ పార్క్ గురించి, టీ వర్క్స్ గురించి వివరించారు. బయోటెక్నాలజీలో వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ నగరంలోని కంపెనీలు అందిపుచ్చుకునేందుకు గల అవకాశాలపై చర్చించారు. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 30 లక్షల అడుగుల ల్యాబరేటరీ స్పేస్ ఉన్నదని ఈ సందర్భంగా మంత్రి టెర్రీకి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జీనోమ్‌వ్యాలీలో ఏర్పాటు చేయనున్న ఇంక్యుబేటర్‌లో జీఈ భాగస్వామి కావాలని మంత్రి కోరారు. తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగంలో చేపట్టిన క్యాన్సర్ డయాగ్నస్టిక్ కార్యక్రమాలను టెర్రీకి వివరించారు. త్వరలోనే జీనోమ్ వ్యాలీ పర్యటనకు వస్తానని టెర్రీ చెప్పారు. తెలంగాణ ప్రభుతం నిర్వహించే 'టాస్క్'తో కలిసి హెల్త్‌కేర్ స్కిల్లింగ్ కార్యక్రమాలను చేపట్టేందుకు జీఈ సిద్ధంగా ఉన్నదని ఆమె మంత్రి కేటీఆర్‌కు వివరించారు.

థాయ్‌లాండ్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ భేటీ

థాయ్‌లాండ్ వాణిజ్యశాఖ ఉపమంత్రి చుటిమా బున్యాప్రఫసార తనవెంట వచ్చిన 20 కంపెనీల ప్రతినిధులతో కలిసి మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. తెలంగాణలోని వ్యాపారావకాశాలపై చర్చించారు. తెలంగాణ పారిశ్రామిక విధానం, ఫార్మాసిటీ, జీనోమ్‌వ్యాలీ, హైదరాబాద్ నగరంలోని ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగంలో ఉన్న అవకాశాలపైన థాయ్‌లాండ్ బృందం అసక్తి వ్యక్తంచేసింది. థాయ్‌లాండ్ దేశానికి భారతదేశంతో కీలక వాణిజ్య సంబంధాలున్నాయని చుటిమా అన్నారు. హైదరాబాద్ తొలిపర్యటనలోనే ఇక్కడి విధానాలు, పెట్టుబడి అవకాశాలు తమను ఆకట్టుకున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ టీఎస్ ఐపాస్ విధానాన్ని ప్రశంసించారు.

ముంబైలోని ఇటాలియన్ కాన్సుల్ జనరల్ స్టెఫానియా కస్టాన్జాతో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. బాధ్యతలు చేపట్టిన తరువాత హైదరాబాద్ నగరంలో తొలిసారి పర్యటిస్తున్న తనకు ఇక్కడి టెక్స్‌టైల్ రంగం, ఫార్మా, సినిమా పరిశ్రమ అనుబంధ రంగాలలో గల పెట్టుబడి అవకాశాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా బయోటెక్ రంగంలో ఇటలీ కంపెనీలు ఇక్కడి కంపెనీలతో కలిసి పనిచేసే మార్గాలను అన్వేషిస్తున్నాయని చెప్పారు. తెలంగాణ టెక్స్‌టైల్ రంగాన్ని ఇటలీలోని ఫ్యాషన్ రంగాన్ని కలుపడంపై చర్చించారు. అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎయిరోస్పేస్, టెక్స్‌టైల్ రంగాల్లో అనేక పెట్టుబడులకు సానుకూల పరిస్థితులు ఉన్నాయని, తెలంగాణలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చే ఇటాలియన్ కంపెనీలకు అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆయా కంపెనీలకు తెలంగాణను పరిచయం చేయాలని కోరారు. భారతదేశంలో ఫార్మా పరిశ్రమ అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లు అనే అంశంపై ఫార్మా కంపెనీల సీవోవోలతో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. మెర్క్ లైఫ్ సైన్సెస్ సీవోవో ఉదిత్ బాత్రా, నోవార్టిస్, డెలాయిట్ కంపెనీల ప్రతినిధులతో కూడా మంత్రి భేటీ అయ్యారు.

రైతు విజయం

మొదటిపేజీ తరువాయి...

మందలించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను నిలిపివేయాలనే అభ్యర్థనను కొట్టిపారేసింది. పర్యావరణ, అటవీశాఖ అనుమతులు వచ్చేవరకు రిజర్వ్ ఫారెస్ట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు మినహా ఇతర పనుల కొనసాగింపునకు అనుమతిస్తూ ఉమ్మడి హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ హయతుద్దీన్ దాఖలుచేసిన స్పెషల్‌లీవ్ అప్పీల్ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్, జస్టిస్ నవీన్ సిన్హా నేతృత్వంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది.

తెలంగాణ సర్కారు వాదనే నెగ్గింది

అటవీ, పర్యావరణ అనుమతులు లేకుండా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను నిలిపివేయాలంటూ హయతుద్దీన్ అనే వ్యక్తి ఢిల్లీలోని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఢిల్లీ ట్రిబ్యునల్.. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని స్టే విధిస్తూ, అటవీ, పర్యావరణ అనుమతులు తీసుకుని తమకు నివేదించిన తర్వాతే పనులకు అవకాశం కల్పిస్తామంటూ గత ఏడాది అక్టోబర్ 5 న మధ్యంతర ఉత్తర్వులను జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఢిల్లీలోని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించింది. పర్యావరణ విషయాలపై విచారణ చేపట్టడానికి ఏర్పాటు చేసిన హరిత ట్రిబ్యునల్‌లు దేశవ్యాప్తంగా రీజియన్‌వారీగా ఉన్నాయని హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల కోసం చెన్నైలోని సదరన్ రీజియన్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉందని, అలాకాకుండా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఢిల్లీలోని ప్రిన్సిపల్ బెంచ్‌ను పిటిషనర్లు ఆశ్రయించడం, విచారణ పరిధి కాని అంశాన్ని విచారించి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడం సరికాదని ఎత్తిచూపింది. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్టుకు డీపీఆర్ గతంలో చాలా సంవత్సరాల క్రితం రూపొందించిందని, అయితే కాలపరిధి ముగిసిన తర్వాత ఆ వ్యవహారంపై విచారణ చేపట్టడం తగదంటూ రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కారణాలను లేవనెత్తింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన అంశాలను ఉమ్మడి హైకోర్టు పరిగణనలోకి తీసుకున్నది. అదేవిధంగా మొదటగా తాగునీటి ప్రాజెక్టుగా పనులు చేపడుతున్నామని, అన్ని అనుమతులు వచ్చిన తర్వాతే సాగునీటి ప్రాజెక్టులు చేపడుతామంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణను కూడా లెక్కలోకి తీసుకున్నది. అన్ని విషయాలను పరిశీలించిన మీదట ఢిల్లీలోని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ జారీచేసిన స్టే ఉత్తర్వులను నిలిపివేస్తూ ఉమ్మడి హైకోర్టు గత ఏడాది నవంబర్ 8న ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఢిల్లీలోని హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన పిటిషనర్ హయతుద్దీన్.. తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. చెన్నైలోని ట్రిబ్యునల్‌ను కాకుండా ఢిల్లీలోని హరిత ట్రిబ్యునల్‌ను ఎందుకు ఆశ్రయించారని విచారణ సందర్భంగా పిటిషనర్‌ను నిలదీసింది. పిటిషనర్ ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తంచేస్తూ అప్పీల్‌ను తిరస్కరించింది.

ముహూర్తం

సూర్యోదయం: 6.41 గంటలకు

సూర్యాస్తమయం: 6.17 గంటలకు

హేవళంబి నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణ మాసం, శుక్లపక్షం, నవమి రాత్రి 10.38 వరకు, తదుపరి దశమి. నక్షత్రం: రోహిణి ఉదయం 11.29 వరకు, తదుపరి మృగశిర. అమృత ఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 9.35 నుంచి 11.02 వరకు, దుర్మూహూర్తం: ఉదయం 6.41 నుంచి 8.14 వరకు, వర్జ్యం: తె. 3.54 నుంచి 5.30 వరకు, తిరిగి సాయంత్రం 4.43 నుంచి 6.19 వరకు.



శుక్రవారం ప్రగతిభవన్‌లో కొత్త పాస్‌పుస్తకాల పంపిణీపై అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ తదితరులు ఉన్నారు.

లోకం పోకడ



అన్ని భూములకూ ఆధార్

మొదటిపేజీ తరువాయి...

ముద్రణ కూడా పూర్తి చేయడంతోపాటు, పాస్ పుస్తకంలో నమోదయ్యే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఇందుకోసం కొంత సమయం తీసుకొన్నా అభ్యంతరంలేదని చెప్పారు. పాస్‌పుస్తకాల తయారీ పక్కాగా జరిగిన తర్వాతనే పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ తెలిపారు. పాస్‌పుస్తకాల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా ప్రతి ఎంట్రీని ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తొందరపాటు అవసరం లేదని సీఎం చెప్పారు.వ్యవసాయ భూమి కలిగిన రైతుకు అదే గ్రామంలో వ్యవసాయేతర భూమి ఉంటే, ఆ వివరాలు కూడా పాస్‌పుస్తకంలో నమోదు చేయాలని, అందుకోసం అదనపు కాలమ్ పెట్టాలని సూచించారు. పాస్‌పుస్తకానికి ఆధార్ నంబర్ కూడా కచ్చితంగా అనుసంధానంచేయాలని చెప్పారు. మార్చి 11నే పట్టాదారు పాస్ పుస్తకాలన్నీ పంపిణీ చేసి తీరాలనే తొందరలో పొరపాట్లకు ఎంతమాత్రం ఆస్కారం ఇవ్వొద్దన్నారు. కొత్త పాస్‌పుస్తకాల పంపిణీపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

పక్కా అయ్యాకే పంపిణీ

''దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో భూ రికార్డుల ప్రక్షాళన జరిగింది. అనేక పీటముడులున్న ఈ క్లిష్టమైన పనిని రెవెన్యూ అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు ఎంతో శ్రమకోర్చి విజయవంతంచేశారు. వారికి ప్రత్యేక అభినందనలు. రికార్డుల ప్రక్షాళన తర్వాత వచ్చిన వివరాలన్నీ 'ధరణి' వెబ్‌సైట్‌లో నమోదుచేసే పని జరుగుతున్నది. ఆ వివరాల ఆధారంగా కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. సొంతభూమి కలిగిన రైతులతోపాటు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు కూడా సేకరించాలి. వారికి కూడా కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. ఇందుకోసం కొంత సమయం పడుతుంది. అయినా ఫర్వాలేదు. కలెక్టర్లతో మాట్లాడి కచ్చితమైన వివరాలు తెప్పించాలి. అసైన్డ్‌దారులకు కూడా భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. పాస్‌పుస్తకాల్లో నమోదయ్యే వివరాలను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలి. తొందరపాటులో పొరపాట్లు దొర్లే అవకాశం ఉంటుంది. మార్చి 11నే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించిన మాట నిజం. అయితే అసైన్డ్ భూముల యజమానులను గుర్తించడం, వివరాలను పరిశీలించడం, వ్యవసాయేతర భూముల వివరాలు కూడా నమోదు చేయడం లాంటి పనులన్నీ చేయడానికి కొంత సమయం పడుతుంది. పాస్ పుస్తకాల తయారీ పక్కాగా జరిగిన తర్వాతే పంపిణీ కార్యక్రమం చేపట్టాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.

మార్చి నెలాఖరుకల్లా ఓఆర్‌ఆర్ లోపలి గ్రామాలకు మంచినీళ్లు: సీఎం కేసీఆర్

హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్ లోపలి అన్ని గ్రామాలకు ఈ ఏడాది మార్చి 31 నాటికి మంచినీళ్లు అందాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. గ్రామాలకు పైప్ లైన్లు వేసుకుంటూనే సమాంతరంగా అంతర్గత పైప్‌లైన్ల నిర్మాణ పనులు కూడా చేపట్టాలని సీఎం కేసీఆర్ చెప్పారు. గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్లు నిర్మించి, ఇంటింటికీ నల్లాలు బిగించి మంచినీళ్లు సరఫరాచేసే విషయంలో ఎమ్మెల్యేలు చొరువ చూపాలని కోరారు. మార్చి చివరి నాటికి ఓఆర్ ఆర్ లోపలి గ్రామాలన్నింటిలో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయాల్సిన అంశంపై శుక్రవారంనాడు ప్రగతిభవన్‌లో 'మిషన్ భగీరథ'పై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ముఖ్యకార్యదర్శి నర్సింగ్ రావు, స్మితాసబర్వాల్, మిషన్ భగీరథ అధికారులు, వర్కింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధార్ లింక్ చేయని భూములను బినామీ ఆస్తులుగా గుర్తించండి

'భూ రికార్డులను పక్కాగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయాలని నిర్ణయించాం. మేడ్చల్, రంగారెడ్డితోపాటు కొన్ని జిల్లాల్లో కొందరు తమ ఆధార్‌నంబరును అనుసంధానం చేయించుకోలేదు. అలాంటి వారు ఇప్పటికైనా అధికారులకు ఆధార్ సంఖ్య ఇవ్వాలి. ఆధార్ నంబర్ ఇవ్వని వారి భూములను బినామీలుగా గుర్తించే అవకాశం ఉంది' అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ప్రత్యేక అధికారి వాకాటి కరుణ, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి టీఆర్టీ

- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లుపూర్తి
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ
- నేడు పరీక్ష రాయనున్న 34,827 మంది అభ్యర్థులు
- 45 నిమిషాల ముందే ఎగ్జామ్ సెంటర్‌లోకి వెళ్లాలి
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి జరుగనున్న ఉపాధ్యాయ నియామక పరీక్షల (టీఆర్టీ) నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని టీఎస్‌పీఎస్సీ చెర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. అభ్యర్థులు 45 నిమిషాల ముందుగానే పరీక్ష కేంద్రంలోకి రావాలని సూచించారు. బయోమెట్రిక్ వివరాలు పూర్తిచేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియ తప్పనిసరని పేర్కొన్నారు. శనివారం రాష్ట్రంలోని అన్ని సెంటర్లలో కలిపి 34,827 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. 8,792 టీచర్ పోస్టుల కోసం 2,77,574 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం నుంచి మార్చి 4వ తేదీ వరకు ఐదు విభాగాల్లోని పోస్టులకు 48 క్యాటగిరీల్లో పరీక్షలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఘంటా చక్రపాణి మీడియాతో మాట్లాడుతూ.. అఫ్‌లైన్ విధానంలో రాసే పరీక్ష కంటే ఆన్‌లైన్ పరీక్షే తేలికని చెప్పారు. అభ్యర్థులు కసరత్తు చేసేందుకు ఇప్పటికే ఆన్‌లైన్లో మాక్‌టెస్ట్‌ను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. 'అందుబాటులో ఉన్న కంప్యూటర్లకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను కేటాయించాం. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న కళాశాలలను ఎక్కువగా ఎంచుకొని, ఆయా సెంటర్లన్నింటిలో పరీక్ష రాసేందుకు 20 నుంచి 30 వేల కంప్యూటర్లను సిద్ధంచేశాం. జిల్లాలవారీగా కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని కోదాడలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశాం. ఒకవేళ కంప్యూటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే.. వెంటనే పరిష్కరించేలా ప్రతి సెంటర్‌లో సిబ్బందిని అందుబాటులో ఉంచాం. హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేశాం. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాల దగ్గర జరిగే విషయాలను బిగ్ స్క్రీన్‌పై పర్యవేక్షిస్తాం. అభ్యర్థులకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టిన ఎనిమిది రకాల సూచనలను తప్పకుండా పాటించాలి' అని ఘంటా చక్రపాణి వివరించారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో పదిమంది సిబ్బందితో హెల్ప్‌డెస్క్ పనిచేస్తున్నదని, సందేహాలుంటే సంప్రదించాలని ఆయన సూచించారు. పరీక్షలన్నీ పూర్తయ్యేదాక రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హెల్ప్‌డెస్క్ పనిచేస్తుందని చెప్పారు. ఈ నెల 25వ తేదీన జరిగే ఎస్జీటీ, మార్చి 4న జరిగే స్కూల్ అసిస్టెంట్ మినహా అన్ని పరీక్షలు ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కాళేశ్వరంతో అద్భుత ఫలితాలు ఖాయం

- యునెస్కో ఆధ్వర్యంలో చేపడుతున్న పథకంతో పోల్చిన బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్
- ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ప్రశంసపై మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు దేశ విదేశీ ప్రతినిధులు సైతం అబ్బురపడుతున్నారు. విదేశాల్లో ఉన్న ప్రాజెక్టుల స్థాయిలో సేవలు అందిస్తాయని ఆకాంక్షిస్తున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ తాజాగా యునెస్కో ఆధ్వర్యంలో చేపడుతున్న పథకంతో కాళేశ్వరం ప్రాజెక్టును పోల్చారు. బాలి దేశంలో 'సుబక్ వాటర్ ఇరిగేషన్ సిస్టం' పేరుతో యునెస్కో పనిచేస్తున్నది. తాజాగా ఆ దేశాన్ని సందర్శించిన ఆండ్రూ ఇటీవలి తన కాళేశ్వరం పర్యటనను గుర్తుచేసుకున్నారు. 'బాలిలో యునెస్కో ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాల ద్వారా ఎలాంటి చక్కని ఫలితాలు అందుతున్నాయో.. అదేరీతిలో తెలంగాణలో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌తో కూడా అలాంటి అద్భుతమైన ఫలితాలు అందుతాయి' అని ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. దీనికి మంత్రి కేటీఆర్ మరో ట్వీట్‌లో స్పందిస్తూ 'ఆండ్రూ మీరు కాళేశ్వరాన్ని సందర్శించినందుకు సంతోషం. ఆ ప్రాజెక్టు ప్రత్యేకతను మీరు గుర్తించినందుకు చాలా ఆనందదాయకంగా ఉంది.' అని కృతజ్ఞతలు తెలిపారు.



బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ రీ ట్వీట్

బాబ్లీ నుంచి 0.60 టీఎంసీలు వదులండి

మహారాష్ట్రకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సుప్రీంకోర్టు ఆదేశానుసారం మార్చి ఒకటో తేదీన బాబ్లీ ప్రాజెక్టు నుంచి దిగువకు 0.60 టీఎంసీల నీటిని వదులాలని తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రకు లేఖ రాసింది. ఈ మేరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీరు జీ శ్రీనివాస్‌రెడ్డి మహారాష్ట్రలోని నాందేడ్ ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈకి శుక్రవారం లేఖ పంపారు. 2013 ఆగస్టు 28న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రతిఏటా మార్చి ఒకటో తేదీన నీటి లభ్యత ఉన్నట్లయితే బాబ్లీ నుంచి దిగువకు 0.60 టీఎంసీలు వదలాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆ రోజు తెలంగాణ ఇంజినీర్లు అక్కడికి వెళ్లి సంబంధిత ప్రాజెక్టు ఇంజినీర్లతో కలిసి ఈ ప్రక్రియ నిర్వహించడం ఆనవాయితీ.


గోదావరిపై మినీ లిఫ్టు

జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలో గోదావరి నదిపై బొర్నపల్లి-2 మినీ లిఫ్టు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించేందుకుగాను నిధులిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఎంసెట్‌లోకి బీఎస్సీ ఫారెస్ట్రీ

- నిబంధనలు సవరిస్తూ నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంసెట్ నిర్వహణ నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఎంసెట్ పరిధిలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బీఎస్సీ, మెడికల్, వెటర్నరీ కోర్సులు ఇప్పటికే ఉండగా, ఇకనుంచి బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సును చేర్చనున్నట్టు పేర్కొన్నది. ఈ కోర్సు చదువాలనుకొనేవారు ఇకనుంచి ఎంసెట్ ద్వారా ప్రవేశం పొందాల్సి ఉంటుంది. ఈ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థుల వయసు 2017 డిసెంబర్ 31 నాటికి 17 ఏండ్లు నిండాలని, గరిష్ఠ వయసు బీసీ అభ్యర్థులకు 22 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ కులాలవారికి 25 ఏండ్లుగా నిర్ణయించారు. ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులు చదివినవారు అర్హులు.



టీఆర్టీ నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)ను నిలిపివేయాలనే అభ్యర్థనలను శుక్రవారం ఉమ్మడి హైకోర్టు తిరస్కరించింది. చివరి నిమిషంలో అనేక సాకులు చెప్తూ పరీక్షలను నిలిపివేయాలని అభ్యర్థించడమేమిటని ప్రశ్నించింది. లక్షలమంది అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమైన తర్వాత, శనివారం పరీక్షలు ప్రారంభమవుతున్నాయని గుర్తుచేసింది. ఓఎంఆర్ షీట్‌తో మ్యానువల్‌గా కాకుండా ఆన్‌లైన్ ద్వారా టీఆర్టీని నిర్వహించడాన్ని నిలిపివేయాలని అత్యవసరంగా దాఖలుచేసిన వ్యాజ్యంపై జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పరీక్షలను నిలిపేసేందుకు నిరాకరించింది. ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలనేది నోటిఫికేషన్ సమయంలోనే పేర్కొన్నదని ఏజీ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వివరించారు.

మెడికల్ పీజీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) శుక్రవారం షెడ్యూల్ విడుదలచేసింది. మార్చి 12 నుంచి మే 18 వరకు మెడికల్ పీజీ కోర్సులకు ప్రవేశ కౌన్సెలింగ్, విడుతలవారీగా ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయనున్నది. మెడికల్ పీజీసీట్లలో ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్ తేదీలను వేర్వేరుగా నిర్ణయించారు. తెలంగాణ పరిధిలోని వైద్యకళాశాలలకు సంబంధించిన మెడికల్ పీజీ ప్రవేశానికి మొదటివిడుత కౌన్సెలింగ్‌ను మార్చి 25 నుంచి ఏప్రిల్ 5వరకు నిర్వహించి ఏప్రిల్ 12లోపు ప్రవేశాలను పూర్తిచేస్తారు. రెండో విడుత పీజీ ప్రవేశ కౌన్సెలింగ్‌ను ఏప్రిల్ 15 నుంచి 26వ తేదీవరకు చేపట్టి మే 3 వరకు ప్రవేశాలను పూర్తిచేయనున్నారు. అడ్మిషన్ సీట్లు మిగిలితే మే 4 నుంచి 8 వరకు మలివిడుత కౌన్సెలింగ్ నిర్వహించి మే 12 వరకు ప్రవేశ ప్రక్రియను పూర్తిచేయాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా షెడ్యూల్‌లో పేర్కొన్నది.







రెండు చరుపులు చరిచారని దర్యాప్తు చేయడానికి పోలీసులు ముఖ్యమంత్రి నివాసాన్ని సోదా చేశారు. న్యాయమూర్తి లోయా హత్య అనుమానితులను ప్రశ్నించదగినది కాదా? నా నివాసాన్ని సోదా చేయడంలో చూపిన ఉత్సాహాన్ని, ధైర్యాన్ని లోయా కేసులో అమిత్ షాను ప్రశ్నించడంలో చూపితే దేశం ప్రశంసిస్తుంది.

కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

ఆమ్ ఆద్మీ పార్టీ గూండాల పార్టీ అని రుజువు చేసుకున్నది. ముఖ్యమంత్రి తన ముందే చీఫ్ సెక్రటరీపై దాడి చేయించడంతో, రాజ్యాంగ సంక్షోభం ఏర్పడ్డది. ఆప్ నేతలు ఇతరులకు నీతులు చెబుతారు. కానీ వీరు చట్టాన్ని ఉల్లంఘించడంతో ఇరువైమంది ఎమ్మెల్యేలను రాష్ట్రపతి అనర్హులుగా ప్రకటించారు. ఆప్ మూడేండ్ల పాలనలో ఢిల్లీ ముప్పై ఏండ్లు వెనకకు పోయింది. సర్కారు దవాఖానాల పరిస్థితి కూడా అధ్వాన్నంగా మారింది.



మనోజ్ తివారీ, ఢిల్లీ బీజేపీ నేత

చరిత్రలో నేడు



1944
యుద్ధ మంత్రి జువాన్ పెరాన్ నేతృత్వంలో అర్జెంటీనాలో తిరుగుబాటు.

1966
ఘనాలో తిరుగుబాటు. అధ్యక్షుడు క్వామే నుక్రుమాహ్ పదవీచ్యుతి.





2008
దాదాపు యాభై ఏండ్ల పాలన తరువాత క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో పదవీ విరమణ.

బడుల్లో పిల్లలు తుపాకీ కాల్పులు జరుపకుండా నిరోధించడానికి ఉపాధ్యాయులూ తుపాకులు పట్టుకోవడానికి శిక్షణ ఇవ్వాలని ట్రంప్ అంటున్నారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ నాయకుడు లా పియర్ కూడా దుర్మార్గుడి తుపాకీని ఎదుర్కోవడానికి ఉత్తముడు తుపాకీ పట్టుకోవాలని సెలవిచ్చారు! విద్యార్థి కాల్పులకు భయపడిన ఉపాధ్యాయులు- తరగతి గదిలో, బయట కానీ- ఆ బాలుడిని అదుపు చేయడానికి పోరాటానికి దిగి విద్యార్థులను గాయపరుస్తుంటే పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవడం కష్టమేమీ కాదు. పిల్లలకు ఆయుధాలు అందకుండా చేయడమే అసలైన పరిష్కారం.

ది న్యూయార్క్ టైమ్స్

మానవ హక్కులకు భంగం కలుగుతున్నదంటూ అమెరికా ఇతర దేశాల వైపు వేలెత్తి చూపిస్తూ ఉంటుంది. కానీ అమెరికా చేసే యుద్ధాలలో మరణించే ఆ దేశ సైనికుల కన్నా, దేశంలో తుపాకులకు బలై ఇంకా ఎక్కువ మంది మరణిస్తున్నారు. చైనాలో తుపాకుల వాడకంపై కఠిన నిబంధనలు ఉన్నాయి. ఈ విషయంలో అమెరికా చైనా నుంచి నేర్చుకోవాలి. మానవ హక్కులను కాపాడుకోవాలి. తుపాకులను నియంత్రించడం తప్ప అమెరికాకు మరో దారిలేదు. మానవ హక్కులలో జీవించే హక్కు అత్యంత ప్రాథమికమైనది. తుపాకీ కలిగి ఉండే హక్కు జీవించే హక్కును మించినది కాదు.

గ్లోబల్ టైమ్స్

ట్రూడో పర్యటన

కెనడా ప్రధాని ట్రూడో మన దేశంలో వారం రోజుల పాటు పర్యటించినా ప్రభుత్వం కానీ, మీడియా కానీ పెద్దగా పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ఒకప్పుడు జీ7 కూటమిలో ప్రధాన పాత్ర పోషించిన కెనడా పెద్ద దేశాలలో ఒకటి. రాజకీయాలలో చిన్న వయస్కుడు, ఉదారవాద నాయకుడు అయిన ట్రూడోకు ఇతర దేశాలలో రాక్‌స్టార్‌కు ఉన్నంత క్రేజ్ ఉన్నది. కానీ ఆయన పట్ల మన ప్రభుత్వం, మీడియా పట్టనట్టు ఉండటానికి కారణం– ఆయన కెనడాలోని ఖలిస్థాన్‌వాదులతో చెట్టాపట్టాలేసుకు తిరుగడం. ఇతర పెద్ద దేశాల నాయకులు వచ్చినప్పటి మాదిరిగా, ట్రూడోను ప్రధాని మోదీ విమానాశ్రయానికి వెళ్లి ఆహ్వానించలేదు. తన సహజశైలిలో ఆహ్వానం పలుకుతూ ట్వీట్ కూడా చేయలేదు. ట్రూడో తాజమహల్ సందర్శిస్తే జిల్లా అధికారులు తప్ప ఇతర పెద్దలు లేరు. గుజరాత్ సందర్శించినప్పుడు మోదీ వెంటలేరు. ట్రూడో పర్యటన ముగింపు దశలో మాత్రం శుక్రవారం నాడు ప్రధాని మోదీ ఢిల్లీలో స్వాగతం పలికారు. కొన్నిరంగాలలో ఒప్పందాలు కూడా కుదిరాయి. అటు స్వదేశంలోని సిక్కులను ఆకట్టుకోవాలె, ఇటు భారత్‌తో సంబంధాలు మెరుగుపరుచుకొని వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలనేది ట్రూడో ఆశ. కానీ ఈలోగా ఖలిస్థాన్ సానుభూతి పరుడు జస్పాల్ అత్వాల్ వివాదం తలెత్తడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. ట్రూడో పర్యటన ఉదంతం ద్వారా అవసరమైతే భారత్ ఎంత కఠువుగా వ్యవహరిస్తుందో ఇతర దేశాలకు చాటినట్టయింది. భారత్ ఇంత కఠువుగా వ్యవహరించడానికి కెనడాలో, పాశ్చాత్య దేశాలలో సాగుతున్న ఖలిస్థాన్ కార్యకలాపాలు కారణం.

పంజాబ్‌లో ఉగ్రవాదం మటుమాయమైనప్పటికీ, కెనడాలో ఖలిస్థాన్ వేర్పాటువాద భావజాలం ఇంకా బలంగా ఉన్నది. ఒక్క కెనడాలోనే కాదు, పాశ్చాత్య ప్రపంచమంతా కొత్త రూపంలో ఇంకా బలమైన పునాదితో ఖలిస్థాన్ ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఖలిస్థాన్ భావజాలం ఉగ్రవాద రూపంలో సఫలం కాదని భావించిన వారు ఇప్పుడు భిన్న పంథా చేపట్టారు. 'రిఫరెండం 2020' పేర రెండేండ్ల వ్యవధిలో ఖలిస్థాన్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరపాలనే ప్రచారోద్యమం సాగుతున్నది. కొద్ది కాలం కిందట కెనడా గురుద్వారాలలోకి భారతీయ రాయబారులు రావడాన్ని నిషేధించారు. ఇప్పుడు ఈ నిషేధం అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు పాకింది. ఇటీవల పంజాబ్‌లో స్కాట్లాండ్‌కు చెందిన జగ్గార్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై హిందువాద సంస్థలకు చెందిన వారి హత్యకు బాధ్యుడనే అభియోగం ఉన్నది. [illegible] ఆయనను విడుదల చేయాలనే ప్రచారం విదేశాలలో సాగుతున్నది. కెనడా రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తున్న వారు భారత వ్యతిరేక ప్రచారంలో ప్రముఖ పాత్ర పోషిస్తుండటం గమనార్హం. ఖలిస్థాన్ ఉద్యమాన్ని తిరగదోడే పరిణామాలు భారత-కెనడా సంబంధాలను ప్రభావితం చేస్తున్నాయి. 1980 దశకంలో ఖలిస్థాన్ ఉగ్రవాదులు పంజాబ్‌లో చెలరేగిపోతున్నప్పుడు, కెనడాలోని సిక్కుల నుంచి భారీగా మద్దతు లభించింది. కెనడా కూడా క్యుబెక్ రాష్ట్రంలో వేర్పాటువాదాన్ని ఎదుర్కొంటున్నది. ఫ్రెంచి మాట్లాడేవారు అధికంగా ఉన్న ఈ రాష్ట్రం కెనడా నుంచి వేరుపడాలనే వాదన ఉన్నది. వేర్పాటువాదం పాశ్చాత్య దేశాలలోనూ ఉన్నది. అమెరికా కూడా ఒకప్పుడు అంతర్యుద్ధాన్ని ఎదుర్కొన్నది. దక్షిణాది రాష్ట్రాలు విడిపోవాలని యత్నించినప్పుడు. అత్యంత క్రూరంగా అణచివేసింది. అణచివేత విధానాలు సమర్థనీయం కాదు కానీ, పాశ్చాత్య దేశాలు తమకో న్యాయం, ఇతరులకో న్యాయం అన్నట్టు గా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయి.

ప్రపంచ దేశాల ముందు మన దేశంలో అన్నివర్గాల పట్ల సమభావం ఉందని సమర్థించుకోవడం కష్టం. భారత్ ఉదారవాద, బహుళ సమాజమనీ, ప్రజాస్వామ్య వ్యవస్థ అనీ పాశ్చాత్య సమాజాన్ని మెప్పించగలగాలె. ఇదే విధంగా సిక్కులు ఖలిస్థాన్ భావజాలం వైపు మొగ్గకుండా, మన రాజకీయ విలువలను బోధించాలె. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన దేశం ఆచరిస్తున్న రాజకీయ విలువలే బలమైన ప్రచారాంశాలు.

కెనడాలోని దాదాపు మూడున్నర కోట్ల మొత్తం జనాభాలో సిక్కులు నాలుగైదు లక్షల మంది ఉంటారు. కానీ వీరంతా కొన్ని ప్రదేశాలలో కేంద్రీకృతమై ఉండటం వల్ల వీరి ఓట్లు కీలకమైనవిగా మారాయి. ఉదారవాద భావజాలం గల జస్టిన్ ట్రూడో సిక్కుల పట్ల సానుభూతితో ఉంటున్నారు. మోదీ క్యాబినెట్‌లో కన్నా తమ మంత్రివర్గంలో ఎక్కువమంది సిక్కులు ఉన్నారని ట్రూడో వ్యాఖ్యానించారు. ఖలిస్థాన్ అనుకూల ఖాల్సా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ట్రూడో పర్యటన పట్ల ప్రధాని మోదీ మొదలుకొని పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ వరకు అంతా పార్టీ విభేదాలకు అతీతంగా ఏకాభిప్రాయంతో వ్యవహరించినట్టు కనిపిస్తున్నది. అయితే ట్రూడోపై ఎంత ఒత్తిడి తెచ్చినా కెనడాలో ఆంతరంగిక రాజకీయాల్లో ఆయన విధానాన్ని ప్రభావితం చేయడం కష్టం. కెనడాపై దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చి కొంత వరకు ఖలిస్థాన్‌వాదులను కట్టడి చేయవచ్చు. కానీ పాశ్చాత్య దేశాలలో ప్రబలంగా ఉన్న ఖలిస్థాన్ ప్రచారాన్ని దౌత్యమార్గాల ద్వారానే తిప్పికొట్టడం సాధ్యం కాదు. మన దేశంలో మతపరమైన కేంద్రీకరణ జరిగి, మత విద్వేష దాడులు సాగుతుంటే, ఖలిస్థాన్‌వాదులకు ఆయుధాలను ఇచ్చినట్టు అవుతుంది. ప్రపంచ దేశాల ముందు మన దేశంలో అన్నివర్గాల పట్ల సమభావం ఉందని సమర్థించుకోవడం కష్టం. భారత్ ఉదారవాద, బహుళ సమాజమనీ, ప్రజాస్వామ్య వ్యవస్థ అనీ పాశ్చాత్య సమాజాన్ని మెప్పించగలగాలె. ఇదే విధంగా సిక్కులు ఖలిస్థాన్ భావజాలం వైపు మొగ్గకుండా, మన రాజకీయ విలువలను బోధించాలె. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన దేశం ఆచరిస్తున్న రాజకీయ విలువలే బలమైన ప్రచారాంశాలు.

జనగళం

కఠినంగా వ్యవహరించాలి

నగరంలో రోడ్ల మీద వాహనాలు నడిపే వారు తగిన నిబంధనలు పాటించడంలేదు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా యాక్సిడెంట్లు కూడా జరుగుతున్నాయి. దీనిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలి. అలాగే సిగ్నల్స్ దగ్గర ఫ్రీ లెఫ్ట్ నిబంధనను కూడా ఉల్లంఘిస్తున్నారు. అనవసరంగా హారన్ మోగిస్తుంటారు. ఇప్పటికే నగరంలో కాలుష్యం పెరిగిపోయిందని, దీనికితోడు శబ్ద కాలుష్యానికి ఇది కారణమౌతున్నదని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. వాహనదారులు ఒక క్రమపద్ధతి పాటించడకపోవడం వల్లే ఈ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. కాబట్టి అధికారులు నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలి. అప్పుడే ట్రాఫిక్ సమస్యలతో పాటు అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి.

- జి. రాజశేఖర్, హైదరాబాద్

మంచిరోజులు

రాష్ట్ర ప్రభుత్వం సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు పెద్ద పీట వేసింది. దీనికి అనుగుణంగా ప్రాజెక్టుల నిర్మాణం కూడా వేగంగా జరుగుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన వ్యవసాయరంగానికి కూడా పూర్వవైభవం తేవడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్ర పాలకులు వ్యవసాయం గురించి మాటల్లోనే చెప్పడం తప్ప ఆచరణలో చేసింది శూన్యం. అందుకే వ్యవసాయ రంగంలో ఆశించిన మార్పులు జరుగలేదు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్నంటున్న చర్యవల్ల వ్యవసాయరంగానికి మంచిరోజులు వస్తాయి.

- నోముల రాజేశ్, సంగారెడ్డి

వాస్తవాలు విస్మరిస్తే ఎలా?

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల కోసం అనేక నోటిఫికేషన్లు విడుదల చేసింది. నిరుద్యోగులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కానీ ప్రతిపక్షపార్టీలకు చెందిన కొందరు నేతలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రావడం లేదనడం సరికాదు. ప్రజాప్రతినిధులుగా ఉన్నవాళ్లు వాస్తవాలను విస్మరించి అసత్యాలను ప్రచారం చేయడం సరికాదు.

- చందన శ్రీనివాస్, వికారాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

పీవీ గారి గొల్ల రామవ్వ

బహుభాషల పండితుడు, బహుముఖ ప్రతిభావంతుడు పాములపర్తి నరసింహారావు (మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు) సాహిత్య రంగానికి చేసిన సేవను జ్ఞాపకం చేసుకోవడానికి ఇటీవల ఫిబ్రవరి (2018) 15వ తేదీన హైదరాబాద్‌లో స్వామి రామానందతీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో, పి.వి. స్మారక గ్రంథాలయంలో ఒక సమావేశం జరిగింది.

పీవీ వరంగల్లు–హనుమకొండ పట్టణాల్లో విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఢిల్లీలో భారత ప్రధానిగా గురుతర పదవీ బాధ్యతలు నిర్వహించే వరకు అనేక దశాబ్దాలు నిర్విరామ కృషితో, ఒక నిర్విఘ్న తపస్సుగా వివిధ భారతీయ భాషల్లో సృష్టించిన సమున్నత, సముజ్వల సారస్వత శిఖరాలను ఒక ముకురంలో వీక్షించడానికి జరిపిన వినయపూర్వక ప్రయత్నం ఇది. అనేక భాషల్లో (భారతీయ భాషలు, కొన్ని విదేశీ భాషలు గూడ) పి.వి. అలుపులేకుండా సృజించిన సుందర, సృజనాత్మక వాఙ్మయ విశ్వంలో అంచుల దాకా, అన్ని లోతుల్లోకి వెళుతూ విహరించడం సులభం కాదు. శ్వాస ఆడటానికి ఢిల్లీలో వెంటిలేటర్ సహాయం పొందే వరకు ఆయన విజ్ఞాన జిజ్ఞాస, సాహిత్య పిపాస కొనసాగాయంటే అతిశయోక్తి కాదు. చివరి రోజుల్లో ఆయన ఒక మళయాళీ నవలపై మణిపూస వంటి సమీక్ష రాసి సాహిత్య ప్రియులందరికీ సంభ్రమాశ్చర్యాలు కలిగించారు. చదువుల తల్లి ముద్దుబిడ్డ పి.వి. అనారోగ్యం బాధిస్తున్న రోజుల్లో సైతం ఇంటికి వెళ్లి గ్రంథపఠనం, గ్రంథ రచన, సాహిత్య సేవ చేయాలనుకున్నారు గానీ, అధికారం కోసం ఆరాటపడలేదు. అయాచితంగా, ఆయన సామర్థ్యానికి, నాయకత్వదక్షతకు అగ్నిపరీక్షగా వచ్చింది ప్రధాని పదవి. ప్రధాని పదవీ కాలం ముగిసిన పిదప 1999 నవంబర్ 1వ తేదీన జె.ఆర్.డి. టాటా స్మారక ప్రసంగం కావిస్తూ పి.వి. అందులో తన ప్రియమిత్రుడు, కవి సోదరుడు కాళోజీ 'నా గొడవ' లోని ఓ గీతానికి తాను చేసిన ఇంగ్లీషు అనువాదాన్ని ఉదహరించారు. 'అవనిపై జరిగేటి అవకతవకలు చూసి ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు' గేయాన్ని పి.వి. అంతే విగర్‌తో ఆంగ్లంలోకి అనువదించారు. ఎన్ని దేశీ, విదేశీ భాషలలో అపార వైదుష్యం ఉన్నప్పటికీ, ఎన్ని భాషలలో ఉద్దండ పండితుడు అయినప్పటికీ పి.వి. మదిలో, మస్తిష్కంలో ఉన్నత పీఠం మీద కూర్చున్నది ఒకే ఒక భాష- అది ఆయనకు ఎంతో ఇష్టమైన మాతృభాష తెలుగు. పి.వి. మాట్లాడినా, రాసినా, సంభాషించినా, ప్రసంగించినా మధురమైన తెలుగు నుడికారం, పదబంధ పారిజాతాలు పరిమళాలను వెదజల్లాయి. హనుమకొండలో విద్యార్థి దశ నుంచి పూనాలో, నాగపూరులో ఉన్నత విద్యార్జన వరకు పాఠ్యాంశాలపై పట్టు సాధించి డిగ్రీల్లో స్వర్ణపతకాలు పొందినప్పటికీ పి.వి. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ తదితర అనేక భాషల ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను దృఢదీక్షతో మదించి అధ్యయనం చేశారు. వరంగల్లులో గురువు గార్లపాటి రాఘవరెడ్డి వద్ద శుశ్రూషతో తెలుగు, సంస్కృతం ప్రాచీన సాహిత్య సంపదను సొంతం చేసుకున్న పి.వి. గురువు గారికి దక్షిణగా ఉడుతాభక్తితో ఆంగ్ల సారస్వత రత్నాలను ఆయనకు పరిచయం చేసి ప్రశంసలు పొందారు. పి.వి. కవి, రచయిత, సాహిత్య విమర్శకుడు, విశ్లేషకుడు, కథకుడు, నవలా రచయిత, సమీక్షకుడు, అనువాదకుడు, సంపాదకుడు, అవిరళ పాఠకుడు, పీఠికా నిర్మాత, అనేక భాషలలో అనర్గళ వక్త, నటుడు (విద్యార్థిగా ఆయన స్త్రీ పాత్రలు ధరించేవాడట. అన్నిపాత్రల డైలాగులు ఆయనకు కంఠస్తమట!), కళాకారుడు, సంగీతజ్ఞుడు, క్రీడాకారుడు గూడ– What not!.

గేయ, పద్యరచనలో, గద్య రచనలో ఆయన అఖండ ప్రతిభావంతుడు; అందెవేసిన చేయి. 1948 సెప్టెంబర్‌లో హైదరాబాద్ సంస్థానం, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతం, రాచరిక పాలన నుంచి, అరాజక కృత్యాల నుంచి విముక్తమైన పిదప పి.వి., పాములపర్తి సదాశివరావు సంయుక్త సంపాదకత్వంలో వరంగల్లు నుంచి వెలువడిన 'కాకతీయ' టాబ్లాయిడ్ వారపత్రిక తెలుగు పత్రికారంగంలో ఒక వినూత్న ప్రయోగం, ఉజ్వల అధ్యాయం. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సారస్వత, సాంస్కృతిక అంశాలన్నీ 'కాకతీయ' వార పత్రికలో ప్రాధాన్యం వహించాయి. ఈ అన్ని అంశాల మీద పి.వి., సదాశివరావు ఎన్నో పెన్ నేమ్‌లతో విలువైన రచనలు అందించారు. పి.వి. రాసిన, కాకతీయ పత్రికలో ప్రచురించిన ఆర్త గీతికలు పద్యాలు ఆ రోజుల్లో అందరి నోట వినిపించేవి. ఇప్పుడవి లభ్యం కాకపోవడం విచారకరం.

స్వాతంత్ర్యానంతరం పదేండ్లు (1947–57) పి.వి. పార్టీ పదవుల్లో, స్వామి రామానంద తీర్థ అనుయాయిగా తీరికకు దూరమైనారు. తరువాత 1957 నుంచి 1997 వరకు దీర్ఘకాలం పి.వి. మొదట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, అనంతరం, కేంద్రంలో అనేక కీలక మంత్రిత్వ శాఖల మంత్రిగా, అత్యంత క్లిష్టకాలంలో దేశ ప్రధానిగా (ఆర్థిక విధానాల సంస్కర్తగా) రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో పరిపాలనా దక్షుడై, రాజనీతిజ్ఞుడై, అపర చాణక్యుడై, అగ్రదేశాల అధినేతలకు సైతం మార్గదర్శి అయి ప్రసిద్ధి పొందారు–ఆయన నేతృత్వంలో ఖలిస్థాన్ టెర్రరిజం అంతమైంది. జమ్ముకశ్మీరు శాంతి సామరస్యాలతో కళకళలాడింది. (ఇప్పటి అశాంతికి, అరాజకత్వానికి భిన్నంగా), చైనా, పాకిస్తాన్ తదితర పొరుగు దేశాలతో ఈ దేశానికి స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి (ఇప్పటి శతృత్వానికి భిన్నంగా). పి.వి. ఆర్థిక సంస్కరణలు ఇప్పటి ఆర్థిక చర్యల వలె కోట్లాది దేశ ప్రజలకు ఇక్కట్లు కల్గించలేదు. నలభై ఏండ్లు జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో క్షణం తీరిక లేకపోయినప్పటికీ పి.వి. సాహిత్య ఆరాధనను విస్మరించలేదు. ఇదే నలభై ఏండ్ల అవిశ్రాంత కాలలో పి.వి. స్వర్ణలేఖిని నుంచి పలు భాషలలో, విశేషించి తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పుంఖాను పుంఖంగా అమూల్య రచనలు అనేకం వెలువడి శారదాంబకు అనర్ఘ ఆభరణాలుగా భాసించాయి. అహోరాత్రాలు శ్రమపడి పి.వి. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ నారికేళ పాక సాహిత్యంపై అహంకార భూషితుడైన విశ్వనాథను సైతం మెప్పించి ఒప్పించిన విశిష్ట ప్రసంగం కావించారు. విశ్వనాథ 'వేయిపడగలు' నవలను 'సహస్ర ఫణ్' పేరుతో హిందీలోకి అనువదించడం, ఆ అనువాదానికి సమస్త హిందీ సారస్వతాన్ని శ్లాఘనీయంగా సమీక్షించే ఒక అపూర్వ పీఠికను రచించడం పి.వి.కి మాత్రమే సాధ్యమయ్యే క్లిష్ట కార్యం. హిందీ రచయిత్రి, విదుషీమణి మహాదేవి వర్మ ఛాయావాదం తార్కికత పాఠకులకు సులభంగా జీర్ణం కానిది. పి.వి. హిందీలోనే మహాదేవి వర్మ హిందీ సాహిత్యాన్ని అద్భుతంగా సమీక్షించారు. మహాదేవి వర్మ రచనా వైశిష్ట్యాన్ని పి.వి. సాహిత్య లోకానికి చాటిచెప్పారు. పి.వి. తన విజ్ఞాన విపంచిని మీటి సారస్వత, అధ్యాత్మిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక, శాస్త్రీయ (సైన్స్), ఆర్థిక రంగాలకు సంబంధించిన ఏ విషయాన్ని స్పృశించి, రచించి, అక్షరాభిషేకం చేసినా అదొక సాహిత్యరత్న పేటిగా రూపుదాల్చింది. సాహిత్య ప్రమాణాలు, విలువలు గల అనర్గళ ప్రసంగాలు (జాతీయ, అంతర్జాతీయ వేదికలపై, ఇండియన్ పార్లమెంట్‌లో) స్నాతకోపన్యాసాలు కావించి పి.వి. గొప్ప వక్తగా, పార్లమెంటేరియన్‌గా, మహా మేధావిగా, విజ్ఞానవేత్తగా ప్రసిద్ధి పొందారు.

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పి.వి. ప్రసంగ ఝరి ప్రపంచ నేతలను అలరించింది. ఈ ప్రసంగం భారత వైదేశిక నీతిని రూపొందించే వారికి కరదీపిక వంటిది. పి.వి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారత స్వాతంత్ర్య రజతోత్సవం జరిగింది. హైదరాబాద్ నగరంలో కాళోజీ కవి షష్టిపూర్తి ఉత్సవం జరిగింది. 1972 ఆగస్టు 15 అర్ధరాత్రి పి.వి. రాష్ట్ర శాసనసభలో 'ఆ నిద్రాణ నిశీధిని మానిసి మేల్కాంచినాడు...' గేయం చదివినప్పుడు (ఆయన రాసిన గేయం) నెహ్రూ ''Tryst with Destiny'' చరిత్రాత్మక ప్రసంగం జ్ఞాపకం వచ్చింది. పి.వి. భావనాశక్తి, కవిత్వ కౌశల్యం ఈ గేయంలో ప్రదర్శితమయింది. '...ఈ నిద్రాణ నిశీధి మహిత జాగృతి పుంజముగ వెలుగుటయే నా తపస్సు, వెలిగించుట నా ప్రతిజ్ఞ' అంటూ గేయాన్ని ముగించారు. కాళోజీ షష్టిపూర్తి ప్రత్యేక సంచికకు రాసిన గేయంలో పి.వి. తనకు ఆప్తుడైన కాళోజీ వ్యక్తిత్వాన్ని అద్భుతంగా చిత్రించారు.

వరంగల్లులో, కాకతీయ విశ్వవిద్యాలయం నాలుగవ స్నాతకోత్సవంలో పి.వి. స్నాతకోపన్యాసం ఆయన ఆంగ్ల భాషా వైదుష్యానికి, సాహిత్య ప్రమాణాలకు, చారిత్రక దృక్పథానికి, అభ్యుదయ వైఖరికి పతాకస్థాయి; ఆ ప్రసంగంలో తన పుట్టిల్లు వరంగల్లు గురించి ఆయన చెప్పిన మాటలు –'Being part of Warangal I have often wondered why Warangal is what it is. I suddenly discovered that not only now, but down the centuries this little known place has had an distinctive characteristic. It has been a centre of dissent and a citadel of defiance. It has never been without ferment - intellectual, cultural, socio-political. This was the place of Rudramadevi and Vidyaranya - One a symbol of defiance and the other of dissent against decadence.' పి.వి. తెలుగు సారస్వత సృష్టిలో తలమానికం 'గొల్లరామవ్వ' కథ. పి.వి. డెబ్బై ఏండ్ల కిందట అప్పటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు దర్పణంగా రాసిన ఈ కథలో ప్రధానపాత్ర రామవ్వ వయస్సు డెబ్బై ఏండ్లు. ఆ వయస్సులో రామవ్వ స్వాతంత్ర్య సమరయోధుడైన ఒక యువకుడిని అప్పటి నిజాం పోలీసుల ముష్కరత్వం నుంచి కాపాడడానికి ప్రదర్శించిన ధైర్య సాహసాలు, సమయస్ఫూర్తి, చాకచక్యం, మాటకారితనం పాఠకులకు ఆశ్చర్యం కలిగిస్తాయి. అన్నిటికంటే ఎక్కువగా ఆశ్చర్యం కల్గించేది పి.వి. కథాకథన నైపుణ్యం. ఇందులో ఉన్నవి మూడే పాత్రలు– రామవ్వ, మల్లమ్మ (యువతి), యువకుడు (స్వాతంత్ర్య సమర యోధుడు). కథకుడు పి.వి. శిష్ట వ్యావహారికంతో కథ నడుపుతాడు – ఆయనే వ్యాఖ్యాత. రామవ్వ, మల్లమ్మ ఆ పాత్రలకు తగిన తెలంగాణ గ్రామ్యంలో మాట్లాడుతారు. పాత్రోచిత భాష ఈ కథలోని ప్రత్యేకత. కాకలు తీరిన కథకులను సైతం మెప్పించే కథా శిల్పాన్ని, పాత్రీకరణను, పి.వి. ఇందులో ప్రదర్శించడం విశేషం. రామవ్వ కథను చదువడం మొదలు పెట్టినప్పటి నుంచి చివరి వరకు పాఠకులలో ఉత్కంఠను రేకెత్తించడం పి.వి. మరో ప్రత్యేకత.

> 'గొల్లరామవ్వ' కథ. పి.వి. డెబ్బై ఏండ్ల కిందట అప్పటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు దర్పణంగా రాసిన ఈ కథలో ప్రధానపాత్ర రామవ్వ వయస్సు డెబ్బై ఏండ్లు. ఆ వయస్సులో రామవ్వ స్వాతంత్ర్య సమర యోధుడైన ఒక యువకుడిని అప్పటి నిజాం పోలీసుల ముష్కరత్వం నుంచి కాపాడడానికి ప్రదర్శించిన ధైర్య సాహసాలు, సమయస్ఫూర్తి, చాకచక్యం, మాటకారితనం పాఠకులకు ఆశ్చర్యం కలిగిస్తాయి. అన్నిటికంటె ఎక్కువగా ఆశ్చర్యం కల్గించేది పి.వి. కథాకథన నైపుణ్యం.

సమకాలీన విద్యా నమూనా కావాలె

విద్య



ఎడమ శ్రీనివాసరెడ్డి

'విద్య వాగ్దానాలను ఎలా నెరవేర్చుకోవాలో నేర్చుకుందాం' (Learning to Realize Education's Promise)అనే శీర్షికతో ప్రపంచబ్యాంకు నివేదిక– 2018, గత ఏడాది నవంబర్‌లో విడుదలైంది. ప్రపంచబ్యాంకు నలభై ఏండ్లలో మొదటిసారిగా విద్యా విషయాల కేంద్రంగా నివేదికను ఇచ్చింది. సరైన విద్యా విధానాన్ని రూపొందించుకోవడానికి ఈ నివేదిక ఆరు అంశాలను ప్రస్తావించింది. విద్య వ్యక్తికి స్వేచ్ఛను ప్రసాదించేదిగా ఉండాలని చెప్పింది. పూర్వ ప్రాథమిక దశ ప్రాధాన్యాన్ని వివరించింది. విద్యలో టెక్నాలజీ వినియోగం పట్ల ఉండే అపోహలను తొలిగించుకోవాలని హెచ్చరించింది. ప్రైవేట్ రంగంలో విద్య ప్రభుత్వ రంగం కంటే బాగా ఉందని చెప్పడానికి ఆనవాళ్లు ఏమీ లేవని పేర్కొంది. చివరగా నేర్చుకోవడంలో కలుగుతున్న సంక్షోభాన్ని వివరిస్తూ ఉపాధ్యాయుల తయారీకి ఇవ్వవలసిన ప్రాధాన్యాన్ని, విద్యను వ్యక్తిగతంగా అందించవలసిన అవసరాన్ని తెలిపింది. ప్రపంచబ్యాంకు ఆదర్శాలకు, ఆచరణకు ఉన్న వైరుధ్యం, సరైన అభివృద్ధి నమూనా పట్ల దాని స్పష్టతలేని నిబద్ధత, ప్రైవేటీకరణను ప్రోత్సహించే విధానాలను పక్కనపెడితే విద్యారంగానికి సంబంధించి విస్మరించబడుతున్నమౌలిక విషయాలను మరోసారి ఈ నివేదిక ద్వారా గుర్తు చేసింది. రాజ్యాంగ ఆదర్శాలకు, విద్య ఆదర్శాలకు విపరీతమైన వైరుధ్యం ఉన్న మన సమాజానికి ఈ అంశాలన్నీ పాఠాలే అవుతాయి. వీటి నుంచి నేర్చుకోవాలి.

పూర్వప్రాథమిక దశను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన మనం ఈ దశకు చెందిన సుమారు 15 కోట్లమంది పిల్లలను విద్యాహక్కు చట్టం నుంచి దూరం చేశాం. ఈ దశలోనే పిల్లలకు సరైన పోషకాహారం లభిస్తేనే మెదడు అభివృద్ధి సరైనరీతిలో జరుగుతుంది. సరైన విద్యా అనుభవాలను అందించ గలిగితేనే సరైన జ్ఞానాభివృద్ధి జరుగుతుంది, ఈ దశలో ఇవి లోపిస్తే వీటిని మరే రకంగానూ తర్వాత ఏదశలోనూ పూరించలేం. ఈ దశలో లోపాలు వ్యక్తి అభివృద్ధికి, దేశాభివృద్ధికి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. అందుకే పూర్వ ప్రాథమిక దశ పిల్లల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యను సమ్మిళితం చేయడంలో చాలా పశ్చిమదేశాలు విజయం సాధించాయి. ప్రత్యేక అవసరాల పిల్లలు కూడా మిగతా పిల్లలతో సమానంగా ఒకే తరగతిలో కలిసి చదువుకోవడం పశ్చిమదేశాల్లో కనబడుతుంది. మన దేశంలో దీన్ని ఊహించలేం. తగిన సంఖ్యలో ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు గాని, వాటిలో పూర్తిస్థాయి నమోదు విషయాలను పరిశీలిస్తే విషాదమే మిగులుతుంది. సుమారు ముప్పై లక్షలున్న 6–14 సంవత్సరాల ప్రత్యేక అవసరాల పిల్లల్లో పది లక్షల పిల్లలకు బడి అంటే తెలియదు. మన తరగతిగది వాతావరణం గురించి మనకు మనం తప్పనిసరిగా వేసుకోవాల్సిన ప్రశ్నలు ఏమిటంటే, ఎంతమంది పిల్లలు ప్రశ్నలను సంధిస్తున్నారు? ఎంతమంది పిల్లలు కేవలం సమాధానాలు చెప్పడానికే పరిమితమవుతున్నారు? మొదటి ప్రశ్నకు జవాబు శూన్యమే. ఈ స్థితిలో మార్పు రాకుండా పిల్లల్ని నిర్దిష్ట సమాధానాలను వల్లె వేసే యంత్రాలుగానే తయారు చేసినంత కాలం నూతన విషయాల సృష్టి అంటూ ఉండదు. ఈ విషయంలో విద్యా ప్రక్రియలో పిల్లలు కూడా క్రియాత్మక భాగస్వాములే అని నమ్మే పశ్చిమదేశాల నుంచి చాలా నేర్చుకోవాలి. ఆయా స్థాయిలకు సంబంధించిన నిర్దేశిత కనీస ప్రమాణాలు సాధించబడటం లేదు అనే ప్రచారమే ఎక్కువగా జరుగుతున్నది. కాని దానికి కారణాలు, తగిన పరిహారాత్మక చర్యలను తీసుకోవడంలో ఏ మాత్రం ముందుచూపు గాని, తగిన ప్రణాళికలు గాని లేవు.

వైయక్తిక విద్యా బోధన, అభ్యసనల పట్ల, విద్యార్థి, ఉపాధ్యాయులకు ఉండవలసిన స్వేచ్ఛ పట్ల తగిన ఆచర ణ కనబడదు. అందరికీ ఒకే విధానంలో గాక ప్రతీ వారి అవసరానికి తగి న బోధన పరిస్థితులు లేనప్పుడు కనీస ప్రమాణాలు కూడా సాధించడం కష్టమవుతుంది. అసమానతలు ఎక్కువగా ఉన్న సమాజాల్లో అయితే ఇంకా కష్టం. ఈ మౌలిక అంశాన్ని వదిలేసి బోర్డ్ పరీక్షల ఫలితాల పైననే అనవసరమైన శ్రద్ధను అందరూ చూపుతుంటారు. దీనివల్ల విద్యా ప్రక్రియకు సంబంధించిన మిగతా విషయాలన్నీ విస్మరించబడి పరీక్షలే ప్రధానమైనాయి. విద్యా ప్రక్రియలోని ఒకే అంశం అన్నింటినీ ప్రభావితం చేస్తూ విద్యా వ్యవస్థను పరీక్షా వ్యవస్థగా మార్చేసింది. దీనివల్ల కనీసంగా నేర్పవలసిన విషయాలను నేర్పలేకపోవడంలో అవాంతరాలను గుర్తించడం, వాటిని తొలిగిస్తూ సరైన విధానాలను రూపొందించుకోవడం చేయలేకపోతున్నాం. అసర్ లాంటి సంస్థల నివేదికలు విడుదలైనప్పుడల్లా టీచర్లను తిట్టిపోసి చేతులు దులుపుకోవడం తప్ప అసలు సమస్యపై దృష్టి పెట్టడం లేదు. బోర్డ్ పరీక్షలైతే ఒక రణరంగంలా తయారయ్యాయి. పిల్లలను యుద్ధవీరులుగా తలిచే పరిస్థితులొచ్చాయి. పరీక్షలను యుద్ధంగా తలిచినపుడు గెలుపే ప్రధానమవుతుంది, యుద్ధనీతికి సంబంధించిన ప్రవచనాలు ఏవీ పనికిరావు. పరీక్షల్లో అక్రమాలు, కాపీ సంస్కృతి పెరుగడానికి ఇదే ప్రధాన కారణం. కొద్దిమంది వ్యక్తుల నాయకత్వం, అధికా రం, బాధ్యతలపై ఆధారపడిన కేంద్రీకృత అదుపు పై మన విద్యా వ్యవస్థ లు పనిచేస్తాయి. ప్రభుత్వాలు మారగానే విద్యా పథకాలు మారిపోతాయి. శాశ్వతమైన, దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు భంగం వాటిల్లకుండా వ్యవస్థలోని అన్నిఉపాంగాల మధ్య పరస్పర సంబంధాలతో పనిచేసే విద్యా వ్యవస్థ మంచి ఫలితాలను అందిస్తుంది. పిల్లల ఆసక్తులకు అనుగుణమైన సమగ్ర, సంపూర్ణ అభివృద్ధి కేంద్రంగా విద్యా సాధనను కొలిచినపుడు విద్యా సంస్థల పనితీరు తెలుస్తుంది. కొన్ని అకడమిక్ అంశాల పార్శ్వసాధనను మాత్రమే కొలిచే ప్రస్తుత కొలమానాలతో ప్రైవేటు విద్యా సంస్థలు బాగా పని చేస్తున్నాయనుకొనే భ్రమలను విడనాడాలి. విద్య సామాజికరంగంలో ఉన్నప్పుడే రాజ్యాంగ, విద్య ఆదర్శాల సాధన సాకారం అవుతుంది.

విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం అంటూ నియమించిన సుబ్రమణియన్ కమిటీ ఈ విషయాలనేమీ పరిగణనలోకి తీసుకోకుండా వివాదాస్పదమైంది. కస్తూరి రంగన్‌ను చైర్‌పర్సన్‌గా నియమించి ఏడు నెలల కాలం దాటినా నివేదికకు తుది రూపం రాలే దు. గత డిసెంబర్‌లోనే నివేదిక సమర్పించవలసి ఉండగా మరో మూడు నెలల సమయాన్నికస్తూరి రంగన్ ప్యానెల్ కోరింది. ఈ కమిటీ ఈ అంశాలను అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటుందా అనేది అనుమానమే. ఆలస్యమైనా ఇప్పటికీ ఈ నూతన విద్యా విధాన రూపకల్పన ప్రక్రియను సమకాలీనతతో, సాహసోపేత నిర్ణయాలతో, అర్థవంతంగా పూర్తి చేసుకోలేకపోయినట్లైతే భవిష్యత్ తరాలు క్షమించవు. యాభై రెండేండ్ల కిందట డి.యస్. కొఠారి విద్యా కమిషన్ నివేదికను అప్పటి విద్యామంత్రి ఛాగ్లాకు సమర్పిస్తూ రాసిన లేఖలో గతకాలపు విద్యా విధానాలు ప్రస్తుతానికి పనికిరావు, భవిష్యత్తుకైతే అసలే పనికిరావు అనే విషయాన్ని వేగంగా మార్పు లు పొందుతున్న ప్రస్తుత ప్రపంచం తప్పనిసరిగా గుర్తించాలి' అని వ్యాఖ్యానించారు. విద్యా నమూనాను సమకాలీనతతో మార్చుకోవాల్సిన అవసరం, దాని ప్రాధాన్యం ఆ వ్యాఖ్యలో కనబడుతుంది.

> యాభై రెండేండ్ల కిందట డి.యస్.కొఠారి విద్యా కమిషన్ నివేదికను అప్పటి విద్యామంత్రి ఛాగ్లాకు సమర్పిస్తూ రాసిన లేఖలో గతకాలపు విద్యా విధానాలు ప్రస్తుతానికి పనికిరావు. భవిష్యత్తుకైతే అసలే పనికిరావు అనే విషయాన్ని వేగంగా మార్పులు పొందుతున్న ప్రస్తుత ప్రపంచం తప్పనిసరిగా గుర్తించాలి' అని వ్యాఖ్యానించారు. విద్యా నమూనాను సమకాలీనతతో మార్చుకోవాల్సిన అవసరం, దాని ప్రాధాన్యం ఆ వ్యాఖ్యలో కనబడుతుంది.

(వ్యాసకర్త: కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ అధ్యాపకులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నాన్న అమెరికా అధ్యక్ష పదవి మా వ్యాపారానికి ఆటంకంగా మారింది

- వివాదాలు ఉండొద్దనే విదేశీ ఒప్పందాలకు దూరంగా ఉన్నాం
- ట్రంప్ కుమారుడు జాన్ వెల్లడి



ముంబై: తన తండ్రి అధ్యక్ష పదవి తమ కుటుంబ స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారానికి ప్రతికూలంగా మారిందని అమెరికన్ రియల్ ఎస్టేట్ దిగ్గజం, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ జాన్ ట్రంప్ జూనియర్ వెల్లడించారు. అయితే అధ్యక్ష పదవీకాలం ముగిసిన తర్వాత తమ తండ్రి కుటుంబ వ్యాపారంలోకి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన 2017 జనవరి నుంచి భారత్‌లో ట్రంప్ ఆర్గనైజేషన్ ఎలాంటి వ్యాపార ఒప్పందాలపై సంతకాలు చేయలేదని తెలిపారు. ట్రంప్ ఆర్గనైజేషన్ స్థానిక భాగస్వామి అయిన లోధా గ్రూప్ ముంబైలో గురువారం రాత్రి నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నందువల్ల ఎలాంటి వివాదాలకు తావు లేకుండా కొత్తగా విదేశీ ఒప్పందాలేవీ కుదుర్చుకోవద్దని నిర్ణయించామని చెప్పారు. 'మేం తిరిగి వ్యాపారం మొదలు పెట్టినప్పుడు.. భారతీయ మార్కెట్ మాకు ప్రధానమైనదిగా నిలుస్తుంది' అని తెలిపారు. ముంబైలో మొట్టమొదటిది, 78 అంతస్తుల విలాసవంతమైన ట్రంప్ టవర్ నిర్మాణం పూర్తయిన సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ జూనియర్ గురువారం రిబ్బన్ కట్‌చేశారు. లోధా గ్రూప్ భాగస్వామ్యంతో వర్లి ప్రాంతంలో నిర్మించిన ఈ టవర్‌లో నివాసం ఉండే వారికి ప్రైవేటు విమాన సేవలను అందిస్తున్నారు.

చచ్చేలా కొడుతుంటే సెల్ఫీలు!

- కేరళలో చోరీ నెపంతో గిరిజనుడిని చావబాదిన స్థానికులు
- దెబ్బలకు తాళలేక యువకుడి మృతి.. ■ ఏడుగురు నిందితుల అరెస్ట్



పాలక్కాడ్: ఓ మనిషిని చావబాదుతుంటే అడ్డుకోకుండా సెల్ఫీలు దిగిన ఘటన కేరళలోని పాలక్కాడ్ జిల్లా అటవీప్రాంతం ఉన్న అగాలీలో చోటుచేసుకున్నది. ఆహార పదార్థాలు చోరీ చేశాడనే నెపంతో, పాలక్కాడ్ జిల్లా కడుకుమన్న గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని.. గిరిజన యువకుడు మధు (30)ను కొంతమంది స్థానికులు చేతులు కట్టేసి చావబాదారు. ఈ ఘటన జరుగుతుండగా అడ్డుపడకుండా కొందరు యువకులు సెల్ఫీలు తీసుకున్నారు. చివరకు పోలీసులు దవాఖానకు తరలించేలోపే అతడు మరణించాడు. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా దీనిపై గిరిజన, మానవహక్కుల సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఘటనను తీవ్రంగా ఖండించిన కేరళ సీఎం పినరాయి విజయన్.. ప్రగతిశీల సమాజంపై ఇదో మచ్చ అని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఉన్నతస్థాయి దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని డీజీపీ లోక్‌నాథ్ తెలిపారు.

రాజ్యసభ ఎన్నికలకు మోగిన నగారా

- 59 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి 23న ఎన్నికలు; అదే రోజు కౌంటింగ్
- తెలంగాణ నుంచి మూడు స్థానాలకు ఎన్నికలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. త్వరలో భారీ సంఖ్యలో ఖాళీ కానున్న 58 రాజ్యసభ స్థానాలు, ఇప్పటికే ఖాళీ అయిన ఒక స్థానం కలుపుకొని మొత్తం 59 స్థానాలకు ఎన్నికల సంఘం (ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికలు జరుగనున్న రాజ్యసభ స్థానాల్లో తెలంగాణ నుంచి మూడు స్థానాలు ఉన్నాయి. మొత్తం 59 స్థానాలకు మార్చి 23న ఎన్నికలు నిర్వహించనున్నామని, అదే రోజు కౌంటింగ్ చేపట్టనున్నామని ఈసీ తెలిపింది. ఈ ఎన్నికలు 16 రాష్ట్రాల్లో జరుగనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీల్లో 58 మంది పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుంది. పదవీకాలం ముగియనున్న వారిలో కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, ధర్మేంద్ర ప్రధాన్, జేపీ నడ్డా, రాందాస్ అథావలే, థావర్ చంద్ గెహ్లాట్ ఉన్నారు. అలాగే కేరళలో వీరేంద్ర కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది. తెలంగాణ నుంచి పదవీకాలం ముగియనున్నవారిలో పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి(దివంగత), సీఎం రమేశ్, రాపోలు ఆనంద్ భాస్కర్, ఆంధ్రప్రదేశ్ నుంచి తూళ్ల దేవేందర్‌గౌడ్, రేణుక చౌదరి, కొణిదల చిరంజీవి ఉన్నారు.

ఖాళీల వివరాలు ఇలా..

తెలంగాణ-3; ఆంధ్రప్రదేశ్-3; బీహార్-6; ఛత్తీస్‌గఢ్-1; గుజరాత్-4; హర్యానా-1; హిమాచల్‌ప్రదేశ్-1; కర్ణాటక-4; మధ్యప్రదేశ్-5; మహారాష్ట్ర-6; ఉత్తర్‌ప్రదేశ్-10; ఉత్తరాఖండ్-1; పశ్చిమబెంగాల్-5; ఒడిశా-3; రాజస్థాన్-3; జార్ఖండ్-2, కేరళ-1.

భారత ఐటీకి హెచ్1బీ దెబ్బ

వీసా జారీ ప్రక్రియ మరింత కఠినతరం ■ ఇకపై కాలపరిమితి మూడేండ్లలోపే..
ఉద్యోగి అర్హతలు, సంస్థ ఒప్పందాల ధ్రువీకరణ తప్పనిసరి ■ అమెరికా నూతన విధానం



వాషింగ్టన్, ఫిబ్రవరి 23:

హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియను అమెరికా కఠినతరం చేసింది. ఇందుకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నూతన విధాన ప్రకటన చేసింది. ఇకపై హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేసే ఐటీ కంపెనీలు అదనపు వివరాలు అందజేయాల్సి ఉంటుంది. తమ ఉద్యోగులకు సంబంధించిన వివరాలను, అందుకు తగిన ఆధారాలను తప్పనిసరిగా పొందుపర్చాలని పేర్కొంటూ గురువారం ఏడుపేజీల మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హెచ్1బీ వీసాల దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 2 నుంచి ప్రారంభం కానున్నది. 2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. మరికొద్ది రోజుల్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, అమెరికా నూతన నిబంధనలు జారీ చేసింది.

'అమెరికా ఉద్యోగాలు.. స్థానికులకే' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ తన హామీని నెరవేర్చే ప్రయత్నంలో భాగంగా హెచ్1బీ వీసాల జారీ విధానంలో భారీ మార్పులకు ప్రయత్నిస్తున్నారు. మరికొద్దివారాల్లో నూతన వీసాల ప్రకియ ప్రారంభం కానుండగా, ఆంక్షలతో కూడిన తాజా విధానాన్ని ప్రకటించడం భారత ఐటీ రంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. హెచ్1బీ వీసా నూతన నిబంధనలు భారతీయులకేకాకుండా, అమెరికా ఆర్థిక వ్యవస్థకూ భారీగా నష్టం కలిగిస్తుందని నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. హెచ్1బీ వీసా ద్వారా విదేశీ ఉద్యోగులకు తాత్కాలికంగా అమెరికాలోని కంపెనీల్లో పనిచేసే అవకాశం లభిస్తున్నది. ఈ వీసా ద్వారా పలు కంపెనీలు అమెరికన్ ఉద్యోగుల కొరత ఉన్న చోట నిపుణులైన విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ముఖ్యంగా భారత ఐటీ కంపెనీలు ఈ విధానంతో బాగా లబ్ధి పొందుతున్నాయి. థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో ఎక్కువ సంఖ్యలో తమ ఉద్యోగులను నియమిస్తున్నాయి. తాజాగా అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ (యూఎస్‌సీఐఎస్) విడుదల చేసిన నూతన పాలసీ ప్రకారం.. ఉద్యోగులు థర్డ్‌పార్టీ వర్క్‌సైట్‌లో పనిచేసే పరిమిత కాలానికి మాత్రమే హెచ్1బీ వీసా ఇవ్వాలని పేర్కొన్నది. ప్రస్తుతం హెచ్1బీ వీసా గడువు మూడేండ్లు కాగా, తాజా నిబంధనల్లో అంతకంటే తక్కువే ఉండాలని తెలిపింది. బెంచ్‌లో ఉన్న ఉద్యోగులకు హెచ్1బీ వీసా పొడిగింపు మరింత కఠినతరం కానున్నది.

నూతన విధానంలోని కీలకాంశాలు



నైపుణ్యం, అర్హతలు: థర్డ్‌పార్టీ వర్క్‌సైట్‌లో హెచ్1బీ వీసా దరఖాస్తు చేసుకునే ఉద్యోగి తాను ప్రత్యేకమైన వృత్తిలో నిర్దిష్టమైన అర్హతలు కలిగి ఉన్నట్లు నిరూపించుకోవాలని కొత్త పాలసీ చెబుతుంది. ఉద్యోగార్హత, నైపుణ్య వివరాలను తగిన ఆధారాలతో సమర్పించాల్సి ఉంటుంది. ఈ-డాక్యుమెంట్స్ తప్పనిసరి.

ఉద్యోగుల పని వివరాలు: ఉద్యోగుల కోసం హెచ్1బీ వీసాలు కోరే కంపెనీలు ఇకనుంచి దరఖాస్తుల విషయంలో పేపర్ వర్క్‌పై కాస్త ఎక్కువగానే కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు కేటాయించిన నిర్దిష్టమైన పని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు, మార్కెటింగ్ ఎనాలిసిస్, కాస్ట్ బెనిఫిట్ ఎనాలిసిస్, బ్రోచర్లు, ఫండింగ్ డాక్యుమెంట్ల వంటివాటినీ కంపెనీలు సమర్పించాలి.

ధ్రువీకరణ: ఉద్యోగి పనికి సంబంధించి సదరు సంస్థ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలి. కొలువులో ఆయన/ ఆమె ఎన్ని సంవత్సరాలు పనిచేస్తారు? ఉద్యోగి పనిగంటలు, చెల్లించే వేతనం వంటి వివరాలను వెల్లడించాలి.

ఉద్యోగ కాంట్రాక్టు: హెచ్1బీ వీసా కోసం పేర్కొన్న కాలపరిమితిలో.. విదేశీ నిపుణుడితో కుదుర్చుకున్న 'ఉద్యోగ ఒప్పందం' కాపీలను ఆయా సంస్థలు అందజేయాలి.

కాలపరిమితి: మూడేండ్ల కన్నా తక్కువ కాలపరిమితితో కొత్త వీసాలు జారీ కానున్నాయి. హెచ్1బీ ప్రామాణిక కాలవ్యవధి మొత్తం అభ్యర్థి కొనసాగుతూ ఉండకపోయినా, థర్డ్‌పార్టీ వర్క్‌సైట్‌లో పనిచేసే పరిమిత కాలానికి మాత్రమే వీసా ఇవ్వాలని నిబంధనావళి పేర్కొన్నది.

ఉగ్రవాదులకు నిధులను సమకూర్చే దేశాల జాబితాలో పాక్

ఎఫ్ఏటీఎఫ్ నిర్ణయం

ఇస్లామాబాద్: ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్న దేశాల జాబితాలో పాకిస్థాన్‌ను చేరుస్తూ 'ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)' నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆఫ్ఘన్‌లోని మిలిటెంట్లతో సంబంధాలు కొనసాగించకుండా.. భారత్‌లో ఉగ్రవాద దాడులకు సహకరించకుండా పాకిస్థాన్‌ను కట్టడి చేసేలా ఎఫ్ఏటీఎఫ్ జాబితాలో చేర్చడానికి అమెరికా ప్రయత్నించింది. ఎఫ్ఏటీఎఫ్ ఎజెండాలో ఈ అంశం తొలుత చర్చకు వచ్చినప్పుడు చైనా, గల్ఫ్ సహకార మండలి (జీసీసీ), టర్కీ వ్యతిరేకించడంతో వీగిపోయింది. కానీ అమెరికా మళ్లీ సంప్రదింపులు జరుపడంతో గురువారం జరిగిన ఓటింగ్‌కు చైనా, జీసీసీ దూరంగా ఉండగా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ మద్దతునిచ్చాయి. దీంతో ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్న దేశాల జాబితాలో పాక్‌ను చేరుస్తూ ఎఫ్ఏటీఎఫ్ నిర్ణయం తీసుకున్నది. మరోవైపు పాక్ తీరుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ రాజ్‌షా పేర్కొన్నారు.



'తాపి' ప్రాజెక్టు పనుల ప్రారంభ కార్యక్రమంలో నాలుగు దేశాల ప్రతినిధులు

దక్షిణాసియా ఇంధన కొరతను తీర్చే 'తాపి' గ్యాస్ పైప్‌లైన్ పనులు ప్రారంభం

- తుర్క్‌మెనిస్థాన్-భారత్ మధ్య 1840కి.మీ. పొడవున నిర్మాణం

సెర్హతాబాత్ (తుర్క్‌మెనిస్థాన్), ఫిబ్రవరి 23: తుర్క్‌మెనిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, భారత్ భాగస్వాములుగా ఉన్న 'తాపి' గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులు ఆఫ్ఘన్ భూభాగంలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. దక్షిణాసియా ఇంధన కొరతకు ఈ ప్రాజెక్టు శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్న అంచనాలున్నాయి. ఆఫ్ఘనిస్థాన్-తుర్క్‌మెనిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ, తుర్క్‌మెనిస్థాన్ అధ్యక్షుడు గుర్బన్‌గులి బెర్డీముఖమెదోవ్, పాక్ ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ, భారత విదేశాంగశాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ పాల్గొన్నారు. వీరితోపాటు వివిధ దేశాల దౌత్య ప్రతినిధులు, ప్రముఖులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నాలుగుదేశాల ఐక్యతకు ఈ ప్రాజెక్టు నిదర్శంగా నిలుస్తుందని ఆశిస్తున్నట్లు అష్రఫ్‌ఘనీ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో నాలుగుదేశాల ఉమ్మడి సహకారానికి సంబంధించి నూతన అధ్యాయం ప్రారంభమవుతుందని ఎంజే అక్బర్ తెలిపారు. గల్కినిష్ గ్యాస్‌క్షేత్రం (తుర్క్‌మెనిస్థాన్) నుంచి హెరత్, కాందహార్, క్వెట్టా, ముల్తాన్ నగరాల మీదుగా పంజాబ్ రాష్ట్రంలోని ఫాజిల్కా (భారత్) వరకు 1840 కి.మీ. పొడవునా ఈ గ్యాప్ పైప్‌లైన్‌ను నిర్మిస్తున్నారు. 2020నాటికి పైప్‌లైన్ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అంగడికి వెళ్తున్న యువతిని సజీవ దహనం చేశారు

- యూపీలోని ఉన్నావ్ జిల్లాలో దారుణం

ఉన్నావ్: ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో దారుణంగా జరిగింది. కూరగాయల కోసం అంగడికి సైకిల్‌పై బయలుదేరిన యువతిని గుర్తుతెలియని దుండగులు సజీవ దహనం చేశారు. లక్నోకు 100 కిలోమీటర్ల దూరంలోని ఓ గ్రామంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నది. వారాంతపు అంగడికి సైకిల్‌పై బయలుదేరిన యువతి (18)ని కొందరు అడ్డగించి కిరోసిన్ పోసి నిప్పంటించినట్టు తెలుస్తున్నది. మంటలతోనే యువతి గ్రామం వైపు సుమారు వందమీటర్ల దూరం పరిగెత్తి కూప్పకూలింది. కాలిన గాయాలతో అక్కడే కన్నుమూసింది. సైకిల్, చెప్పులు చూసి తమ కూతురేనని గుర్తించిన బాధితురాలి కుటుంబసభ్యులు బోరున విలపించారు. పోస్టుమార్టం నివేదికలో యువతిపై లైంగికదాడి జరుగలేదని తేలింది. ఈ దాడిలో ఒకరి కంటే ఎక్కువమంది పాల్గొన్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని లక్నో ఐజీ సుజిత్ పాండే తెలిపారు.

ఢిల్లీలో విద్యార్థి నాయకురాలిపై ఏబీవీపీ దాడి

నిందితులపై కేసు నమోదు

న్యూఢిల్లీ: వామపక్ష విద్యార్థి సంఘం ఏఐఎస్ఏ ఢిల్లీ యూనివర్సిటీ అధ్యక్షురాలు కవల్‌ప్రీత్ కౌర్‌పై ఏబీవీపీ నాయకులు దాడి చేశారు. స్థానిక సత్యవతి కళాశాలలో గూగుల్ సంస్థ నిర్వహించిన 'డిజిటల్ సేఫ్టీ' సెమినార్‌కు హాజరై ప్రసంగిస్తుండగా ఏబీవీపీ నాయకులు కొందరు తనపై దాడి చేసి చంపుతామని బెదిరించినట్టు కవల్‌ప్రీత్ కౌర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి ప్రొఫెసర్లపైనా, తనపైనా దాడికి దిగారని కౌర్ పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్ నిషేధం విధించినప్పటికీ, ఆమె క్యాంపస్‌లోకి రావడంపైనే తాము నిరసన తెలిపామని ఏబీవీపీ కళాశాల విద్యార్థి సంఘం నేత కునాల్‌యాదవ్ చెప్పారు. దాడి చేశామన్నది అవాస్తవమన్నారు.

వేర్పాటువాదాన్ని సహించం

ఉగ్రవాదం, తీవ్రవాదం కెనడాకు కూడా ముప్పే.. వాటిపై ఉమ్మడిగా పోరాడాలి
కెనడా ప్రధానికి స్పష్టంచేసిన ప్రధాని నరేంద్రమోదీ
ట్రూడోతో విస్తృత చర్చలు.. రెండు దేశాల మధ్య కుదిరిన ఆరు ఒప్పందాలు



కెనడా ప్రధాని ట్రూడో, ప్రధాని మోదీ ఆలింగనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: భారత దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని, సమగ్రతను సవాలు చేసేవారిని సహించేది లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. భారత్‌లో వేర్పాటువాదానికి ప్రయత్నిస్తున్న ఖలిస్థాన్‌వాదుల పట్ల కెనడా ప్రభుత్వం మెతక వైఖరి అవలంబించడాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడోతో దాదాపు రెండున్నర గంటలపాటు ఉగ్రవాదం సహా పలు అంశాలపై ఆయన విస్తృతచర్చలు జరిపారు. తరువాత ట్రూడోతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాలు, వేర్పాటువాదాల కోసం మతాన్ని దుర్వినియోగం చేసేవారికి ఎలాంటి స్థానం ఇవ్వరాదని కూడా మోదీ పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా భారత్‌లోని పలు ప్రాంతాలను సందర్శించిన ట్రూడో ఈ దేశంలోని భిన్నత్వాన్ని, కెనడాతో మైత్రిపై భారత ప్రజల్లో గల ఆసక్తిని తప్పక గుర్తించే ఉంటారని భావిస్తున్నానని చెప్పారు. భారత్, కెనడా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలు, భిన్నత్వాలు గల దేశాలకు ఉగ్రవాదం, తీవ్రవాదం చేటుచేస్తాయని, రెండు దేశాలు ఈ సమస్యలపై ఉమ్మడిగా పోరాడాల్సిన అవశ్యకత ఉన్నదని ప్రధాని తెలిపారు. ఈ విషయంలో ఉమ్మడిపోరుపై తామిద్దరం ఒక అంగీకారానికి వచ్చామన్నారు. మాల్దీవులు, ఆఫ్ఘనిస్థాన్, ఇండో-పసిఫిక్ ప్రాంతాలు, ఉత్తరకొరియా తదితర దేశాల్లోని పరిస్థితులపైనా చర్చించామని పేర్కొన్నారు. ద్వైపాక్షిక స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం ఖరారుకు ప్రయత్నాలను వేగవంతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. కాగా వాణిజ్య సహకారంలో కెనడాకు భారత్ సహజమైన భాగస్వామి అని ట్రూడో అన్నారు. మోదీ, ట్రూడో విస్తృత చర్చల అనంతరం రెండు దేశాల మధ్య ఇంధన, ఐటీ, వాణిజ్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలతో పాటు పలు రంగాల్లో సహకారానికి సంబంధించి ఆరు ఒప్పందాలు కుదిరాయి. అంతకుముందు విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌తోనూ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతోనూ కెనడా ప్రధాని సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.


మాంస విక్రేతల వల్లే మా సీట్లు తగ్గాయి

గుజరాత్ అసెంబ్లీలో హోంమంత్రి ప్రదీప్‌సిన్హ్ జడేజా వివాదాస్పద వ్యాఖ్యలు

గాంధీనగర్: అక్రమార్కులు, మాంసం విక్రేతల వల్లే తమ పార్టీ 99 స్థానాలకు పరిమితమైందని గుజరాత్ హోంశాఖ సహాయ మంత్రి ప్రదీప్‌సిన్హ్ జడేజా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీని ఉద్దేశించి గవర్నర్ ఓపీ కోహ్లీ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం ఆయన చర్చలో పాల్గొంటూ పై వ్యాఖ్యలు చేశారు. 'మాకు ఎవరు ఓటేయలేదో నేను చెబుతా. గోవధను నిషేధిస్తూ కఠినమైన చట్టం తేవడంతో మాంసం విక్రేతలు.. కఠిన మద్యనిషేధ చట్టం అమలులోకి తేవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అక్రమార్కులు మాకు వ్యతిరేకంగా ఓటేశారు' అని చెప్పారు. కుల, మతపరమైన రాజకీయాలను రెచ్చగొట్టినందుకే కాంగ్రెస్ పార్టీకి 77 సీట్లు వచ్చాయని ఆరోపించారు. గత డిసెంబర్‌లో హోరాహోరీ జరిగిన ఎన్నికల్లో ఆరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చినా 182 స్థానాల అసెంబ్లీలో దాని బలం 115 నుంచి 99 స్థానాలకు పడిపోయింది.

కమల్‌హాసన్.. సమర్థుడు

- ప్రజల నమ్మకాన్ని సంపాదిస్తాడు
- మార్గాలు వేరైనా అంతిమలక్ష్యం ప్రజాసంక్షేమమే: రజినీకాంత్



చెన్నై: మక్కళ్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ వ్యవస్థాపకుడు కమల్ హాసన్ సమర్థుడని తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ ప్రశంసించారు. ప్రజల నమ్మకాన్ని ఆయన సంపాదించుకుంటారని పేర్కొన్నారు. బుధవారం మదురైలో కమల్ ఎంఎన్ఎం పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. రజినీ కూడా త్వరలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారు. చెన్నైలో శుక్రవారం రజినీ మీడియాతో మాట్లాడుతూ.. 'మనమంతా వివిధ మార్గాలను అనుసరిస్తున్నా మన అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమమే' అన్నారు. ఎంఎన్ఎంపై మీ అభిప్రాయం చెప్పాలని కోరగా.. 'కమల్ సమర్థుడు.. ప్రజల నమ్మకాన్ని సంపాదిస్తారు. ఫిబ్రవరి 21న కమల్ స్థాపించిన పార్టీ చాలా బాగుంది. అద్భుతంగా సభ నిర్వహించారు. రాజకీయ ప్రస్థానం బాగుండాలని ఇప్పటికే కమల్‌కు శుభాకాంక్షలు చెప్పాను. ఎంఎన్ఎం స్థాపించిన తర్వాత మరోసారి ఆయనకు శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.



కేజ్రీవాల్ ఇంటి నుంచి హార్డ్ డిస్క్ తీసుకెళ్తున్న పోలీసులు

కేజ్రీవాల్ ఇంట్లో పోలీసు సోదాలు

- సీసీటీవీ ఫుటేజీలు, హార్డ్ డిస్క్ స్వాధీనం

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యేల దాడి ఘటన రోజుకో మలుపు తిరుగుతున్నది. శుక్రవారం సీఎం కేజ్రీవాల్ ఇంటి నుంచి సీసీటీవీ కెమెరా సిస్టమ్ హార్డ్ డిస్క్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేజ్రీవాల్.. సీఎస్, ఎమ్మెల్యేలతో సమావేశమైన గదిలో సీసీటీవీ కెమెరా లేదని వారు తెలిపారు. దీనిపై సీఎం కేజ్రీవాల్, ఎమ్మెల్యేలను ప్రశ్నించే విషయమై 'ఇప్పుడే చెప్పలేమన్నారు. సీఎం కేజ్రీవాల్ స్పందిస్తూ న్యాయమూర్తి లోయా మృతి కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఆప్ ఎమ్మెల్యేలకు ఢిల్లీ మేజిస్ట్రేట్ షెఫాలీ బర్నాలా టాండన్ బెయిల్ నిరాకరించారు.

క్యాన్సర్ నివారణపై కొత్త ఆశలు!

- పరిశోధనలకు భారత్ కేంద్రం కావాలి
- బయోఏషియా-2018 సదస్సు వేదికపై శాస్త్రవేత్తలు


బయోఏషియా సదస్సు వేదికపై ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎమిరిటస్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ మైఖేల్ హాల్, నొవర్టిస్ ఫార్మా సీఎంవో శ్రీరామ్ ఆరాధ్యే, మెర్క్‌లైఫ్‌సైన్స్ సీఈవో ఉదిత్ బత్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: క్యాన్సర్‌పై విస్తృతంగా జరుగుతున్న పరిశోధనలు సరికొత్త ఆశలు చిగురించేలా చేస్తున్నాయని బయోఏషియా వేదిక సాక్షిగా శాస్త్రవేత్తలు ప్రకటించారు. క్యాన్సర్ మహమ్మారి జాతిసంపదకు భారంగా పరిణమిస్తున్నదని, దీనికి పరిష్కారం కనుగొనేందుకు ఫార్మా కంపెనీలు, సంబంధిత పరిశ్రమవర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రెండో రోజు హెచ్ఐసీసీలో జరిగిన బయోఏషియా-2018 సదస్సులో క్యాన్సర్‌పై పరిశోధనలు అనే అంశంపై నోవార్టిస్ ఫార్మా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాం ఆరాధ్యే కీలకోపన్యాసం చేశారు. క్యాన్సర్ సహా అనే కరకాల రోగాల నివారణ ఔషధాలపై పరిశోధనలు చేపట్టేందుకు నోవార్టిస్ సంస్థ ప్రయత్నాలు చేస్తున్నదని, భారత్ కేంద్రంగా తమ ప్రపంచ కార్యకలాపాలు సాగుతున్నాయని చెప్పారు. క్యాన్సర్‌పై ప్రపంచ పరిశోధనలకు భారత్ కేంద్రంగా మారుతందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. క్యాన్సర్‌పై పరిశోధనలకుగాను అనేక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న ప్రొఫెసర్ మైఖేల్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో తన బృందం చేసిన పరీక్షల్లో రెమామైసిన్ (టీవోఆర్) ప్రొటీన్ క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడుతుందని గుర్తించినట్టు వెల్లడించారు. ఇది కొత్తఆశలను చిగురింపజేసిందని ఆయన హర్షం వ్యక్తంచేశారు. మధుమేహం చికిత్స కోసం ఈ ప్రొటీన్‌ను ఉపయోగించి పరిశోధనలు చేసేందుకు ఏ ఔషధ కంపెనీ ముందుకు రాలేదని గుర్తుచేశారు. క్యాన్సర్ చికిత్సలో మాత్రం ఈ ప్రొటీన్ ఎంతో ఉపయోగపడనున్నట్టు ఆయన చెప్పారు. మెర్క్ లైఫ్‌సైన్స్ సీఈవో డాక్టర్ ఉదిత్ బాత్రా మాట్లాడుతూ, ఆంకాలజీ అనేది ఒక కీలకమైన చికిత్సావిభాగంగా మారిందని, దాన్ని మరింత మెరుగుపరిచేందుకు పరిశ్రమలు దృష్టి సారించాయన్నారు. థెరపిక్ సెగ్మెంట్‌లో మొత్తం 20 బిలియన్ డాలర్ల విలువచేసే వ్యాపార అవకాశాలు ఉన్నాయని, భారత్ వంటి దేశాలు దీన్ని అందిపుచ్చుకొని భవిష్యత్‌లో ఈ మార్కెట్లో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ ప్రాముఖ్యాన్ని ముందుగానే గుర్తించడం వల్లే తమసంస్థ అన్ని దేశాలకు విస్తరిస్తున్నదని చెప్పారు.

ఆవిష్కర్తలకు భరోసా

త్వరలో ఇన్నోవేటివ్ సపోర్టివ్ సెల్ ఏర్పాటు

డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఈశ్వరరెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సైన్స్ రంగంలో ఆవిష్కర్తలకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు మూడు వారాల్లో ఇన్నోవేటివ్ సపోర్టివ్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నదని భారత డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఈశ్వరరెడ్డి తెలిపారు. ఇన్నోవేషన్ ఇండియాలో భాగంగా తీసుకొస్తున్న ఈ విధానం ఆవిష్కర్తలకు, నియంత్రణ వ్యవస్థకు మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని నివారించి, ఆవిష్కర్తలకు సహకారంగా ఉంటుందన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలో జరుగుతున్న బయోఏషియా సదస్సుకు హాజరైన ఆయన 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ రంగంలో ఉన్న ఆవిష్కర్తలకు నియంత్రణ వ్యవస్థపై అంతగా అవగాహన లేకపోవడం వల్ల నిబంధనలకు అనుగుణంగా పరిశోధనాఫలాలను తయారు చేయడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో అవి వ్యాపార కోణంలో విజయవంతం కాలేకపోతున్నాయని చెప్పారు. ఆవిష్కర్తలకైనా, స్టార్టప్‌లకైనా నియంత్రణ వ్యవస్థపై అవగాహన ఉండాల్సిందేనన్నారు. బయోలజికల్ ఉత్పత్తులు, వ్యాక్సిన్, డ్రగ్స్ తదితర అంశాల్లో ఆవిష్కరణలకు ఇన్నోవేటివ్ సపోర్టివ్ సెల్ పోత్సాహం అందిస్తుందన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాన్ని నెలకొల్పుతున్నామని, కార్యాలయానికి రాకుండానే అనుమానాలు నివృత్తి చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. అన్ని అనుమతులు దాదాపు ఆన్‌లైన్ ద్వారానే ఇస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు పెద్దఎత్తున సిబ్బందిని నియమించుకోనున్నట్టు వివరించారు.

భవిష్యత్ అంతా బయాలజీదే

ఈ రంగంలో యువతకు అద్భుత అవకాశాలు

బయోఏషియా సదస్సులో ప్రతినిధుల అభిప్రాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలో భారత్ ప్రపంచంలో ఆరో స్థానంలో కొనసాగుతున్నది. 2030 నాటికి మూడో స్థానానికి చేరుకుంటుంది' అని భారత ప్రధాని నరేంద్రమోదీ చివరిసారి జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో వ్యాఖ్యానించారు. సైన్స్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్, అన్నిదేశాలు కల్పిస్తున్న ప్రాధాన్యం దృష్ట్యా భారత్ ముందుచూపుతో వ్యవహరిస్తున్నది. పెరుగుతున్న రోగాలు మనిషి జీవితాన్ని ప్రశ్నార్థకంగా చేస్తున్నవేళ దాని నుంచి బయటపడాలంటే బయాలజీనే దిక్కు. అందులో జరిగే ఆవిష్కరణలే ముఖ్యం. అందుకే బయాలజీకి బంగారు భవిష్యత్ ఉంటుందని విదేశాల నుంచి బయోఏషియా-2018 సదస్సుకు హాజరైన ప్రతినిధులు సైతం ముక్తకంఠంతో చెప్తున్నారు.

బయోఏషియా చాలా ఉపయోగకరం: ఫెంగ్ డాంగ్‌హువా, చైనా



ప్రపంచవ్యాప్తంగా సైన్స్‌లో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. అలాంటి వాటి గురించి తెలుసుకునేందుకు బయోఏషియాలాంటి సదస్సులు చాలా అవసరం. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరై ఫార్మా, రీసెర్చ్ గురించి పంచుకున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ రంగం ఇప్పుడిప్పుడే వృద్ధి చెందుతున్నది. యువతకు బయాలజీలో పెద్ద మొత్తంలో అవకాశాలుంటాయి. భారత్ ఔషధ రంగాన్ని వృద్ధి చేయాలనే ధృడనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తున్నది.

ఇదొక గొప్ప సదస్సు: గ్రెగరీ, కె రెహ్, అమెరికా



ఇక్కడి ప్రభుత్వం ఈ సదస్సును గొప్పగా నిర్వహిస్తున్నది. పలు దేశాల పరిశోధనలకు ఇక్కడ స్థానం కల్పించారు. ప్రతినిధులు చెప్పిన విషయాలు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తాయి. ఫార్మా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యాధుల నియంత్రణ, క్యాన్సర్ పరిశోధనలపై సాగిన చర్చలు ఆసక్తికరంగా ఉన్నాయి. బయోటెక్నాలజీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. హైదరాబాద్‌కు చాలాసార్లు వచ్చాను. క్రమంగా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని పరిశీలిస్తున్నాను.

ప్రపంచంతో పోటీపడాలి

లైఫ్‌సైన్సెస్ రంగంలో మౌలిక సదుపాయాలకు రూ.1000 కోట్లు

బయోఏషియా సీఈవో కాంక్లేవ్‌లో మంత్రి కేటీఆర్.. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అతిపెద్ద ఫార్మా సిటీ ఏర్పాటుచేస్తున్నట్టు వెల్లడి


సీఈవో కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రపంచంతో పోటీ పడటమే ఫార్మా రంగం ముందున్న అతిపెద్దసవాల్ అని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లైఫ్‌సైన్సెస్ పరిశ్రమలతో కలిసి పనిచేయడం, ఏకీకృతం చేయడం వంటి విధానాలతో ముందుకెళ్తున్నదన్నారు. లైఫ్‌సైన్సెస్ రంగ పరిశ్రమల మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నదని చెప్పారు. ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యత, ధరను నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ పోటీని ఈ పరిశ్రమ సరైనరీతిలో అర్థం చేసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో బయోఏషియా రెండోరోజు సదస్సులో భాగంగా సీఈవో కాంక్లేవ్‌లో 'ది ప్రిస్కిప్షన్ ఫర్ ప్రోగ్రెస్' అనే అంశంపై చర్చ జరిగింది. చర్చలో ప్యానలిస్టులుగా డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ డాక్టర్ ఎస్ ఈశ్వరరెడ్డి, బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్‌షా, రెడ్డి ల్యాబ్స్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, నోవార్టిస్ జావేద్ జా, సనోఫి చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ పిలిపి లారెన్స్, డెలాయిట్ గ్లోబల్ లైఫ్ సైన్స్ సెక్టార్ లీడర్ గ్రిగోరి రీ పాల్గొన్నారు. సమన్వయకర్తగా సీఎన్‌బీసీ ఫైనాన్సియల్ ఎనలిస్ట్ ఎక్తాబత్రా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్మారంగానికి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొవడానికి తెలంగాణ ప్రభుత్వం మూడు చర్యలను తీసుకుంటున్నదన్నారు. మొదటిది ప్రపంచస్థాయి ప్రమాణాలతో 19 వేల ఎకరాల్లో అతిపెద్ద ఫార్మా సిటీని చేస్తున్నదని, దీని పర్యావరణ అనుమతులు తుదిదశలో ఉన్నాయన్నారు. రెండోది జీనోమ్ వ్యాలీ 2.0లో నూతన ఆవిష్కరణలకు హబ్‌గా నిలుస్తుందని చెప్పారు. ఇక్కడ పరిశ్రమలకు భారీ అవకాశాలున్నాయన్నారు. మూడోది లైఫ్ సైన్సెస్‌ను స్పెక్ట్రమ్‌ను చూస్తున్నామన్నారు. ఫార్మాను ప్రపంచస్థాయి పరిశ్రమగా గుర్తించాలన్నారు.

ఫార్మా పరిశోధనలకు కేంద్రం నిధులు పెంచాలి

ఫార్మా పరిశోధనలకు కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో 0.83 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నదని, వీటిని 10 నుంచి 15 శాతానికి పెంచాలని పరిశ్రమవర్గాలు కోరుకుంటున్నాయని మంత్రి కేటీఆర్ చెప్పారు. 'భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. దేశంలో అనేక రంగాల్లో మౌలిక వసతులు కల్పించాల్సింది. వీటికి పెద్దఎత్తున నిధులు అవసరం. పరిశోధనలకు వెచ్చించే నిధుల్లో రిస్క్ ఎక్కువగా ఉంటుందని సతీశ్‌రెడ్డి చెప్పిన దాంట్లో కొంత వాస్తవం ఉంది. కానీ, పరిశోధనలు పూర్తయిన తర్వాత వాటిద్వారా తక్కువ ధరకు వైద్య పరికరాలు, మందులు లభిస్తాయి' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో కలిసి పనిచేయాల్సి అవసరం ఉందని అన్నారు. ఇండస్ట్రీ, అకాడమీని ఒక్కటి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. దీని ద్వారా పరిశోధనలను ప్రోత్సహించాలనేదే ప్రస్తుత లక్ష్యమన్నారు. రాష్ట్రంలో సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయోలజీ (సీసీఎంబీ)లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థతో కలిసి పరిశోధనలు చేపట్టి వాటి ఫలితాలు కమర్షియలైజ్ చేయడానికి రిచ్ సంస్థను నెలకొల్పామన్నారు. డ్రగ్స్ కంట్రోల్ జనరల్ ఎస్ ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ త్వరలో డ్రగ్ కంట్రోల్‌లో మార్పులు వస్తాయన్నారు. కేంద్ర డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టంలో ఎక్కడా కూడా జనరిక్ అనే పదం లేదన్నారు. దీనిపై కూడా కేంద్రస్థాయిలో చర్చిస్తామన్నారు. బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా మాట్లాడుతూ ప్రభుత్వాలు పరిశోధనలపై ఎక్కువగా నిధులు వెచ్చించాలని, దీనిద్వారా ప్రజలకు మంచి ఫలితాలు అందుతాయని అన్నారు. ఫార్మా పరిశ్రమకు ఇండియా సహజసిద్ధంగా అనువైన ప్రాంతమన్నారు. రెడ్డి ల్యాబ్స్ చైర్మన్ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నిదశాబ్దాలుగా సొంతగా డ్రగ్స్, వాక్సిన్లు తయారుచేసుకునే సామర్థ్యాన్ని భారతదేశం కలిగి ఉందని తెలిపారు. దేశంలో మంచి ప్రతిభ కలిగిన వారు ఉన్నారని చెప్పారు.


టీ-సాట్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో టీ-సాట్ ఎండీ శైలేశ్‌రెడ్డి, సీఈవో పౌసమిబసు తదితరులు

గ్రామాభివృద్ధిలో టీ-సాట్ భాగస్వామ్యం

- గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ప్రతివారం ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తాం: మంత్రి జూపల్లి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీ-సాట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ రూపొందించిన కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని టీ-సాట్ స్టూడియోలో శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ శాఖ ద్వారా ప్రతివారం ఒక ప్రత్యేక అంశంపై కార్యక్రమాలను రూపొందించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని, వాటిని టీ-సాట్ ద్వారా ప్రసారం చేస్తామని చెప్పారు. గ్రామీణుల జీవన స్థితిగతులను మార్చేందుకు గత మూడున్నరేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను ప్రవేశ పెట్టిందన్నారు. పంచాయతీలకు నిధులను పెంచడం, ఖర్చును తగ్గించడం లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధిలో నిధుల కన్నా, ప్రజలు సంఘటిత శక్తిగా మారడమే కీలకమని చెప్పారు. ఆ దిశగా అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంఘటితంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. టీ-సాట్ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. స్వచ్ఛ భారత్, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, పేదరిక నిర్మూలన, సేంద్రియ వ్యవసాయం, మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న చేయూత వంటి అనేక కార్యక్రమాలను ప్రసారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు సెర్ప్ సీఈవో పౌసమి బసు తెలిపారు. ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు టీ-సాట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాలను ప్రసారం చేస్తామని టీ-సాట్ సీఈవో శైలేష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి సంస్థ సెంటర్ హెడ్ శేషాద్రి పాల్గొన్నారు.



చార్మినార్ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న పాదచారుల ప్రాజెక్ట్ పనులను పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. బఫర్ జోన్ చుట్టూ వేస్తున్న గ్రానైట్ పేవ్‌వెంట్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రెండు నెలల్లో సరికొత్త రూపును తీసుకొస్తామన్నారు. చార్మినార్ అందాన్ని రెట్టింపు చేసేందుకు చుట్టూ ప్రత్యేకమైన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. చార్మినార్‌తోపాటు పరిసర ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయడానికి ఉన్నతస్థాయి అధికారుల బృందం త్వరలో టర్కీ రాజధాని ఇస్తాంబుల్ నగరంలో పర్యటించనున్నట్టు చెప్పారు.

- చార్మినార్

పేలిన రియాక్టర్

జీడిమెట్లలోని రసాయన పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- గంటన్నరలోనే అగ్నికీలలను ఆర్పేసిన అగ్నిమాపక సిబ్బంది




దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు.. జీడిమెట్లలోని సుటిక్ ఫార్మాస్యూటికల్స్ నుంచి భారీగా వెలువడుతున్న అగ్నికీలలు

పేట్‌బషీరాబాద్/జీడిమెట్ల: మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పారిశ్రామిక వాడకు అనుబంధంగా ఉన్న శ్రీవెంకటేశ్వర కోఆపరేటివ్ సొసైటీలోని ఓ రసాయన పరిశ్రమలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలడంతో మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో ఏడుగురు కార్మికులకు తీవ్రంగా గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాదంలో రూ.కోటి మేర ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక శాఖ ప్రాంతీయాధికారి పాపయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక వాడలోని 'సుటిక్ ఫార్మాస్యూటికల్స్' పరిశ్రమలో ఉన్న రియాక్టర్‌లో ఉదయం 6:30 గంటలకు మంటలు చెలరేగాయి. సమపాళ్లలో రసాయనాలను కలుపకపోవడం వల్ల రియాక్టర్ ఒత్తిడికి గురై పేలిందని అధికారులు భావిస్తున్నారు. రసాయన డ్రమ్ములకు మంటలు అంటుకోవడంతో తీవ్రత పెరిగింది. ఈ సమయంలో పది మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ముగ్గురు తప్పించుకున్నారు. అక్కడే చిక్కుకుపోయిన ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రమాదంలో జగద్గిరిగుట్టలోని రాజీవ్ గృహకల్పకు చెందిన కంజర్ల కుమారస్వామి(39), సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్పకు చెందిన బండి శ్రీనివాస్(35), సుభాష్ నగర్‌కు చెందిన కొమర సింహాచలం(34), సంజీత్‌కుమార్(40), ఒరియన్(34), శ్యామ్ (27), షాపూర్‌నగర్‌కు చెందిన నరహరి(35) గా గుర్తించారు. వీరిలో కుమారస్వామి, శ్రీనివాస్, సింహాచలం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కంచన్‌బాగ్‌లోని డీఆర్డీఏ అపోలో దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక కేంద్రం అధికారులు రెండు వాహనాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తర్వాత మరో ఏడు వాహనాలు వచ్చి గంటన్నరలోనే మంటలను అదుపులోకి తెచ్చారు. పక్కనే ఉన్న విజయశ్రీ కెమికల్ పరిశ్రమకు మంటలు వ్యాపించగా, యాజమాన్యం, సిబ్బంది మంటలను అదుపు చేశారు. పక్కనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ముల గోదాం అగ్నికి ఆహుతైంది. ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేడ్చల్ కలెక్టర్ ఎంవీరెడ్డి పరిశీలించారు. దవాఖానకు చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

17 రోజుల్లోనే ఇంటి అనుమతులు

ఐదు అంతస్తుల వరకు వర్తింపు

గరిష్ఠ గడువు 21రోజులు • ఉత్తర్వులు జారీ చేసిన బల్దియా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలో ఇంటి అనుమతులను 17 రోజుల్లోగా జారీ చేయాలని అన్ని సర్కిల్, జోనల్ అధికారులకు బల్దియా గడువు విధించింది. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఇంటి అనుమతులకు గరిష్ఠ గడువు 21రోజులు. అయితే ఐదు అంతస్తుల వరకు అనుమతులను 17 రోజుల్లోనే పూర్తిచేయాలని శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇవి వెంటనే అమల్లోకి వచ్చినట్టు అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీలో ఇంటి అనుమతుల జారీని వేగంగా, పారదర్శకంగా చేపట్టేందుకు డీపీఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) విధానాన్ని అమలుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటి అనుమతుల జారీ గడువును ప్రభుత్వం ఇటీవలే 28 రోజుల నుంచి 21 రోజులకు కుదించింది. ఈ మేరకు 21 రోజుల్లో ఏ స్థాయి అధికారి వద్ద ఎన్ని రోజుల గడువు ఉంటుందో నిర్ధారిస్తూ జీహెచ్ఎంసీ అధికారులు టైమ్‌లైన్‌ను రూపొందించారు. దీని ప్రకారం సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో 17 రోజుల్లోనే అనుమతులు జారీ చేసేందుకు వీలుంటుంది. అయితే గరిష్ఠంగా 21 రోజుల సమయం తీసుకోవచ్చు. నిర్ధారిత గడువు దాటితే అధికారులకు రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా, సత్వరం పరిష్కరించిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. అనుమతులు ఇచ్చే అధికారం వెయ్యి చదరపు మీటర్ల వరకు ప్లాటు వైశాల్యంలో పది మీటర్ల ఎత్తు (మూడు అంతస్తులు) వరకు సర్కిల్ కార్యాలయాలకు, వెయ్యి చ.మీ వరకు వైశాల్యంలో 12 మీటర్ల ఎత్తువరకు, 750 చ.మీ వైశాల్యంలో ఐదు అంతస్తుల ఎత్తువరకు జోనల్ కార్యాలయాలకు ఉన్నది. రోడ్ల విస్తరణకు సంబంధించిన వ్యవహారాలు, వాణిజ్య భవనాలు, ఐదు అంతస్తులకన్నా ఎత్తయిన అన్ని రకాల భవనాలకు అనుమతులు ఇచ్చే అధికారం ప్రధాన కార్యాలయానికి ఉన్నది.

డీపీఎంఎస్‌లో దరఖాస్తుల పరిష్కారానికి గడువు

అధికారి	షార్ట్‌ఫాల్	ఆమోదం/తిరస్కరణ
సర్కిల్ కార్యాలయాల్లో టైమ్‌స్కేల్ (రోజుల్లో)		
టీపీఎస్	5	7
ఏసీపీ	2	3
డీసీ	–	3
ఏసీపీ(ఫీ ఇంటిమేషన్‌కు)	–	2
ఏసీపీ(ప్రొసీడింగ్స్ జారీకి)	–	2
జోనల్ కార్యాలయాల్లో		
ఏసీపీ	5	7
సీపీ	2	3
జెడ్‌సీ	–	3
సీపీ(ఫీ ఇంటిమేషన్‌కు)	–	2
సీపీ(ప్రొసీడింగ్స్ జారీకి)	–	2
ప్రధాన కార్యాలయంలో		
ఏసీపీ, ఎల్‌ఏఓ	5(ప్యారలల్)	5(ప్యారలల్)
సీపీ	1	2
సీసీపీ	1	2
బీసీహెచ్‌వో	–	5(బిల్డింగ్ కమిటీ)
సీసీపీ	–	2
కమిషనర్	–	2
సీసీపీ(ఫీ ఇంటిమేషన్‌కు)	–	1
సీసీపీ(ప్రొసీడింగ్స్ జారీకి)	–	2

రాంగోపాల్‌వర్మ విచారణ వాయిదా

ఫోరెన్సిక్ నివేదిక తర్వాత హాజరుకావాలన్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీఎస్టీ సినిమా వివాదంలో చిక్కుకున్న దర్శకుడు రాంగోపాల్ వర్మ విచారణ వాయిదా పడింది. శుక్రవారం విచారణకు హాజరు కావాల్సి ఉండగా సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు వాయిదా వేశారు. వర్మను గత శనివారం విచారించిన సమయంలో పోలీసులు ఆయన ల్యాప్‌టాప్‌ను సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్ పరీక్షలకు పంపించారు. అక్కడి నుంచి నివేదిక అందిన తర్వాతే మరోసారి విచారించే అవకాశాలు ఉన్నాయి. ఆలోగా జీఎస్టీ సినిమాతో సంబంధం ఉన్నవారి నుంచి మరిన్ని వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే జీఎస్టీ సినిమాను వర్మే తీశాడంటూ ఓ రచయిత వచ్చి పోలీసులకు వివరాలు ఇచ్చారు. ఈ సినిమాకు సంగీతం అందించిన సంగీత దర్శకుడు కీరవాణి, వీడియో తీసిన డీవోపీ, ఎడిటింగ్ చేసిన స్టూడియో తదితరుల నుంచి వివరాలు సేకరించేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వివరాలతో పాటు ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించి, వర్మను రెండోసారి విచారించనున్నారు. ఆ తర్వాత వర్మను అరెస్ట్ చేయాలా? స్టేషన్ బెయిల్‌తో సరిపెట్టాలా? వంటి చర్యలను న్యాయనిపుణులు సలహాల మేరకు తీసుకోనున్నారు.

బౌన్సర్లతో దాడులు చేయించారు

- సెయింట్ మేరీ కాలేజీ యాజమాన్యంపై విద్యార్థుల ఫిర్యాదు


గాయాలను చూపుతున్న విద్యార్థి

చార్మినార్/ చాదర్‌ఘాట్: క్రమశిక్షణ పేరుతో తమ కాలేజీ యాజమాన్యం బౌన్సర్లతో దాడులు చేయించిందని నగర శివారు పోచంపల్లిలోని సెయింట్ మేరీ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆరోపించారు. ఇద్దరు విద్యార్థులు శుక్రవారం డబీర్‌పుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పుర ప్రాంతానికి చెందిన సోహెల్, గులాం ఇస్మాయిల్ పోచంపల్లిలోని సెయింట్ మేరీ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. గత వారం కాలేజీలో జరిగిన ఓ సంఘటనలో వీరిద్దరిపై కాలేజీ యజమాన్యం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కాలేజీ యాజమాన్యం ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ బౌన్సర్లు విద్యార్థులను గదిలో బంధించి దాడి చేశారు. ఎవరికైనా ఫిర్యాదు చేస్తే పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులు వారం రోజులుగా కాలేజీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నారు. కుటుంబ సభ్యులకు ఆరా తీయగా జరిగిన విషయాన్ని వివరించారు. సోహెల్, ఇస్మాయిల్ శరీరంపై గాయాలున్నట్టు గుర్తించి వెంటనే డబీర్‌పుర పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడుతామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


సీఎం కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సింగరేణి కార్మికుడు, కళాకారుడు చింతల కనకయ్య రాష్ట్రవ్యాప్త బైక్‌యాత్ర చేపట్టారు. 36 రోజుల్లో 31 జిల్లాల పరిధిలో 5,000 కిలోమీటర్లు తిరిగి శుక్రవారం హైదరాబాద్ గన్‌పార్క్‌కు చేరుకున్నారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు కనకయ్యను అభినందించారు.

నమస్తే తెలంగాణ
7. జిందగీ
హైదరాబాద్
శనివారం 24 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



ఇదిగో యాదాద్రి..

తెలంగాణ ఎదపై
మహా శిలాలయం వెలుస్తున్నది.
ఆగమ సంప్రదాయాలకు ఆలవాలమై..
శిల్పశాస్త్ర వైభవానికి పర్యాయమై..
వెయ్యేండ్ల చరిత్ర చూడని అద్భుతం..
తెలంగాణ తల్లి మెడలో సాలహారమవుతున్నది.
కేసీఆర్ స్వప్నం ఫలించి.. యాదాద్రి గుట్టపై మహా
దివ్యక్షేత్రంగా ఆవిర్భవిస్తున్నది!
హైందవ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన
శిలాలయమై శోభిల్లుతున్నది!
ఇదిగో ఆ యాదాద్రి.. యాదరుషి తపోభూమి!

ఆగమశిల్పం అదిగో చూడండి!



ప్రాచీన ఆలయాలకు నెలవు తెలంగాణ. వాటి గతమెంతో ఘనకీర్తి. శిథిలాలుగా మిగిలి వెలవెలబోతున్న ప్రాచీన ఆలయాల జీర్ణోద్ధరణ, పునరుద్ధరణతో స్వరాష్ట్రం ఆలయాలకు స్వర్ణయుగాన్ని తెస్తున్నది. యాదమహర్షి దీక్షకు మెచ్చి స్వయంభువుగా వెలసిన నరసింహుడితో పావనమైన యాదాద్రి, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కార్యదక్షతతో హైందవ ప్రపంచంలోనే అరుదైన క్షేత్రంగా నిలువనున్నది. యాదాద్రి దివ్యక్షేత్రం భారతీయ ఆలయ వాస్తు శిల్పానికి దర్పణంగా, మన పాలకుల దక్షతకు నిదర్శనంగా నిలువనున్నది. నఃభూతో నఃభవిష్యత్ అన్నట్లుగా నిర్మిస్తున్న యాదాద్రి ఆలయం తెలంగాణకే కాదు, భారతీయ వాస్తు, శిల్ప కళకే తలమానికం. ఒక్క మాటలో చెప్పాలంటే యాదాద్రిలో నిర్మితమవుతున్న శ్రీలక్ష్మీనరసింహ, శివాలయ ప్రాంగణాలు ఆగమశిల్పశాస్త్రం అనడంలో అతిశయోక్తి లేదు. దక్షిణాత్య ఆలయశిల్ప సంప్రదాయంతో ప్రపంచంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా నిలిచేలా ఆలయ నిర్మాణం చేపట్టారు. కొండకు దీటైన కాంక్రీట్ కొండను నిలిపి, కఠినమైన కృష్ణ రాతిని తొలిచి, ఆలయ శిల్పానికి అందాన్నిచ్చిన మహా శిల్పుల నిర్మాణల్లోని విశిష్టతలను ఎంచి, అకుంఠిత దీక్షతో నిర్మిస్తున్న ఈ మహా నిర్మాణం ఆధునిక చరిత్రలోనే అద్భుతం. ఇటీవలి వెయ్యేండ్ల ప్రపంచ చరిత్రలో కఠిన శిలతో ఇంతటి ఘనమైన ఆలయాన్ని నిర్మించిన ఘనుడు లేడు. అధిష్ఠానం నుంచి విమాన శిఖరాగ్రాల వరకు రాతితోనే మహా నిర్మాణాలను చేపట్టిన హైందవ ఆలయమూ లేదు. ప్రపంచ నిర్మాణ శాస్త్రమే 'ఔరా' అని మెచ్చే తురుపుముక్క యాదాద్రి ఆలయం. పాలకుల మార్గదర్శకత్వంలో భాగమైన అధికారులు కార్యదక్షత, ఇంజినీర్ల సామర్థ్యం, స్థపతుల ఘన కార్యం, శిల్పుల నైపుణ్యం, యాదాద్రి ప్రజల ఔదార్యంతో రూపుదిద్దుకుంటున్న యాదాద్రి ఆలయం తెలంగాణ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి! శిల్పుల ఉలులను కాచుకుంటూ సుందర శిల్పాలుగా రూపుదాల్చిన శిలలన్నీ ఒక్కొక్కటిగా గుట్టపై చేరుతూ రేపటి సంభ్రమాన్ని కళ్లకు కడుతున్నాయి! రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ ఆలయాల పూర్వ వైభవాన్ని ఆవిష్కరించేందుకు ఓ ప్రణాళికాబద్ధమైన కార్యచరణ మొగ్గ తొడిగింది. ఆ కార్యచరణలోని తొలిమెట్టు యాదాద్రి. ఈ ఆలయ నిర్మాణంతోపాటు ఆలయ నగర నిర్మాణంతో ఆధ్యాత్మిక క్షేత్రంగా మలిచేందుకు వసతులతోపాటు, పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా మలిచేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నది. ఆధ్యాత్మికతకు రాజధానిలా రూపొందుతున్న యాదాద్రి ఆలయ పట్టణం అభివృద్ధి ప్రణాళిక పేరు 'యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ'. విశ్రాంత ఐఏఎస్ అధికారి కిషన్‌రావు సారథ్యంలో అందమైన ఆలయ పట్టణ నిర్మాణానికి అంకురార్పణ చేశారు.



ఆధునిక కాలంలో అలనాటి ఆలయాలకు దీటుగా రాతి స్థంభాలతో విశాలమైన ఆలయ ప్రాంగణాలు, ఎత్తయిన గోపురాలు నిర్మించడం సాధ్యమా? అని ప్రశ్నించిన గొంతులే ఆకాశంవైపు తలెత్తి చూస్తున్న అందమైన శిలలను చూసి 'ఔరా' అంటున్నాయి. ఆధునిక నిర్మాణ రంగలో అద్భుతంగా నిలిచే ఈ కట్టడం కోసం ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి అందమైన శిల్పాకృతులతో ఆలయాన్ని ఊహిస్తుంటే, ఆ సృజనకు తగినట్లుగా ఆలయ వాస్తును మధుసూదన్ నిర్దేశిస్తున్నారు. స్థపతి సౌందర రాజన్ శిల్పులకు సొబుగులద్దే కార్యానికి మార్గదర్శనం చేస్తూ కార్యశాలలో ఉలులకు నాయకత్వం వహిస్తున్నారు. అయిదు వందల మంది శిల్పులు అహర్నిశలూ శ్రమిస్తూ శిలలకు సూక్ష్మమైన అందాలద్దుతున్నారు. గండశిలలను సుందర శిల్పాలుగా చెక్కి యాదాద్రి గుట్టపై ఆలయ శిఖరాలు నిర్మిస్తున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామికి, పరమశివుడికి నిర్మిస్తున్న ఈ ఆలయ ప్రాంగణాల్లో వింతలు, విశేషాలెన్నో!

రాళ్లు తొడిగిన సాలహారం

వెయ్యేండ్ల భారత దేశ చరిత్రలో విశాలమైన ప్రాకారాలతో, ఎత్తయిన గోపురాలతో రాతి ఆలయాన్ని నిర్మించిన రాజు లేడు. విజయనగర, కాకతీయ రాజుల తర్వాత మహాలయాలను మళ్లీ ఏ రాజూ నిర్మించలేదు. రాజ్యాలు అంతరించినా ఆయా రాజులు ఆదరించిన శిల్పకళ వాళ్లను చిరంజీవులను చేసింది. ఎక్కువ కాలం నిలిచేలా రాతితోనే పటిష్టమైన ఆలయాలను నిర్మించిన ఆ స్ఫూర్తితో నేడు వెయ్యేండ్ల తర్వాత మళ్లీ యాదాద్రిలో పూర్తిగా రాతితో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయ నిర్మాణానికి ఉపయోగించే శిలల కోసం అన్వేషించి ప్రకాశం జిల్లాలోని గురిజేపల్లిలో ఉన్న కృష్ణ శిలను మేలైనదిగా ఎంచారు. ఇక్కడ తొలిచిన గండ శిలలను యాదాద్రి ఇతర ప్రాంతాల్లోని మొత్తం ఐదు కార్యశాలలకు తరలిస్తున్నారు. అక్కడ ఆలయ నిర్మాణానికి అనువైన స్థంభాలు, శిల్పాలుగా దొలుస్తున్నారు. వాటిని యాదాద్రి కార్యశాలకు తరలించిన తర్వాత శిల్పులు సూక్ష్మమైన అలంకరణలతో శిలలకు అందాలు జోడిస్తున్నారు. అనంతరం క్రేన్ల సాయంతో ఆ శిలలను ఒకదానిపై ఒకటి నిలుపుతూ ఆగమశిల్ప అందాలను యాదాద్రి కొండపై ఆవిష్కరిస్తున్నారు.

ఈ ఆలయ నిర్మాణం కోసం మన ఇంజినీర్లు యాదాద్రి గుట్టనే విస్తరించారు. రిటెయినింగ్ వాల్‌ను నిర్మించి గర్భగుడికి ఒక దిక్కును విశాలమైన స్థలాన్ని అందుబాటులోకి తెచ్చారు. విశాలమైన ఆలయ ప్రాకారాల నిర్మాణానికి దారులేశారు. ఇది మన ఇంజినీరింగ్ సామర్థ్యానికి నిదర్శనం. ఈ విస్తరణతో గుట్టపైన ఆలయ నిర్మాణానికి 14.5 ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు నరసింహస్వామి గర్భాలయం, ముఖ మండపం అర ఎకరం స్థలంలోనే ఉండేవి. ఇప్పుడు 4.35 ఎకరాలకు ఆలయ ప్రాంగణం విస్తరిస్తుంది.

యాదాద్రి ఆలయం పూర్తిగా రాతి కట్టడం. ఆలయంలోని ఏ భాగంలోనూ ఇటుక, సిమెంటు, సున్నం వాడరు. గర్భగుడి, ముఖ మండపం, మహా మండపం, ప్రాకారాలు, మండపాలన్నీ రాతితోనే నిర్మిస్తున్న ఈ ఆలయం ఆధునిక ప్రపంచ చరిత్రలో ఓ విశేషం! ఈ రాళ్లను అతికించేందుకు అలనాడు రాజుల కాలంలో ఉపయోగించిన లైమ్ మోర్టార్‌నే ఉపయోగిస్తున్నారు. ఇది మరో విశేషం. ఇందుకోసం బెల్లం, కరక్కాయ, టెంకాయపీసు మొదలైన వాటితో తయారు చేసే ఈ లైమ్ మోర్టార్ నాణ్యతను బెంగళూరుకు చెందిన ఓ సంస్థ ప్రతి సందర్భంలోనూ తనిఖీ చేస్తున్నది. గుట్టపై ప్రతి 10 మీటర్లకు ఒక చోట భూమిని పరీక్ష నిర్వహిస్తూ నిర్మాణానికి అనుకూలంగా ఉందో, లేదో నిర్ధారిస్తున్నరు. ఇది వెయ్యేండ్ల వరకు చెక్కుచెదరకూడదని నిర్మాతల తలపు. ఇది 2 వేల సంవత్సరాల వరకు నిలిచి ఉంటుందని నిపుణులంటున్నారు. దూరదృష్టితో నిర్మిస్తున్న ఈ దివ్యక్షేత్ర నిర్మాణం వెనుక కేసీఆర్‌కు ఉన్న దార్శనికత, దక్షత దాగున్నవి. ఈ ఆలయం నిలిచి ఉన్నంతం కాలం ఆయన చిరంజీవి.

శివా(లా)లయం

భారతీయ ప్రసిద్ధ శైవక్షేత్రాల సరసన యాదాద్రి శివాలయాన్ని నిలిపేలా అద్భుతమైన ఆలయ ప్రాంగణ నిర్మాణానికి వైటీడీఏ నడుం కట్టింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని కఠిన శిలతో నిర్మించినట్లుగానే ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. నూతన నిర్మాణం వల్ల శివాలయం ఇంతకుముందు ఆలయం కంటే ఆరు అడుగుల ఎత్తులో ఉంటుంది. ఎకరం వైశాల్యంలో నిర్మించే శివాలయ ప్రాకారం మధ్య గర్భాలయంలోని ప్రతిష్ట మూర్తికి, నందీశ్వరుడికి మధ్య స్ఫటిక లింగం ప్రతిష్టిస్తారు. శివుడితోపాటు ఆయన సతులిద్దరూ వేర్వేరు ఆలయాల్లో కొలువుదీరి శైవుల పూజలందుకునేలా ఆలయాలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితోపాటు గణపతి, ఆంజనేయుడు, సుబ్రహ్మణ్య స్వామి కొలువుదీరిన ఉపాలయాలూ ఈ శివాలయ ప్రాంగణంలో ఉంటాయి. జప, దాన, దోష పరిహారాల కోసం రాహు, కేతువులతోపాటు నవగ్రహాలనూ పూజించేందుకు నవగ్రహ మండపం ఈ శివాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్నారు.


ముఖ్యమంత్రి మానసపుత్రికైన యాదాద్రి ఆలయ పట్టణం నిర్మాణానికి, ఆలయ పునరుద్ధరణకు శ్రీవైష్ణవ, శైవ మత పెద్దలూ ఇప్పటికీ ఆమోదం తెలుపడంతోపాటు నిర్మాణాలు చూసి సంతృప్తినీ వ్యక్తం చేశారు. త్రిదండి చినజీయర్ స్వామి, తొగుట పీఠాధిపతి మానవానంద శర్మ ఈ ఆలయాల నిర్మాణం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఈ ఆలయ నిర్మాణాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కె. భూపాల్‌రెడ్డి పర్యవేక్షిస్తూ, వడివడిగా యాదాద్రి ఆలయ పట్టణం నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి తరుపున ప్రతి రెండో శనివారం క్షేత్రస్థాయిలో సమీక్షిస్తూ, ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేస్తునారు. ఈ కాటేజీల నిర్మాణానికి అనువైన మౌలిక వనరులు కల్పించేలా ముఖ్యమంత్రే స్వయంగా అన్ని శాఖలను సమన్వయ పరుస్తూ, అభివృద్ధికి కృషి చేస్తున్నారని, కేసీఆర్ సంకల్పమైన ఈ ఆలయ నిర్మాణం ముఖ్యమంత్రి ద్వారా దైవమే తనకు తాను నిర్మించుకుంటుందని ఆయన అంటున్నారు. వైటీడీఏ ఆధ్వర్యంలో నేడు చేపడుతున్న ఆలయ నిర్మాణం, ఆలయ పట్టణ అభివృద్ధి కార్యక్రమాలన్నీ రోజుకు లక్ష మంది యాత్రీకులకు తగినట్లుగానే ఉన్నాయని వైటీడీఏ సీఈఓ కిషన్ రావు చెబుతున్నారు.

ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఇలా ఉంటే ఇక ఆలయ విశేషాలెలా ఉన్నాయో 'జిందగీ ప్లస్'లో చూడండి!

నాగవర్ధన్ రాయల

ఫొటోలు: గడసంతల శ్రీనివాస్, కె.రమేష్‌బాబు
లేఅవుట్: జీ సంతోష్ రెడ్డి





నమస్తే తెలంగాణ
8. జిందగీ+
హైదరాబాద్
శనివారం 24 ఫిబ్రవరి 2018
WWW.NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



విమాన గోపురం

యాదాద్రి గుట్టపై స్వయంభువుగా వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహుడి గర్భగుడిని యథాతథంగా ఉంచి, దానిపై కృష్ణ శిలతో విమాన గోపురాన్ని నిర్మిస్తున్నారు. స్తూపి వరకు నిర్మాణం పూర్తయిన తర్వాత బంగారు తొడుగుతో ఈ విమాన గోపురాన్ని స్వర్ణసుందరంగా తీర్చిదిద్దుతారు. అయిదున్నర అడుగుల మందమున్న రాయితో నిర్మిస్తున్న ఈ విమాన గోపురాన్ని అష్టభుజాకృతిలో 45 అడుగుల ఎత్తున నిర్మిస్తారు. 2 వేల టన్నుల బరువుండే ఈ విమాన గోపుర నిర్మాణ సమయంలో గర్భాలయాన్ని తాకకుండానే నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని హిందూ ఆలయాల విమాన గోపురాల్లో యాదాద్రి విమాన గోపురానికి ఓ విశిష్టత దక్కనుంది. అట్టడుగున ఉండే పానము నుంచి శిఖరాగ్రాన ఉండే స్తూపి వరకు రాతితోనే నిర్మిస్తున్నారు. ఇలాంటి గోపురాలు తంజావూరు, కాంబోడియా వంటి కొన్ని ప్రసిద్ధమైన ఆలయాల్లో మాత్రమే ఉన్నాయి. గర్భాలయం, విమానగోపురంపై నవ నరసింహస్వామి అవతారాలను తొలుస్తారు. కుడ్యాలపై, స్థంభాలపై, పైకప్పుపై కూడా ఈ అవతారాలను చూడవచ్చు. దీనికి ఎదురుగా ఉండే ధ్వజస్థంభాన్ని బంగారు తొడుగుతో అలంకరిస్తారు.




బ్రహ్మోత్సవ మండపం

బ్రహ్మోత్సవ ప్రాంగణం

ఆలయంలో (గుట్టపై) బ్రహోత్సవ నిర్వహణ కోసం 85 వేల చదరపు అడుగుల ప్రదేశం ఉంది. ఇక్కడ 10 నుంచి 15 వేల మంది కూర్చొని తిలకించవచ్చు. కోశాగారము స్వామి వారి ఆభరణాలు, కానుకలు, నగదు భద్రపరిచేందుకు పటిష్టమైన భద్రతతో నిర్మిస్తారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించే ప్రమాణాలను పాటిస్తూ ఈ స్ట్రాంగ్ రూమ్ నమూనా రూపొందించారు.



హనుమాన్ విగ్రహం

ఆంజనేయుడు యాదాద్రి క్షేత్ర పాలకుడు. గర్భాలయం సమీపంలోనే ఆంజనేయుడి ఆలయంతోపాటు 108 అడుగుల ఎత్తయిన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. దీనిని చైనాకు చెందిన కంపెనీ నిర్మిస్తున్నది.

ఆలయ ప్రాకారం

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రెండు ప్రాకారాలు, శ్రీలక్ష్మీ నరసింహ ఆలయంలోని లోపలి ప్రాకారం వెలుపల మాడవీధి, వెలుపలి ప్రాకారం బయట బ్రహ్మోత్సవ ప్రాంగణం ఉంటాయి. బయటి ప్రాకారంలో అష్టభుజి మండపాలు నిర్మిస్తున్నారు. బయటి ప్రాకారంలోని సాలహారంలో నరసింహ స్వామి అవతారాలు చెక్కుతున్నారు. లోపలి ప్రాకారంలోని యాలి మండపం నిర్మిస్తున్నారు. ఈ మండప నిర్మాణంలో 58 సింహపాద స్థంభాలంటాయి. సింహపాదాలతో చెక్కిన ప్రాకారం ఈ ఆలయ ప్రత్యేకత. రెండో ప్రాకారంలో బాల పాదాలుంటాయి. రెండో ప్రాకారంలో అనేక మండపాలున్నాయి. నార్త్ ఈస్ట్‌లో కల్యాణ మండపం, ఆగ్నేయంలో రామానుజ కూటం ఉంది. ఇందులో స్వామికి నైవేద్యం తయారు చేస్తారు. రెండవ ప్రాకారంలో కల్యాణ మండపం ఉంది. ఈ మండపం 350 జంటలు కూర్చునేందుకు అనుకూలంగా ఉంటుంది. హోమ శాల, కోటి దీపాలకంరణ కోసం ముందుగానే ఈ రెండో ప్రాకారంలో ఏర్పాట్లున్నాయి.

ఆలయ దర్శనం!

యాదాద్రిలో గత సంప్రదాయాలను కొనసాగించేలా అభివృద్ధి పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి గీత పర్యవేక్షిస్తున్నారు. ఆలయంలో గిరి ప్రదక్షిణ, ఆకుపూజ, వ్రతాలు, కోడెమొక్కులకు అనుగుణంగానే ఈ ఆలయాన్ని నిర్మించేందుకు ఆమె ఇంజినీర్లకు సూచనలిస్తూ నిర్మాణాన్ని ఆగమనానికి అనుకూలంగా మలుస్తున్నారు. దర్శనానికి ముందు భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. ఇది యాదాద్రి ప్రత్యేకత. గిరి ప్రదక్షిణ కోసం గుట్ట చుట్టూ రహదారి నిర్మించారు. భక్తులందరూ వ్యక్తిగత వాహనాలన్నింటినీ బస్ బేకు సమీపంలోనే నిలుపాలి. గుట్ట కింద క్యూ కాంప్లెక్స్‌లు ఉంటాయి. కాంప్లెక్స్‌లోకి వచ్చిన వాళ్లను ఇక్కడి నుంచి వైటీడీఏ ప్రత్యేక వాహనాల్లో గుట్టపైకి తీసుకుపోతుంది. ఆలయ పరిసరాల్లోని స్వచ్ఛతను కాపాడేందుకు బ్యాటరీల సాయంతో నడిచే వాహనాలనే ఉపయోగిస్తారు. గుట్టపై మరో క్యూ కాంప్లెక్స్ ఉంటుంది. ఈ క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి తీసుకుపోతారు.


ఆలయ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కే భూపాల్‌రెడ్డి, వైటీడీఏ సీఈవో కిషన్‌రావు



1. ఆలయ ప్రాంగణం
2. ఆంజనేయుడి విగ్రహం
3. ప్రసాద వితరణ సముదాయం
4. శివాలయం
5. సబ్ స్టేషన్
6. గాయస్ బ్యాంక్
7. గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్, పంప్ హౌస్
8. చేంజ్ రూమ్స్
9. కుండ్
10. వ్రత మండపం
11. వీవీఐపీ పార్కింగ్
12. నిత్య అన్నదాన వంటశాల
13. నిత్యాన్నదాన కేంద్రం
14. బస్ టెర్మినల్, సమాచార కేంద్రం, క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట, వ్యాపార సముదాయం
15. వాహనాలు బయటికి పోయే గేట్
16. బస్సులు ప్రవేశించే గేట్
17. వీవీఐపీ పార్కింగ్ గేట్
18. రక్షణ కేంద్రం
19. క్యూ కాంప్లెక్స్
20. బ్రహ్మోత్సవ ప్రదేశం
21. వీఐపీ గెస్ట్ హౌస్‌కు దారి
22. వీవీఐపీ గెస్ట్ హౌస్
23. దేవాదాయ శాఖ పాలనా భవనం
24. నవ నారసింహ



లేజర్ షో..

రిటైనింగ్ వాల్ ద్వారా ఆలయ నిర్మాణానికి అదనపు స్థలాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ రిటైనింగ్ వాల్‌ను అంచెలుగా ఏర్పాటు చేసి చూడగానే గుట్టే అనేట్లుగా చెట్లు, బండలతోపాటు అందమైన శిల్పాలతో సుందరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే ప్రణాళిక రూపొందించారు. ఈ రిటైనింగ్ వాల్‌పై ఏనుగులపై ఊరేగే శ్రీలక్ష్మీ నరసింహ కుడ్య శిల్పాలుంటాయి. ఆలయానికి పడమర, దక్షిణ దిక్కుల్లో ఉండే ఈ ప్యానెల్స్‌ను నడుస్తూ చూసేందుకు ఏర్పాట్లుంటాయి. అక్కడక్కడా భక్తులు కూర్చునేందుకు వసతులు, మధ్యలో వాటర్ ఫౌంటెన్లు, జలపాతాలు కనువిందు చేస్తుండేలా ఇక్కడ ఉద్యానవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో భక్తుల కోసం ఈ కుడ్యాలపై లేజర్ షో నిర్వహిస్తారు. ఈ మొత్తం పూర్తిస్థాయిలో పార్కులా కాకుండా చూపులకు ఓ అడవిలా రూపొందించాలని యాదాద్రి నిర్వాహకులు భావిస్తున్నారు. సాయంత్రం ఆలయం మూసిన తర్వాత ఇంటికిపోకుండా ఇక్కడే ఉండి కనులవిందుగా ఉండే ఈ ఏనుగుల ప్రదర్శన, వాటిపై లేజర్ షో చూస్తూ అక్కడే ఉండిపోవచ్చు.

మహా రాజ గోపురం

గర్భగుడికి పడమర దిక్కున మహా రాజగోపురం నిర్మిస్తున్నారు. ఈ మహా రాజగోపురం నుంచే భక్తులు ఆలయంలోకి ప్రవేశిస్తారు. ఏడంతస్తులుగా నిర్మిస్తున్న ఈ మహారాజ గోపురం 77 అడుగుల ఎత్తు ఉంటుంది.

రాజ గోపురాలు

ఆలయానికి తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కుల్లో నాలుగు రాజగోపురాలు నిర్మిస్తారు. పంచతల రాజ గోపురాలకు ఇరువైపులా ప్రాకార మండపాలు నిర్మిస్తారు. ఈ రాజ గోపురాలు నాలుగున్నర అడుగుల మందం కలిగిన రాతి కుడ్యంతో 55 అడుగుల ఎత్తు ఉంటాయి.

ముఖ మండపం

ప్రధాన ఆలయ ముందు ఉండే చిన్న మండపం ఇది. 60 అడుగులు వెడల్పు, 160 అడుగుల పొడవుతో ఉంటుంది. ఈ మండప కుడ్యాలపై నరసింహస్వామి దశావతారాలుంటాయి. ఈ మండప కుడ్యాలపై, స్థంభాలపై, పైకప్పుపై కూడా నరసింహస్వామి అవతారాలే ఉంటాయి. వీటితోపాటు అలంకరణగా తోరణాలుంటాయి.

ప్రసాదం కాంప్లెక్స్

భక్తులకు అందించే లడ్డూ, పులిహోర తయారీ, వితరణ రెండూ ఒకేచోట నిర్వహించేలా యాదాద్రి ఆలయ నిర్మాణం చేస్తున్నారు. రోజుకు లక్ష లడ్డూల తయారీ, నిల్వ, వితరణకు అనువుగా 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. ఇందులో 20 కౌంట్లరుంటాయి.

అతిథి దేవోభవ

ఆలయానికి పశ్చిమాన వీవీఐపీ గెస్ట్ హౌస్ నిర్మిస్తారు. ఆలయ దర్శనం కోసం వచ్చే వివిధ రంగాల ప్రముఖులకు ఇందులోనికి ప్రవేశం ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రముఖులు నేరుగా ఆలయంలోకి ప్రవేశించి, స్వామి దర్శనం చేసుకోవచ్చు.

క్యూ కాంప్లెక్స్

గుట్టపైకి తీసుకువచ్చిన భక్తులను మొదట క్యూ కాంప్లెక్స్‌లోకి అనుమతిస్తారు. ఈ క్యూ కాంప్లెక్స్‌లో ఎనిమిది మందిరాలు ఉన్నాయి. ఒక్కో మందిరంలో 600 మంది వేచి ఉండొచ్చు. ఈ క్యూ కాంప్లెక్స్‌లో వేచి వుండే భక్తులకు స్నాక్స్, మంచినీళ్లు అందించే ఏర్పాట్లున్నాయి. వృద్ధులు, పిల్లలు, గర్భిణులు కూర్చునేందుకు సదుపాయం, ఫస్ట్ ఎయిడ్ సేవలకు ఏర్పాట్లూ ఉంటాయి.

మహా మండపం

ముఖ మండపానికి ఎదురుగా 108 అడుగుల పొడవున ఈ మహా మండపం నిర్మిస్తున్నారు. ఇంత విశాలమైన ముఖ మండపం మరే ఆలయంలోనూ లేదట. 36 అడుగుల ఎత్తున నిర్మించే ఈ మండపంలోని కింది అంతస్తులోని స్థంభాల వద్ద ఆళ్వారు విగ్రహాలు ప్రతిష్టిస్తారు. పై అంతస్థులో కాకతీయ శైలి స్థంభాలుంటాయి. మహామండపంలోని 12 స్థంభాల్లో 12 మంది ఆళ్వారులు కొలువుదీరి ఉంటారు. ఆళ్వారులు శ్రీవైష్ణవ సంప్రదాయంలో విశిష్టమైన స్థానం కలిగిన భక్తులు. తమ పాశురాలతో విష్ణువును కీర్తించి, దక్షిణాదిన భక్తి సంప్రదాయాన్ని విస్తరించారు. వైష్ణవ సంప్రదాయంలోని 12 మంది ఆళ్వారుల్లో అందరూ ఒకే ఆలయంలో ఉండడం యాదాద్రి ఆలయ విశేషం. ఎక్కడ ఆళ్వారులుండి, దానికి మంగళాస్వాసనం చేస్తున్నారో దానిని దివ్యక్షేత్రం అంటారు. ఆ ప్రకారం రేపటి యాదాద్రి నరసింహ క్షేత్రం మహాదివ్య క్షేత్రంగా వెలుగొందుతుంది. ఆలయాన్ని చాళుక్య శైలిలో నిర్మిస్తున్నా ఈ ఆళ్వారు మండపంలోనే కాకతీయులు ఆదరించిన శైలిలో స్థంభాలను నిర్మిస్తున్నారు. ఈ మొదటి అంతస్తును ఆకు పూజ నిర్వహణకు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగిస్తారు.



దైవ దర్శనం

గర్భగుడికి పశ్చిమాన రెండో ప్రాకారంలో వున్న రాజగోపురం గుండా భక్తులు మాడవీధిలోకి ప్రవేశిస్తారు. మాడవీధి కంటే గర్భగుడి, మహామండపం (ఆళ్వారు మండపం) దిగువగా ఉంటాయి. ముఖ మండపం నుంచి గుహాలయంలో వున్న మూలవిరాట్టు శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి ఆళ్వారు మండపంలోకి ప్రవేశిస్తారు. ఈ ఆళ్వారు మండపంలో ఆకుపూజ చేసిన తర్వాత మహా రాజగోపురం గుండా ప్రధాన ఆలయం నుంచి బయటికి వస్తారు. రాజగోపురాలు ఇరువైపులా వున్న మండపాల్లో వ్రతాలు జరుపుకోవచ్చు. ప్రసాదం కాంప్లెక్స్‌లో పులిహోర, లడ్డూ ఇస్తారు. సమీపంలోనే 360 శ్రీవారి మెట్లు ఉంటాయి. ఈ మెట్ల వరుసకు సమాంతరంగా వ్యాపార సముదాయాలుంటాయి. ఈ శ్రీవారి మెట్లను అనుసరిస్తూ ముందుకు సాగితే శివాలయాన్ని చేరుకోవచ్చు. శివుడి దర్శనానంతరం భక్తులు ఇక్కడుండే ఆహ్లాదకరమైన పరిసరాల మధ్య ఆధ్యాత్మిక చింతనతో గడుపవచ్చు. భక్తులను ఇక్కడి నుంచి మళ్లీ వైటీడీఏ వాహనాల్లో గుట్ట కిందికి తీసుకుపోతారు.


యాదాద్రి ఆలయ రూపకర్తలు
ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి, ఆర్కిటెక్ట్ మధుసూదన్, స్థపతి సౌందర్యరాజన్

ఆలయ పట్టణం

యాదాద్రికి ఆలయాన్ని ఎంత ఘనంగా చేపట్టారో.. యాదాద్రి ఆలయ నిర్వహణ, పట్టణ ఆధునీకరణను కూడా అంతే అద్భుతంగా వైటీడీఏ చేపట్టింది. యాదాద్రి ఆలయ పట్టణ నిర్మాణం కోసం 2 వేల ఎకరాల భూమిని సేకరించారు. 800 ఎకరాల్లో ఆలయ పట్టణ నిర్మాణం చేపట్టాలని వైటీడీఏ నిర్ణయించింది. ఈ ఆలయ పట్టణానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి ఆదేశాలతో పలు ప్రభుత్వ శాఖలన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాయి. మిషన్ భగీరథ పథకంలో భాగంగా యాదాద్రి ఆలయానికి సమీపంలో 10 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో సంపు నిర్మించారు. యాదాద్రి పట్టణం చుట్టూ వాహనాల రద్దీకి అనుగుణంగా రూ. 140 కోట్లతో రింగ్ రోడ్ నిర్మాణం మొదలుపెడుతున్నారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేసేందుకు గుట్ట చుట్టూ రోడ్డు ఇరువైపులా అందమైన శిల్పాలంకరణలు, ఆహ్లాదకరమైన చెట్లతో వసతులు కల్పిస్తున్నారు. గుట్ట కింద భక్తుల కోసం అన్నదానం నిర్వహించే సత్రాలు, కల్యాణకట్ట, మహా పుష్కరిణి, క్యూ కాంప్లెక్స్, బస్ బే, పార్కింగ్ ఏరియా, ఏసీ చిల్లింగ్ యూనిట్, వాటర్ రీసైక్లింగ్ యూనిట్ నిర్మిస్తున్నారు. ఈ మొత్తం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 800 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు గుట్ట విస్తరణ, అభివృద్ధి, ఆలయ నిర్మాణం, ఆలయ పట్టణం కోసం భూమి అభివృద్ధికి రూ. 400 కోట్లు ఖర్చుపెట్టారు. 8 వందల ఎకరాల్లో ప్రతిపాదిత ఆలయ పట్టణంలో భాగంగా తొలి విడతగా 250 ఎకరాల్లో భవనాలు నిర్మిస్తారు. ఇందుకు కావాల్సిన లే అవుట్‌ను వైటీడీఏ విడుదల చేసింది. ఈ అవుట్‌లో అన్ని భవనాలను దాతల ఆర్థిక సహాయంతోనే నిర్మిస్తారు. వైటీడీఏ రూపొందించిన డిజైన్లకు అనుగుణంగా దాతలు ఇక్కడ సత్రాలను నిర్మించవచ్చు. ఆ సత్రాన్ని దాతల కుటుంబ సభ్యులు, వారు సూచించిన వ్యక్తులు ఏడాదిలో కొద్ది రోజులు ఉచితంగా ఉపయోగించుకోవచ్చు.



నమస్తే తెలంగాణ
సంపద
[హైదరాబాద్]
శనివారం 24 ఫిబ్రవరి 2018



ఆఫీస్ స్పేస్ రెట్టింపు

దశాబ్దకాలంగా హైదరాబాద్ ఆఫీసు స్పేస్ విస్తరణ 56 మిలియన్ చదరపు అడుగులకు చేరినట్లు సీఆర్‌బీసీ నివేదిక వెల్లడించింది. 'ద కమ్‌బ్యాక్ ఆఫ్ హైదరాబాద్- ఇండియాస్ ఒరిజినల్ ఐటీ హబ్ రైసెస్ అగైన్' పేరిట రూపొందించిన ఈ నివేదికలో భాగ్యనగరం.. అందుబాటు గృహాల మార్కెట్, ప్రీమియం, లగ్జరీ సెగ్మెంట్లలోనూ సత్తా చాటుతున్నట్లు తేలింది. ఇతర మెట్రో నగరాలతో పోల్చితే ఆఫీసు, రెసిడెన్షియల్, రిటైల్ మార్కెట్‌లో జోరు కొనసాగిస్తున్నదని వెల్లడించింది. 2011-16 మధ్యలో 11శాతం వృద్ధి చెందగా, లాజిస్టిక్స్, వేర్‌హౌజ్ డిమాండ్ 2016లో 93 శాతం పెరిగినట్లు స్పష్టమైంది. కామర్స్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ఫార్మా వంటి రంగాల విస్తరణ, ప్రణాళికబద్ధమైన మౌలిక సదుపాయాలు, ప్రముఖ విద్యా సంస్థలు, ప్రోత్సాహకరమైన ప్రభుత్వ విధానాలు, నైపుణ్యం గల యువత,టీ-హబ్, టీఎస్-పాస్ వంటివి హైదరాబాద్‌ను వృద్ధి పథంలో నడిపిస్తున్నాయని పేర్కొంది.



ఈ మొక్కలుంటే.. దోమలు పరార్!

హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఈమధ్య దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు వ్యాపించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరి, వీటి వ్యాప్తిని అరికట్టడానికి రకరకాల ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. కాకపోతే వీటిని వాడటం వల్ల అలర్జీ, తలనొప్పి వచ్చే అవకాశముంది. పైగా, దోమల మందుల్లో ఉండే deet (n, n-diethyl- metatoluamide) అనే పదార్థం వల్ల గర్భిణులతో పాటు పన్నెండు ఏండ్లలోపు పిల్లలకూ హానికరమని చెప్పొచ్చు. అందుకే, దోమలను అరికట్టడానికి ఇబ్బందులు తెచ్చుకోవడం వద్దనుకుంటే.. ప్రకృతిసిద్ధమైన మొక్కలను వాడటమెంతో ఉత్తమం.

ఔను, ప్రకృతిలో సహజసిద్ధంగా పెరిగే మొక్కలైన నిమ్మగడ్డి (లెమన్ గ్రాస్, సైబోపోగాన్, నార్డస్, సిట్రోనెల్లా వింటేరియానస్)ని ఇంటి ముందు పెంచుకుంటే చాలు.. దోమల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఇందుకోసం అధిక సంఖ్యలో మొక్కలను పెంచక్కర్లేదు. ఒకట్రెండు మొక్కలను పెంచితే చాలు.. దోమలు పరారవుతాయి. నిమ్మగడ్డిలో చాలా రకాలుంటాయి. వాటన్నింటిలోకి సైబోపోగాన్, నార్డస్, సెట్రోనెల్లా విన్‌టేరియానస్ అనే రకాలే దోమలను సమర్థంగా అరికడతాయి. దీని మొదళ్లు కొంచెం ఎర్రగా ఉండి, మిగతా మొక్కంతా ఆకుపచ్చగా గడ్డి మాదిరిగా ఉంటుంది. ఇవి పేరొందిన నర్సరీలలో దొరుకుతాయి.

ఎలా పెంచాలి?

ఇవి బాగా సూర్యరశ్మి తగిలే ప్రదేశంలోనూ, పాక్షిక సూర్యరశ్మి ఉండే ప్రదేశంలోనూ చక్కగా పెరుగుతాయి. వీటిని పెంచుకోవడానికి ఇంటిముందు ఖాళీ స్థలం లేకపోతే కుండీల్లోనూ పెంచుకోవచ్చు. అపార్టుమెంట్ల బాల్కనీల్లోనూ వీటిని పెంచొచ్చు. రెండు వంతులు ఎర్రమట్టి, ఒక వంతు పశువుల ఎరువు, కొంత వేప పిండి కలిపిన మిశ్రమాల్ని కుండీల్లో నింపాలి.

- కుండీల్లో మురుగునీటి సౌకర్యం కల్పించాలి. అంటే, మొక్కకు ఎక్కువైన నీరును బయటికి వెళ్లే సదుపాయాన్ని కల్పించాలన్నమాట. ఈ మొక్కల్ని తెచ్చుకుని, మొక్క కుండే పాలిథీన్ కవర్లను తీసి, మట్టిగడ్డతో సహా కుండీలో, నేలలో నాటి నీళ్లు పోస్తే సరిపోతుంది.
- నిమ్మగడ్డి దుబ్బువలే పెరుగుతుంది. కుండీనిండుగా పిలకలు వచ్చి మొక్క పెరగడానికి అవకాశం లేనప్పుడు కుండీని మెల్లగా తీసి, పెద్దకుండీలో నాటుకుని పెంచుకోవచ్చు. లేదా ఆ పిలకలను ఒక్కొక్కటిగా జాగ్రత్తగా విడదీసి.. ఒక్కో దానిని ఒక్కో కుండీలో నాటుకోవచ్చు. సాధారణంగా ఒక ఇంటికి ఒకట్రెండు మొక్కలను పెంచుకుంటే సరిపోతుంది.

సుడోకు

డైలీ సుడోకు 136 సమాధానం

8	6	1	9	2	5	3	4	7
7	2	5	1	4	3	9	8	6
3	9	4	7	6	8	1	5	2
4	5	3	2	9	1	7	6	8
2	8	9	3	7	6	4	1	5
6	1	7	5	8	4	2	3	9
9	3	8	6	1	7	5	2	4
5	7	6	4	3	2	8	9	1
1	4	2	8	5	9	6	7	3

డైలీ సుడోకు 137

	6						2	
4			7	5		8		
	2					9	3	5
5			4	6				
			5		1			
				2	8			3
6	7	3					1	
		4		3	7			2
	8						4	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

సొంతింటి కొనుగోళ్ల పండగ

టీన్యూస్ గోల్డెన్ ప్రాపర్టీ షో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రోత్సాహకర నిర్ణయాల కారణంగా.. ఒక్కసారిగా రియల్ రంగంలో సానుకూల వాతావరణం ఏర్పడింది. ఇంతకాలం సొంతింటి కలను వాయిదా వేసినవారిలో అధిక శాతం మంది.. ప్రస్తుతం సొంత ఇంటి వేటను కొనసాగిస్తున్నారు. కాకపోతే, పలు ప్రాంతాల్లో ప్రస్తుతం నిర్మాణం జరుపుకుంటున్న ప్రాజెక్టుల వివరాలను తెలుసుకోవడం కష్టంగా మారింది. మరి, ఇలాంటి వారందరికీ సొంతింటి కల సాకారాన్ని నెరవేర్చేందుకు సాయం అందించడానికి.. 'టీన్యూస్' ప్రత్యేకంగా గోల్డెన్ ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నది. నేడు, రేపు శిల్పకళావేదికలో జరిగే ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా టీన్యూస్ ఎండీ జె.సంతోష్‌కుమార్ హాజరవుతారు. ఈ ప్రాపర్టీ షోకు విచ్చేసే సందర్శకులకు ప్రత్యేక బహుమతులను కూడా ప్రకటిస్తారు. గోవాకు ఉచిత విమాన టికెట్లను అందజేస్తారు.

- **టీన్యూస్ గోల్డెన్ ప్రాపర్టీ షోకు.. అపర్ణా గ్రూప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.** డైమండ్ స్పాన్సర్:రామకృష్ణా వెనూజియా, గోల్డ్ స్పాన్సర్: కార్పొరేట్ వెంచర్స్, పవర్డ్ బై: మైహోమ్.
- ఈ కార్యక్రమంలో పేరెన్నిక గల నిర్మాణ సంస్థలు తమ స్టాళ్లను ప్రదర్శిస్తున్నాయి. ఆర్క్ గ్రూప్, టెర్మినస్ ఇన్‌ఫ్రా, ఏవీ కన్‌స్ట్రక్షన్స్, ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై సిటీ, గిరిధారి హోమ్స్, గ్రీన్ హోమ్, జేబీ ఇన్‌ఫ్రా సెరీన్ సిటీ, కపిల్ ప్రాపర్టీస్, మంజీరా గ్రూప్, ముప్పా హోమ్స్, ఫినిక్స్ గోల్ఫ్ ఎడ్జ్, రాజపుష్ప ప్రాపర్టీస్, సాలార్‌పురియా సత్వా, ఎస్‌పీఈసీ, సాకేత్ గ్రూప్, ఎస్‌ఎంఆర్ హోల్డింగ్స్, స్పేస్ విజన్, శ్రీ బాలాజీ, ఎస్‌బీఐ బ్యాంక్, వర్టూసా లైఫ్‌స్పేసెస్ వంటివి తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నాయి.
- **ఈ ప్రాపర్టీ షోకు మీడియా పార్టనర్లు..** గ్రేట్ తెలంగాణ (వెబ్), జీటీవీ, యోయో టీవీ (వెబ్ టీవీ), ప్రకాష్ ఆర్ట్స్ (ఔట్‌డోర్), నమస్తే తెలంగాణ (ప్రింట్) ఫైడ్ (డిజిటల్). బహుమతులను ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్, సహకారం 'సహస్ర' సంస్థ అందజేస్తోంది.
- రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రాపర్టీ షోలో.. అపార్టుమెంట్లు, విల్లాలు, లగ్జరీ హోమ్స్, బడ్జెట్ హోమ్స్, టౌన్‌షిప్స్, ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన సమస్త సమాచారం లభిస్తుంది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. మీకు నచ్చిన ప్లాటు లేదా ఫ్లాటును ఎంచుకోవడానికి.. శిల్పకళావేదికలో జరిగే గోల్డెన్ ప్రాపర్టీ షోకు విచ్చేయండి.



9 కోట్ల ఆఫీసు స్థలం 3-4 లక్షల నివాసాలు

- రియల్ రంగానికి పెరిగిన ఆదరణ
- నగరానికి అడోబ్, నాస్కామ్ సెంటర్, విప్రో
- ప్రభుత్వం వినూత్న నిర్ణయాలే కారణం



అందుబాటు ధరల గృహాల గురించి దేశమంతటా చర్చ జరుగుతున్నది. ఇంతకీ, మన నగరంలో అందుబాటు గృహానికి నిర్వచనమేమిటి? ఎన్ని లక్షల్లోపు ఫ్లాట్ అయితే అందుబాటు గృహాల పరిధిలోకి వస్తుంది? ఇంతకీ హైదరాబాద్‌లో ఏయే ప్రాంతాల్లో భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయి? అమ్ముడుకాని ఫ్లాట్లు అధికంగా హైదరాబాద్‌లో ఉన్నాయని చేసే ప్రచారంలో ఎంతవరకూ వాస్తవముంది? ఇలాంటి అనేక ఆసక్తికరమైన అంశాలను క్రెడాయ్ హైదరాబాద్ వెల్లడించింది. నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. హైదరాబాద్ రియల్ రంగం తాజా పోకడలపై ప్రత్యేకంగా వివరించారు. మరి, వారు చెప్పిన అంశాల సారాంశం వారి మాటల్లోనే..

హైదరాబాద్‌లో అందుబాటు ధర గల ఫ్లాటు అంటే.. సుమారు ముప్పయ్ నుంచి నలభై లక్షలని చెప్పొచ్చు. ప్రస్తుతం నగరంలో సుమారు యాభై శాతం కంటే అధికంగా ఈ ధరకే అపార్టుమెంట్లు లభిస్తున్నాయి. కాకపోతే, వీటిని సొంతం చేసుకోవాలంటే.. శివారు ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఉదాహరణకు కొంపల్లి, పటాన్‌చెరు వంటి ప్రాంతాల్లో చదరపు అడుక్కీ రూ.3,000 ఫ్లాట్లు లభిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భార్యాభర్తలిద్దరూ కలిసి పని చేస్తేనే సొంతిల్లు కొనుక్కునే పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా ఇండ్ల ధరలు పెరిగినా, గత కొంత కాలం నుంచి పెద్దగా పెరగలేదు. కాబట్టి, నేటికీ ఇండ్ల ధరలు అందుబాటులో ఉన్నాయని చెప్పొచ్చు. సిమెంటు, స్టీలు ధరలు పెరిగినా, ఇండ్ల ధరలను పెంచడానికి డెవలపర్లు ప్రయత్నించడం లేదు. భాగ్యనగరంలో భూముల ధరలు ఇటీవల కాలంలో అనూహ్యంగా పెరిగాయి. మౌలిక సదుపాయాలు మెరుగయ్యే ప్రాంతంలో స్థలాల రేట్లు సుమారు ముప్పయ్ శాతం మేరకు అధికమయ్యాయి. పశ్చిమ హైదరాబాద్‌లో మాత్రం ఈ పెరుగదల గత కొంతకాలం నుంచి అతిపెద్దగా కనిపిస్తోంది. తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో అయితే పరిస్థితి మరీ ఎక్కువుంది.

- ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల కారణంగా.. రియల్ రంగంలో ఇండ్లకు సరికొత్త ఆదరణ పెరిగింది. జీఈఎస్ సదస్సు, మెట్రో ప్రారంభం, వరల్డ్ ఐటీ కాంగ్రెస్, బయో ఏషియా సదస్సు.. ఇలాంటివన్నీ విజయవంతం కావడంతో ఒక్కసారిగా హైదరాబాద్ ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. భాగ్యనగరంలో 'అడోబ్' కార్యాలయం ఏర్పాటు, బుద్వేల్‌లో నాస్కామ్ కేంద్రం, నగరానికొచ్చిన విప్రో సబ్బుల పరిశ్రమ, ఇదే బాటలో రానున్న రోజుల్లో మరిన్ని సంస్థలు హైదరాబాద్ బాటపడుతున్నాయి. ఫలితంగా, రియల్ రంగానికి ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతోంది.
- తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల కారణంగా, ఆఫీసు స్థలానికి హైదరాబాద్‌లో ఎక్కడ్లేని గిరాకీ పెరిగింది. దీని వల్ల వచ్చే రెండేండ్లలోపు 9 కోట్ల చదరపు అడుగుల వాణిజ్య స్థలం అందుబాటులోకి రానున్నది. దీంతో, 3 నుంచి 4 లక్షల చదరపు అడుగుల నివాస సముదాయాలకు వచ్చే రెండేండ్లలోపు హైదరాబాద్‌లో గిరాకీ ఏర్పడుతుంది. ఇరవై నుంచి ముప్పయ్ దాకా షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్సుల నిర్మాణం జోరుగా జరుగుతోంది. మొత్తానికి, ఎలా చూసినా హైదరాబాద్ రియల్ రంగానిక బంగారు భవిష్యత్తు ఉందని చెప్పొచ్చు.

రాజసంగా.. రహదారుల వెడల్పు

స్థలయజమానులకు సువర్ణావకాశం

అసలే ఇరుకిరుగ్గా ఉన్న రోడ్లు.. వాటి వెడల్పు చేయాలంటే శ్రమతో కూడుకున్న పని. రోడ్డు విస్తరణలో స్థలాన్ని కోల్పోయే భూయజమానులకు అపారమైన నష్టం వాటిల్లే ప్రక్రియ. మరి, ఆ నష్టాన్ని పూడ్చటానికి రాష్ట్ర పురపాలక శాఖ ఓ చక్కటి నిర్ణయాన్ని తీసుకున్నది. ఫలితంగా, ప్రభుత్వం తలపెట్టే రహదారుల విస్తరణ పూర్తవుతుంది. స్థలం కోల్పోయే వారికి పెద్దగా నష్టం కూడా వాటిల్లదు. ఇంతకీ, ఇదెలా సాధ్యమవుతుందని అంటారా?



హైదరాబాద్‌లో రహదారులను వెడల్పు చేయాలన్న బృహత్ లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో స్థలాన్ని కోల్పోయేవారికి ప్రత్యేక నజరానాను పురపాలక శాఖ ప్రకటించింది. సాధారణంగా, రోడ్డు విస్తీర్ణం బట్టి ఇల్లు లేదా భవన నిర్మాణానికి అనుమతిస్తారు. ఉదాహరణకు 40 అడుగుల వెడల్పు గల రోడ్డు ఉంటే.. అక్కడ 24 మీటర్ల ఎత్తు దాకా అనుమతిని స్థానిక సంస్థ అందజేస్తుంది. అదే, ఆ భూమిలో కొంత భాగాన్ని రోడ్డు విస్తరణలో స్థల యజమాని కోల్పోతే.. ప్రభుత్వం ఇక నుంచి నిర్దయగా వ్యవహరించదు. అప్పటి వరకూ ఎనిమిది అంతస్తులే అనుమతి లభించే స్థానంలో పది అంతస్తులను నిర్మించుకోవడానికి అంగీకరిస్తుంది. ఇందుకోసం టీడీఆర్‌లను సమర్పిస్తే చాలు. స్థలం కోల్పోయినా, అట్టి భూయజమానికి నష్టం వాటిల్లదు. అంతస్తులను పెంచుకోవడానికి ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) రూపంలో అవకాశమిస్తారు.గతంలో ఒక అంతస్తు మాత్రమే అదనంగా నిర్మించడానికి అనుమతిచ్చేవారు. తాజాగా, దానిని రెండు అంతస్తులకు పొడగించారు. కాకపోతే, సెట్ బ్యాక్‌లో మార్పుల్లేకుండా మరో అంతస్తుకు అనుమతించాలని విన్నపాలు చేసేవారి సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది.

మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ, రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ల అమలు కోసం ఎవరు స్థలాన్ని అందించినా.. దానికి ప్రతిఫలంగా దాదాపు 400 శాతం బిల్టప్ ఏరియాను కట్టుకోవడానికి అనుమతిస్తారు. చెరువులు, జలాశయాలు, నాలాల పరిరక్షణ వంటి ప్రాంతాల్లో కేవలం 200 శాతమే అనుమతిస్తారు. ఈ మేరకు కొత్త నిబంధనలతో జీవో విడుదల చేసింది.

రోడ్డు వెడల్పు	ఎంత ఎత్తు	సెట్‌బ్యాక్	కొత్తగా ఎంత? (టీడీఆర్)	సెట్‌బ్యాక్
40	24	8	30	8.00
60	30	10	36	10
80	45	13	51	13

40 అడుగుల రోడ్డు ఉన్న చోట సాధారణంగా 24 మీటర్ల ఎత్తు అనుమతిస్తారు. సెట్‌బ్యాక్ ఎనిమిది మీటర్లు వదలాల్సి ఉంటుంది. టీడీఆర్‌ను అందజేయడం వల్ల అదనంగా రెండు అంతస్తులు వేసుకోవచ్చు. 60 అడుగుల రోడ్డు అయితే 12 అంతస్తులను కట్టుకోవచ్చు.

చక్కటి నిర్ణయం..



జీహెచ్‌ఎంసీ లేదా హెచ్‌ఎండీఏలో రహదారులను వెడల్పు చేసేవారికి ప్రభుత్వం ఎక్కడ్లేని ప్రోత్సాహాన్ని అందజేసింది. రోడ్డు వెడల్పులో ఎవరైనా వెయ్యి చదరపు అడుగుల బిల్టప్ ఏరియాను కోల్పోతే, దానికి నాలుగు రెట్లు అదనంగా కట్టుకోవడానికి అనుమతిస్తారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఒక సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తుంది. స్థలయజమాని అట్టి స్థలాన్ని ఎవరికైనా విక్రయించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నది. ఉప్పల్‌లో టీడీఆర్ సర్టిఫికెట్ చేతిలో ఉన్నవారు.. అప్పా జంక్షన్‌లో దానిని వాడుకోవచ్చు. ఇది, ఎంతో ఉపయోగకరం. ఈ సర్టిఫికెట్లను జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్లో పెట్టడని ఉన్నతాధికారులను కోరాం. జీహెచ్‌ఎంసీ ఆమోదించింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ప్రజలకూ ఇబ్బంది ఉండదు.

– వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, టీబీఎఫ్

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
శనివారం 24 ఫిబ్రవరి 2018



విజయ్ దేవరకొండ

వేసవికి సిద్ధం!

‘అర్జున్‌రెడ్డి’ చిత్రంతో తిరుగులేని స్టార్‌డమ్‌ని సంపాదించుకున్నారు యువ హీరో విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రాన్ని జీఏ2 మరియు యు.వి.పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. ఎస్.కె.ఎన్ నిర్మాత. ప్రియాంక జవాల్కర్ కథానాయిక. ఈ చిత్రానికి ‘టాక్సీవాలా’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. మే 18న విడుదల కానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘వినూత్న కథా చిత్రమిది. విజయ్ దేవరకొండ పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో వుంటుంది. ఉన్నత నిర్మాణ విలువలతో తెరకెక్కించాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సుజిత్‌సారంగ్, సంగీతం: జేక్ బిజాయ్, స్క్రీన్‌ప్లే, మాటలు: సాయికుమార్‌రెడ్డి, కథ, దర్శకత్వం: రాహుల్ సంక్రిత్యాన్.

కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో..



రజనీకాంత్

ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ఇటీవలే అధికారికంగా ప్రకటించారు రజనీకాంత్. దాంతో ఆయన సినిమాలకు దూరమవుతారని ప్రచారం జరిగింది. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ‘2.ఓ’, పా రంజిత్ చేస్తున్న ‘కాలా’ సినిమాలే ఆయన చివరి చిత్రాలు అవుతాయని అనుమానాలు తలెత్తాయి. అయితే ఈ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెడుతూ రజనీకాంత్ శుక్రవారం కొత్త సినిమాకు అంగీకారం తెలిపారు. పిజ్జా, జిగర్‌తండ, ఇరైవి చిత్రాలతో ప్రతిభను చాటుకున్న కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రజనీకాంత్ ఓ సినిమా చేయబోతున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కథ, మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. రజనీకాంత్ నటిస్తున్న ‘కాలా’ చిత్రం ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకురానున్నది. ధనుష్ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్

అన్నీ మంచి లక్షణాలే!

‘అతను మంచి లక్షణాలున్న అబ్బాయి. జీవితంలో ఉన్నతమైన లక్ష్యాల్ని ఎంచుకుంటాడు. వాటిని సాధించడానికి వినూత్న మార్గాన్ని ఎంచుకుంటాడు. అదేమిటనేది తెలుసుకోవాలంటే మా చిత్రం చూడాల్సిందే’ అంటున్నారు ఉపేంద్రమాధవ్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘ఎంఎల్‌ఏ’. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. కాజల్ కథానాయిక. బ్లూప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్ , పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్నాయి. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ ‘కల్యాణ్‌రామ్ పాత్ర చిత్రణ వినూత్న పంథాలో సాగుతుంది. తన ఆశయాన్ని సాధించే క్రమంలో మంచి లక్షణాలున్న అబ్బాయి చేసిన ప్రయత్నాలేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. టైటిల్‌కు తగినట్లుగానే చక్కటి కథ కుదిరింది’ అన్నారు. రవికిషన్, జయప్రకాష్‌రెడ్డి, అజయ్, వెన్నెల కిషోర్, పృథ్వి, శివాజీరాజా, ప్రభాస్‌శ్రీను, లాస్యా, మనాలిరాథోడ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచనా సహకారం: ప్రవీణ్‌వర్మ, ఆదినారాయణ, సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల, ఎడిటింగ్: తమ్మిరాజు, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాతలు: భరత్‌చౌదరి, ఎమ్.వి.కిరణ్‌రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: ఉపేంద్రమాధవ్.

మార్చి 2 నుంచి థియేటర్లు బంద్!



డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వసూలు చేస్తున్న అధిక ధరలపై కొంతకాలంగా దక్షిణాది చిత్ర వర్గాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై దక్షిణాది రాష్ట్రాల సినీ నిర్మాతలు, పంపిణీదారుల జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం బెంగళూరులోని ఫిలిం ఛాంబర్‌లో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమైంది. ఇందులో వర్చువల్ ప్రింట్ ఛార్జీలను తగ్గించడంతో పాటు నిర్మాతలు కోరిన ఇతర డిమాండ్స్‌ను డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ప్రతినిధులు అంగీకరించలేదు. దాంతో మార్చి 2 నుంచి దక్షిణాదిలో సినిమాల ప్రదర్శనను నిలిపివేయాలని నిర్మాతలు, పంపిణీదారుల జేఏసీ నిర్ణయించింది. సురేష్‌బాబు అధ్యక్షతన 45 మంది సభ్యులతో ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధానంగా వర్చువల్ ప్రింట్ ఫీజులను తగ్గించాలని లేదా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సినిమా ప్రారంభంతో పాటు విరామ సమయంలో వస్తున్న వాణిజ్య ప్రకటనలను ఎనిమిది నిమిషాలకు పరిమితం చేయాలని పేర్కొన్నది. రెండు కొత్త సినిమాల ట్రైలర్లను ప్రతి సినిమాతో ఉచితంగా ప్రదర్శించాలని సర్వీస్ ప్రొవైడర్స్‌ను డిమాండ్ చేసింది. అయితే జేఏసీ డిమాండ్లను డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ అంగీకరించకపోవడంతో వారి మధ్య చర్చలు విఫలమయ్యాయి. దాంతో మార్చి 2 నుంచి థియేటర్లను బంద్ చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. ఈ నిర్ణయంతో వేసవిలో విడుదలకానున్న చిత్ర నిర్మాతలు సందిగ్ధంలో పడ్డారు.

ఒకప్పుడు సినిమాలు ప్రింట్ ఆధారంగా ప్రదర్శించబడేవి. ఓ థియేటర్ నుంచి మరో థియేటర్‌కు రీళ్లను పంపుతుండేవారు. ఒక రీల్ సినిమా ప్రింట్ చేయడానికి అరవై నుంచి డెబ్బై వేల వరకు నిర్మాతలకు ఖర్చయ్యేది. డిజిటలైజేషన్ వ్యవస్థ రంగప్రవేశంతో సినిమాల ప్రదర్శనలో సమూలమైన మార్పులు చోటుచేసుకున్నాయి. డిజిటల్ సినిమాకు వ్యయం తక్కువ అవుతుండటంతో నిర్మాతలందరూ కొత్త విధానం వైపు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో యూఎఫ్‌వో, పీఎక్స్‌డీ, క్యూబ్ వంటి సర్వీస్ ప్రొవైడర్లు డిజిటలైజేషన్‌కు సంబంధించిన సాంకేతిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. థియేటర్‌లను తమకు ఇస్తే చాలు పైసా ఖర్చు లేకుండా డిజిటలైజేషన్‌కు సంబంధించిన అన్ని పనులు తామే చూసుకుంటామంటూ సర్వీస్ ప్రొవైడర్లు ముందుకు రావడంతో నిర్మాతలు వారికి థియేటర్లను అప్పగించారు. డిజిటలైజ్ చేసినందుకు తమకు ఐదేళ్ల పాటు థియేటర్‌లను ఇస్తే చాలని.. ఇందుకోసం సర్వీస్ ఛార్జీలు తప్ప వర్చువల్ ప్రింట్ ఫీజులు(వీపీఎఫ్) వసూలు చేయమని సర్వీస్ ప్రొవైడర్స్ థియేటర్ యాజమాన్యాలతో ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత తమ హామీలను ఉల్లఘించిన సర్వీస్ ప్రొవైడర్స్ ఇష్టానుసారం వీపీఎఫ్, ఇతర ఛార్జీలను వసూలు చేస్తున్నారని నిర్మాతలు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు.

ఈ వివాదం గురించి తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు జెమిని కిరణ్ మాట్లాడుతూ ‘ప్రస్తుతం హాలీవుడ్ సినిమాలకు వీపీఎఫ్‌ను డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వసూలు చేయడంలేదు. వీపీఎఫ్‌లో 25 శాతం తగ్గించడంతో పాటు దానిని క్రమంగా తొలగించాలని వారిని కోరాం. అందుకు వారు సుముఖత వ్యక్తం చేయలేదు. ఎగ్జిబిటర్ల వైపు నుంచి జరిగిన కొన్ని తప్పులను ఎత్తిచూపుతూ ఇలా వ్యవహరించడం సరికాదు. వేసవిలో విడుదలయ్యే సినిమాలపై ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. త్వరలో తదుపరి కార్యచరణను ప్రకటిస్తాం’ అన్నారు.

శిరీష్ యుద్ధభూమి



అల్లు శిరీష్

మోహన్‌లాల్, అల్లుశిరీష్ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం ‘1971 బియాండ్ బోర్డర్స్’. మేజర్ రవి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని జాస్‌రాజ్ ప్రొడక్షన్స్, శ్రీలక్ష్మీజ్యోతి క్రియేషన్స్ పతాకాలపై ఏ.ఎన్ బాలాజీ ‘యుద్ధభూమి’ పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. మార్చి తొలివారంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. నిర్మాత మాట్లాడుతూ ‘యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. 1971 ఇండియా, పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో భావోద్వేగ ప్రధానంగా సాగుతుంది. ఆర్మీ మేజర్‌గా మోహన్‌లాల్, సైనికుడిగా అల్లు శిరీష్ పాత్రలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. నిజజీవితంలో ఆర్మీ మేజర్‌గా పనిచేసిన దర్శకుడు సినిమాను ఆద్యంతం ఉత్కంఠభరితంగా తెరకెక్కించారు. యుద్ధ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. శిరీష్ తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్నారు. ఈ నెలాఖరున చిత్ర గీతాల్ని విడుదల చేయనున్నాం’ అని తెలిపారు.

సందేశంతో ఎమ్6



శ్రావణి, మారుతి

మారుతి, శ్రావణి, ప్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘ఎమ్6’. జైరామ్‌వర్మ దర్శకుడు. విశ్వనాథ్ తన్నీరు, సురేష్ నిర్మాతలు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ‘హారర్ అంశాలు మిళితమైన నవతరం ప్రేమకథా చిత్రమిది. మారుతి నటన, జైరామ్‌వర్మ దర్శకత్వ ప్రతిభ బాగున్నాయి’ అని తెలిపారు. ‘సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నాం. ఎమ్6 అనే నంబర్ వెనకున్న రహస్యమేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. వినోదంతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం ఉంటుంది’ అని దర్శకుడు చెప్పారు. హీరోగా తన తొలి సినిమా ఇదని, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలో కనిపిస్తానని మారుతి చెప్పారు.

దొంగల ముఠా నాయకుడు



అమీర్‌ఖాన్

నటుడిగా ప్రతి సినిమాలో వైవిధ్యతను ప్రదర్శిస్తుంటారు అమీర్‌ఖాన్. కథ, కథనాలు, పాత్రల పరంగా కొత్తదనం ఉండాలని కోరుకుంటారు. ప్రస్తుతం ఆయన ‘థగ్స్ ఆఫ్ హిందుస్థాన్’ చిత్రంలో నటిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆంగ్లేయుల పాలన కాలం నాటి కథాంశంతో దర్శకుడు విజయ్‌కృష్ణ ఆచార్య ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఇందులో అమీర్‌ఖాన్, అమితాబ్‌బచ్చన్ పాత్రలు ప్రయోగాత్మక పంథాలో సాగుతాయని సమాచారం. వారి పాత్రలకు సంబంధించిన చిత్రాల్ని బయటకు రానీయకుండా చిత్ర వర్గాలు ఇన్నాళ్లు జాగ్రత్తపడ్డాయి. తాజాగా అమీర్‌ఖాన్ ఇటీవలే ఓ మ్యాగజైన్ కోసం ఫొటోషూట్ చేశారు. ఇందులో కోరమీసాలు, పొడవాటి జుట్టుతో వినూత్నంగా కనిపించారు. ‘థగ్స్ ఆఫ్ హిందుస్థాన్’లో ఆయన ఇదే లుక్‌తో కనిపించబోతున్నట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అమీర్‌ఖాన్ విభిన్న లుక్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. దారి దోపిడీ దొంగలకు నాయకుడిగా ఆయన ఈ సినిమాలో కనిపించబోతున్నట్లు సమాచారం. నవంబర్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది.

‘ఈ క్షణమే’ ప్రారంభం



శ్వేతా, అనురాగ్

జనని క్రియేషన్స్ సంస్థ రూపొందిస్తున్న ‘ఈ క్షణమే’ చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అనురాగ్ కథానాయకుడిగా పరిచయమవుతున్నాడు. పోకూరి లక్ష్మణాచారి నిర్మిస్తున్నారు. సాయిదేవరామన్ దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి బి.గోపాల్ క్లాప్‌నివ్వగా, న్యాయమూర్తి రామారావు కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘చక్కటి ప్రేమకథా చిత్రమిది. నేటి యువతరాన్ని మెప్పిస్తుంది. సంగీతానికి కూడా ప్రాధాన్యత ఉంటుంది’ అన్నారు. తమ సంస్థకిది తొలిచిత్రమని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రం ద్వారా తాను కథానాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకుంటాననే నమ్మకముందని అనురాగ్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ సినిమాకు మంచి కథ కుదిరిందని సంపూర్ణేష్‌బాబు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్, మాటలు: హేమంత్ కార్తీక్, పాటలు: అనంత్‌శ్రీరామ్.

యాదాద్రిలో వైభవంగా ఎదుర్కోలు

నవమి రోజున తులా లగ్నంలో శ్రీవారి కల్యాణం.. ఏడో రోజు జగన్మోహిని రూపం దాల్చిన శ్రీనారసింహుడు



ఎదుర్కోలు మహోత్సవంలో పాల్గొన్న భక్తులు.. జగన్మోహిని రూపంలో దర్శనమిచ్చిన స్వామి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనారసింహుడి ఎదుర్కోలు నిర్వహించారు. ఆగమశాస్త్రానుసారం వేదపండితులు సిద్ధాంతులు యజ్ఞాచార్యులు అర్చకులు యాదాద్రీశుని కల్యాణ సుముహూర్తాన్ని నిర్ణయించే ఎదుర్కోలు మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు మృగ నరరూపుడు... జ్వాలానృసింహుడు సమ్మోహనం కల్గించే జగన్మోహిని రూపంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామి తిరుకల్యాణమహోత్సవం చినజీయర్‌స్వామి వారి సూచనల మేరకు శనివారం ఉదయం 11 గంటలకు బాలాలయంలో, తిరిగి రాత్రి 8 గంటలకు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తామని ఈవో గీత తెలిపారు.

చరితార్థుడు సీఎం కేసీఆర్

- యాదాద్రి పునర్నిర్మాణ యజ్ఞం గొప్పది
- శ్రీవిళంబినామ సంవత్సరంలోనే దర్శనాలు ప్రారంభించాలి
- రామానుజ చినజీయర్‌స్వామి సూచన
- ఆలయంలో పూజలు, పునర్నిర్మాణ పనుల పరిశీలన

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం పూర్తయితే సీఎం కేసీఆర్ కీర్తిప్రతిష్ఠలు మరింత ఇనుమడింపజేస్తాయని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. యాదాద్రి ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలనే తలంపుతో ముఖ్యమంత్రి కేసీఆర్ చరితార్థుడయ్యారని కొనియాడారు. శుక్రవారం ఆయన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదాద్రి కొండపై జరుగుతున్న ప్రధానాలయ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం చేపట్టిన నిర్మాణ యజ్ఞానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, రాత్రింబవళ్లు కష్టపడి శ్రీవిళంబినామ సంవత్సరంలో పూర్తిచేయాలని స్థపతులు, ఇంజినీర్లకు సూచించారు. శ్రీవిళంబి చరిత్రలో ఎంతో ప్రాధాన్యం ఉన్నదని, యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ దర్శనాలు శ్రీవిళంబిలో ప్రారంభం కావాలన్నారు. రాజగోపురాల నిర్మాణాలు కృష్ణశిలతో జరుగుతున్నందున ప్రపంచంలోనే అత్యద్భుతమైన గోపురాలు కలిగిన ఆలయం కానున్నదన్నారు. సీఎం కేసీఆర్‌కు స్వామి వారు సంపూర్ణ ఆశీస్సులు అందించాలని మంగళశాసనం చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, ఆలయ ఈవో గీత, స్థపతులు డాక్టర్ ఆనందాచారివేలు, సౌందర్య రాజన్, ఈఈ వసంతనాయక్, డీఈలు, సాయిపాప విని సీఈఓ సునీల్‌రెడ్డి ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి మహేందర్‌రెడ్డి

రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆలయాలభివృద్ధికి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని, నాలుగేండ్లలో ఎంతో అభివృద్ధి చేసిందని, మరో రెండు విడతలు రాష్ట్రాన్ని పాలించేందుకు సీఎం కేసీఆర్‌కు ప్రజలు అవకాశం ఇవ్వడం ఖాయమని మంత్రి అన్నారు.



ఆలయ నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి. చిత్రంలో మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు కూడా ఉన్నారు.

జిల్లా రైతు సమన్వయకర్తల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, పంట వేయడం దగ్గర నుంచి అమ్ముకునే వరకు రైతుకు అండగా నిలిచేందుకు, ప్రభుత్వానికి.. రైతుకు మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించేందుకు రైతు సమన్వయ సమితులు ఏర్పాటుచేస్తున్నది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నాలుగు అంచెల్లో ఈ సమితులను ఏర్పాటవుతాయి. ఇప్పటికే 30 జిల్లాల రైతు సమన్వయసమితులను ఏర్పాటుచేసిన ప్రభుత్వం శుక్రవారం వాటికి సమన్వయకర్తలను నియమించింది. విత్తనాలు వేసే దగ్గర నుంచి పంట చేతికి వచ్చి మార్కెటింగ్ పూర్తయ్యేవరకు రైతు సమన్వయ సమితులు రైతులకు అండగా ఉంటాయి. రైతు సమన్వయ సమితులు ఏవిధంగా పనిచేయాలో దిశానిర్దేశనం చేసేందుకు ఈ నెల 25, 26 తేదీల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సమన్వయ సమితి సదస్సులలో సమితి ప్రతినిధులతో ముఖాముఖీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

జిల్లా రైతు సమన్వయ సమితి సమన్వయకర్తలు వీరే...

జిల్లా	పేరు	సామాజికవర్గం
కరీంనగర్	గుండెల్లి తిరుపతి	బీసీ-ముదిరాజ్
పెద్దపల్లి	కోటరాంరెడ్డి	ఓసీ- రెడ్డి
జగిత్యాల	చీటి వెంకటరావు	ఓసీ- వెలమ
సిరిసిల్ల	గడ్డం నర్సయ్య	బీసీ-మున్నూరు కాపు
మెదక్	టీ సోములు	బీసీ-మున్నూరు కాపు
సిద్దిపేట	వీ నాగిరెడ్డి	ఓసీ-రెడ్డి
సంగారెడ్డి	వెంకట్రామిరెడ్డి	ఓసీ-రెడ్డి
అదిలాబాద్	అడ్డి భోజిరెడ్డి	ఓసీ-రెడ్డి
మంచిర్యాల	ఎం గురవయ్య	బీసీ-పెరిక
ఆసిఫాబాద్	బసవత్ కార్ విశ్వనాథ్	ఎస్సీ
నిర్మల్	ఎన్ వెంకట్రామిరెడ్డి	ఓసీ- రెడ్డి
నిజామాబాద్	బనావత్ మంజుల	ఎస్టీ-లంబాడ
కామారెడ్డి	డీ అంజిరెడ్డి	ఓసీ-రెడ్డి
వరంగల్ అర్బన్	ఈ లలితా యాదవ్	బీసీ-యాదవ్
వరంగల్ రూరల్	బొల్లె భిక్షపతి	ఎస్సీ
భూపాల్‌పల్లి	పల్లా బుచ్చయ్య	బీసీ-పెరిక
మహబూబాబాద్	భుక్యా బాలాజీ	ఎస్టీ-లంబాడ
జనగామ	ఐ రమణారెడ్డి	ఓసీ-రెడ్డి
ఖమ్మం	నల్లమల వెంకటేశ్వరరావు	ఓసీ-కమ్మ
కొత్తగూడెం	అంకిరెడ్డి కృష్ణారెడ్డి	ఓసీ-రెడ్డి
నల్లగొండ	ఈ రాంచందర్‌నాయక్	ఎస్టీ-లంబాడ
యాదాద్రి	కొల్పుల అమరేందర్	బీసీ-ముదిరాజ్
సూర్యాపేట	ఎస్ ఏ రజాక్	ముస్లిం- మైనార్టీ
మహబూబ్‌నగర్	ఎస్ బస్వరాజ్	బీసీ-గౌడ్
నాగర్‌కర్నూల్	పోకల మనోహర్	బీసీ- పెరిక
గద్వాల	కె వెంకటరాములు	బీసీ- కురుమ(యాదవ్)
వనపర్తి	పీ జగదీశ్వర్‌రెడ్డి	ఓసీ- రెడ్డి
రంగారెడ్డి	వంగేటి లక్ష్మారెడ్డి	ఓసీ- రెడ్డి
వికారాబాద్	కే మహేశ్‌రెడ్డి	ఓసీ- రెడ్డి
మేడ్చల్	నారెడ్డి నందారెడ్డి	ఓసీ- రెడ్డి

రైతు సమన్వయసమితి డైరెక్టర్‌గానే వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి

- ఉత్తర్వులు సవరించిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌కు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి డైరెక్టర్‌గానే ఉంటారని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను సవరించింది. ముందుగా విడుదలచేసిన ఉత్తర్వుల్లో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి కార్పొరేషన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నది. అయితే విషయంలో జరిగిన సాంకేతిక పొరపాటును గుర్తించిన ప్రభుత్వం రైతు సమన్వయ సమితికి వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి కూడా డైరెక్టర్‌గానే వ్యవహరిస్తారని స్పష్టం చేసింది.

వచ్చేనెల 25న సకల ఉద్యోగుల మహాసభ



శుక్రవారం సచివాలయంలో సీఎస్ ఎస్కే జోషికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు కారం రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలనే డిమాండ్‌తో మార్చి 25న హైదరాబాద్‌లో సకల ఉద్యోగుల మహాసభను నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తొలిసారి రాష్ట్రంలోబహిరంగసభను ఏర్పాటుచేస్తున్నామని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులు సీఎస్ ఎస్కే జోషిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు మమత, నాయకులు స్వామిరెడ్డి, బల్వంతరెడ్డి, ఎంబీ కృష్ణయాదవ్, జ్ఞానేశ్వర్, ఖాదర్, సత్యనారాయణ, యూసఫ్, జగన్నాథం ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం వేసవిలో అర్హతగల ఉద్యోగులకు బదిలీలు చేయాలని కోరుతూ టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం సీఎస్ ఎస్కే జోషికి విజ్ఞప్తిచేశారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు ఫస్ట్‌ర్యాంక్

హైదరాబాద్: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండి యా ఇటీవల ప్రకటించిన కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంట్స్ (సీఎంఏ) ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారని విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మోహన్ తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో మొదటి 50 ర్యాంకుల్లో 33, సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో మొదటి 50 ర్యాంకుల్లో 19 ర్యాంకులు తమ విద్యార్థులే సాధించారని శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సీఎంఏ ఇంటర్‌లో కూరపాటి వైష్ణవి, సీఎంఏ ఫైనల్‌లో జీ పూజిత అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకులు పొందారన్నారు.



వైష్ణవి



పూజిత

సౌర విద్యుత్‌లో మనమే నంబర్ 1

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

3 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యమున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ

సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో తెలంగాణ రెడ్‌కో వినూత్న పంథా

సబ్‌స్టేషన్ దగ్గర్లోనే చిన్న సోలార్ ప్లాంట్లు



విద్యుత్.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ అత్యంత కీలకమైన రంగం ఇది. అందులోనూ పర్యావరణానికి ఎలాంటి హానీ లేని.. పునరుత్పాదక ఇంధన వనరుల విషయానికి వస్తే.. అందరి దృష్టి కేంద్రీకృతమయ్యే అంశం సౌర శక్తి. సౌర ఫలకాల ఏర్పాటు ద్వారా చాలా తక్కువ ధరకే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంపై మనదేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలూ దృష్టి సారించాయి. దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ.. మహామహులనదగ్గ గుజరాత్, ఏపీ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలనుకూడా వెనుకకు నెట్టి అగ్రస్థానం సంపాదించడం అంత తేలికైన విషయమేమీ కాదు. ఇందుకు సరైన దార్శనికత, మార్గదర్శనం, సమిష్టి కృషి అన్ని కలిస్తేనే సాధ్యమవుతుంది. అలాంటి దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి మార్గదర్శనంలో విద్యుత్ సిబ్బంది సమిష్టి కృషితో ఈరోజు దేశంలోనే మూడు గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచింది.

పక్కా ప్రణాళికతో ముందుకు..

తెలంగాణ ఏర్పడితే ప్రధానంగా విద్యుత్ సమస్యనే ఎదురవుతుందని సమైక్య పాలకులు ఊదరగొట్టిన నేపథ్యంలో దీని విషయంలోనే ముఖ్యమంత్రి మొదట్నుంచీ పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారు. దేశంలోనే ఎవరూ ఊహించని విధంగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటల విద్యుత్‌తోపాటు.. తాజాగా ఈ జనవరి 1 నుంచి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించారు. దీనికి ప్రధానంగా కర్త, కర్మ, క్రియగా.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావునే చెప్పుకోవాలి. రాష్ట్ర అవసరాలను ముందుగానే గుర్తించి, భవిష్యత్తును ఊహించి.. ఇటు థర్మల్ విద్యుత్‌తో పాటు సౌరవిద్యుత్‌పై కూడా సీఎం దృష్టి సారించారు. ఇప్పటివరకు సౌర విద్యుత్‌లో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు లాంటి రాష్ట్రాలనుకూడా వెనుకకు నెట్టి.. తెలంగాణ అగ్రస్థానానికి చేరుకుంది. దేశంలో ఎవరుకూడా ఇప్పటివరకు సాధించని 3 గిగావాట్ల (3 వేల మెగావాట్లు) సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అధిగమించింది. 2017 డిసెంబరు చివరినాటికి చూసుకుంటే.. తెలంగాణ 3145 మెగావాట్లతో మొదటి స్థానంలో ఉండగా.. కర్నాటక 2744 మెగావాట్లతో రెండోస్థానంలో నిలిచింది.

సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం

(2017 డిసెంబర్‌నాటికి..మెగావాట్లలో)

1	తెలంగాణ	3145
2	కర్నాటక	2744
3	ఆంధ్రప్రదేశ్	2279
4	రాజస్థాన్	2261
5	తమిళనాడు	1720
6	గుజరాత్	1381
7	మధ్యప్రదేశ్	1295
8	పంజాబ్	793
9	మహారాష్ట్ర	776
10	ఉత్తరప్రదేశ్	672

వినూత్న ఆలోచనతో..

వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి మన రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువ. ఉమ్మడి రాష్ట్రంలోనే 600 మెగావాట్ల సామర్థ్యాన్ని మించ లేదు. అందులోనూ సీమాంధ్ర ప్రాంతంలోనే ఎక్కువ సౌర విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పారు. ఆరకంగా చూస్తే తెలంగాణ ఏర్పడేనాటికి మన సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 100 మెగావాట్లను దాటి లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో సౌర విద్యుత్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేలా ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో అధికారులు వినూత్నంగా చేసిన ఆలోచనలను అమలులో పెట్టారు. లైన్ ఖర్చులు తగ్గేందుకు వీలుగా సబ్‌స్టేషన్లకు దగ్గరలో సౌరవిద్యుత్ ప్లాంట్లను నెలకొల్పారు. దీనివల్ల ట్రాన్స్‌మిషన్ నష్టాలు తగ్గటంతోపాటు ఎక్కువగా ఉత్పత్తి అందుబాటులోకి వస్తుంది. దీంతో అతి తక్కువ ధరకు.. ఎక్కువ సౌర విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. పైగా తక్కువ సామర్థ్యం ఉన్న ప్లాంట్లను ప్రోత్సహించడం ద్వారా.. ఎక్కువగా భూసేకరణ చేయాల్సిన భారాన్ని కూడా తగ్గించగలిగారు. 2017 నాటికే రెండువేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాం. దీనితో మూడున్నరేండ్లలో 3 వేల మెగావాట్లకుపైగా సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చుకోగలిగాం. అమెరికాకు చెందిన మెర్‌కోం క్యాపిటల్ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన మెర్‌కోం కమ్యూనికేషన్స్ ఇండియా సంస్థ తాజాగా ఇచ్చిన నివేదికలోనూ తెలంగాణ అగ్రస్థానంలో నిలువడం గమనార్హం. దేశంలో ఉత్పత్తి అవుతున్న 19.6 గిగా వాట్ల సౌర విద్యుత్‌లో 50 శాతం తెలంగాణ, కర్ణాటకల్లోనే అవుతున్నది.

సీఎం విజన్ వల్లే సాధ్యమయ్యింది

ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌తోనే ఈ అద్భుతం సాధ్యమైంది. పర్యావరణహితమైన సౌరవిద్యుత్‌పై దృష్టి సారించి.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. మన ఆలోచనపై దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు దృష్టి సారించాయి. మన విధానాన్ని చాలా రాష్ట్రాలు అమలుచేస్తున్నాయి. సౌర విద్యుత్‌లో 3 గిగావాట్లను దాటిన మొదటి రాష్ట్రంగా.. తెలంగాణ నిలువడం గర్వకారణం. ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుల దిశానిర్దేశం, సహకారంతో ముందుకు సాగుతున్నాం.

–ఏ సుధాకర్‌రావు, వైస్ చైర్మన్, ఎండీ, టీఎస్‌రెడ్కో (తెలంగాణ పునరుత్పాదక ఇంధన సంస్థ)

తెలంగాణ వరిసాగుకు అనువుకాదట!

- బ్రిజేశ్‌ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వితండ వాదన
- తెలంగాణ న్యాయవాదుల ప్రజెంటేషన్ బాగున్నదన్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరిసాగుకు తెలంగాణ భూములు అనువుకాదని చెప్పి కృష్ణా ట్రిబ్యునల్‌ను సైతం తప్పుదోవ పట్టించేందుకు, తద్వారా కృష్ణాజలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కకుండా చేసేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రయత్నాలను తెలంగాణ న్యాయవాదులు భగ్నం చేశారు. శాస్త్రీయ ఆధారాలు లేకుండా, కనీసం ప్రాథమిక అధ్యయనం కూడా చేయకుండానే ఏపీ విచిత్ర వాదనకు దిగిందనే విషయాన్ని ట్రిబ్యునల్ చైర్మన్ సమక్షంలోనే రుజువు చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణలో భాగంగా రెండోరోజు శుక్రవారం వ్యవసాయరంగంపై ఏపీ తరపు సాక్షి సత్యనారాయణను తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. తెలంగాణ భూములు వరికి అనువు కాదంటూ ట్రిబ్యునల్‌కు ఏపీ సమర్పించిన అఫిడవిట్‌లోని డొల్లతనాన్ని బయటపెట్టారు. వైద్యనాథన్ వేసిన అనేక ప్రశ్నలకు ఏపీ సాక్షి సత్యనారాయణ బదులివ్వకపోయారు. తరువాత జవాబు చెప్తానని అన్నారు. గురువారం విచారణలో ఇదే మాదిరిగా వ్యవహరించారు. దాంతో ఇదేమిటని సాక్షాత్తూ ట్రిబ్యునల్ చైర్మన్ ఆయనను ప్రశ్నించారు. ఈ విడుతలో రెండురోజులపాటు క్రాస్ ఎగ్జామినేషన్ ముగియడంతో తదుపరి విచారణను వచ్చేనెల 26,27,28 తేదీలకు వాయిదా వేశారు. శుక్రవారం జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ప్రధానంగా భూమిలోకి నీరు ఇంకే స్వభావం (పర్కొలేషన్ రేటు)పై ఏపీ అఫిడవిట్‌లో పొందుపరిచిన అంశాలపై వైద్యనాథన్ ప్రశ్నలు సంధించారు. ఏపీ అఫిడవిట్‌లో వరి సాగుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కృష్ణా బేసిన్‌లో పర్కొలేషన్ రేటును రెండు మిల్లీమీటర్లుగా, తెలంగాణ పరిధిలో ఐదు మిల్లీమీటర్లుగా పొందుపరిచారు. అంటే తెలంగాణ పరిధిలోని భూముల్లో వరి సాగుకు ఎక్కువ నీరు వృథా అవుతుందని, ఇందుకు భూములు అనువుగా లేకపోవడమే కారణమనే విచిత్ర వాదన చేశారు. దీనిని వైద్యనాథన్ ప్రస్తావిస్తూ.. ఏ ప్రాతిపదికన ఈ రేటును అఫిడవిట్‌లో పొందుపరిచారు? దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో అధ్యయనంగానీ, ల్యాబొరేటరీల్లో పరీక్షలుగానీ చేశారా అని అడిగారు. అలాంటిదేమీ లేదని ఏపీ సాక్షి చెప్పారు. కనీసం ఏపీలోగానీ, తెలంగాణలోగానీ మట్టి నమూనాలు సేకరించి పరీక్షించారా? అని అంటే అదీ లేదన్నారు. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణలో ఎంతోకాలంగా వరి సాగు జరుగుతున్నది. తెలుసా? అని వైద్యనాథన్ అడుగగా పూర్తి వివరాలు తెలియవని ఏపీ సాక్షి బదులిచ్చారు. పలు ప్రశ్నలకు సత్యనారాయణ ఆ వివరాలు పరిశీలించి వస్తానని చెప్పడంతో వైద్యనాథన్ ఈ విషయాన్ని బ్రిజేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో 'ఇదేమిటి? మీరు చాలా ప్రశ్నలకు సమాధానమివ్వాల్సి ఉంది కదా?' అని బ్రిజేశ్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. శుక్రవారం జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో వైద్యనాథన్ 21 ప్రశ్నలకు అడిగినా వాటిలో చాలావాటికి ఏపీ సాక్షి తగిన సమాధానాలు ఇవ్వలేదు. దాంతో విచారణను వచ్చే నెల 26,27, 28వ తేదీలకు వాయిదా వేస్తున్నట్లు బ్రిజేశ్ ప్రకటించారు. కాగా ఆంధ్రప్రదేశ్ తన మూడో సాక్షి తరపున అఫిడవిట్‌ను గత నెల 22లోగా దాఖలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు సమర్పించలేదు.

తెలంగాణ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు హర్షం

ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాటాపై తెలంగాణ తరపు న్యాయవాదులు సరైన వాదనలు వినిపిస్తున్నారని, సమర్థంగా ప్రజెంటేషన్ ఇస్తున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు సంతృప్తివ్యక్తం చేశారు. ట్రిబ్యునల్‌లో శుక్రవారం జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌ను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

బీఏ ఉర్దూ మీడియం చరిత్ర పుస్తకాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీఏ రెండో సంవత్సరం హిస్టరీ (చరిత్ర) పాఠ్యాంశం ఉర్దూ మీడియం పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శుక్రవారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో విడుదలచేశారు. నాంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సమీనా బషీర్ ఈ పుస్తకాలను రచించారు. గతేడాది బీఏ హిస్టరీ మొదటి సంవత్సరం పుస్తకాలను విడుదలచేయగా ఈసారి రెండో సంవత్సరం బీఏ హిస్టరీ పుస్తకాలను విడుదలచేశారు. ఉర్దూ మీడియంకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆకాంక్షించారు.

మహిళా వర్సిటీకి సానుకూల స్పందనపై హర్షం

- డిప్యూటీ సీఎంకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోఠి ఉమెన్స్ కాలేజీని మహిళా యూనివర్సిటీగా ఏర్పాటుచేసేందుకు సానుకూలంగా స్పందించడంపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి లేఖ రాశారు. రాష్ట్రంలో మహిళా వర్సిటీని ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ 2015 జూన్ 17వ తేదీన సీఎం కేసీఆర్‌కు నిరంజన్‌రెడ్డి లేఖ రాశారు. మహిళా వర్సిటీగా ఏర్పాటుకు సానుకూలంగా ఆలోచన చేయడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు.

విద్యాసంస్థల ప్రాంగణాల్లో నాటిన మొక్కలు బతుకాలి

- వారంలో మొక్కల వివరాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హరితహారంలో భాగంగా వివిధ సంస్థల ప్రాంగణాల్లో నాటిన ప్రతి మొక్క బతుకాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా, ముఖ్యమంత్రి ఓఎస్డీ (హరితహారం) ప్రియాంక వర్గీస్ అన్నారు. ఇందుకోసం మిగతాశాఖలతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత ఆయాజిల్లాల అటవీ అధికారులదేనని స్పష్టంచేశారు. పాఠశాల ఆవరణల్లో రక్షణ, నీటి సౌకర్యం ఉంటుందని, మొక్కల రక్షణ కోసం విద్యాశాఖ ప్రత్యేకంగా పాఠశాలలకు సిబ్బందిని కేటాయిస్తున్నందున బతికే మొక్కల శాతం పెరుగాలని ఆదేశించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల సంరక్షణపై శుక్రవారం అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా, ముఖ్యమంత్రి ఓఎస్డీ (హరితహారం) ప్రియాంక వర్గీస్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల అటవీ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్చి నుంచి రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన బృందాల ద్వారా ఆకస్మిక తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్లు పంపిన నివేదికలు, క్షేత్రస్థాయిలో మొక్కల పరిస్థితిని ఈ బృందాలు పరిశీలిస్తాయని వెల్లడించారు.

సీబీఐ కోర్టుకు వైఎస్ జగన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్రమాస్తులపై దాఖలైన కేసుల్లో విచారణ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తోపాటు ఆడిటర్ విజయసాయిరెడ్డి శుక్రవారం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. తదుపరి విచారణను న్యాయస్థానం మార్చి 9కి వాయిదావేసింది.

ఆ మూడూ గులాబీ ఖాతాలోకే..

- రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ
- ఏప్రిల్ 2తో ముగియనున్న ముగ్గురు సభ్యుల పదవీకాలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదవీకాలం ముగియడంతో త్వరలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. తెలంగాణ నుంచి మూడు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఏప్రిల్ 2న రాష్ట్రానికి చెందిన ముగ్గురు సభ్యుల పదవీకాలం ముగుస్తున్నది. శాసనసభలో సభ్యుల బలాబలాలను పరిశీలిస్తే ఆ మూడు స్థానాలు కూడా అధికార టీఆర్ఎస్ పార్టీ ఖాతాలోకే వెళ్లే పరిస్థితి కనిపిస్తున్నది. తెలంగాణ అసెంబ్లీ నుంచి ఒక రాజ్యసభ అభ్యర్థి విజయానికి 30 ఓట్లు అవసరమవుతాయి. ప్రస్తుతం తెలంగాణ శాసనసభలో అధికారపార్టీకి 90 మంది సభ్యుల బలం ఉంది. అలాగే ఏడుగురు సభ్యులు కలిగిన మజ్లిస్ పార్టీ కూడా టీఆర్ఎస్‌కే మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో శాసనసభలో టీఆర్ఎస్‌కు 97 మంది మద్దతు ఉంటుంది. దీంతో మూడుకు మూడు స్థానాలనూ టీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమైపోయింది. ప్రతిపక్షాలకు కనీసం ఒక్కస్థానాన్ని దక్కించుకునేందుకు కూడా సభ్యుల బలం లేకపోవడంతో వారు ఈసారి అభ్యర్థిని దింపే సాహసం కూడా చేయరని రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నది. ప్రస్తుత సిట్టింగ్ సభ్యులుగా ఉన్న ముగ్గురి పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 2తో ముగియనున్నది. దానికి సుమారు 15 రోజుల ముందే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలి. రాష్ట్రంనుంచి రాపోలు ఆనందభాస్కర్(కాంగ్రెస్), సీఎం రమేష్(టీడీపీ) పదవీ కాలం ముగుస్తున్నది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీఎం రమేష్ రాష్ట్ర విభజన సమయంలో తీసిన లాటరీలో తెలంగాణకు అలాట్ అయ్యారు. ఇక మరో సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి(కాంగ్రెస్) 2017 జూన్‌లో మృతి చెందడంతో ఆయన పదవీ ఖాళీ అయింది. ఆయన పదవీ కాలం కూడా ఏప్రిల్ 2తోనే ముగుస్తున్నది.

మొదటిపేజీ తరువాయి...

రైతు వ్యతిరేకులకు చెంపపెట్టు

మాట్లాడుతూ.. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల, రైతుల వ్యతిరేకులకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు. సుప్రీంలో వేసిన కేసు వెనుక ఎవరున్నారో? విమాన టికెట్లు ఎవరు సమకూర్చారో? డబ్బులు ఎవరిచ్చారో? ఢిల్లీకి వచ్చి కేసు వేసినవాళ్లను వెనకుండి నడిపిస్తున్నదెవరో? అన్ని వివరాలు పూర్తి ఆధారాలతో సహా తమ దగ్గర ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. శాసనసభ వేదికగా కాంగ్రెస్ బండారాన్ని బయటపెడతామని మంత్రి హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఆపేందుకు కాంగ్రెస్ ఎన్నివిధాల ప్రయత్నించాలో అన్నివిధాలుగా ప్రయత్నించిందని, ఆ పార్టీ నాయకులు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా హైకోర్టు, సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్స్‌లో భారీసంఖ్యలో కేసులు వేయగా చివరకు వారికి మొట్టికాయలే మిగిలాయన్నారు. శుక్రవారం పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతోపాటు ఆ సందర్భంగా న్యాయమూర్తి తీవ్ర పదజాలంతో తలంటు పోశారని మంత్రి గుర్తుచేశారు. పిటిషనర్ 'ఫోరం హంటింగ్' చేస్తున్నారని మండిపడ్డారని చెప్పారు. చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించకుండా ఢిల్లీ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఎందుకు ఆశ్రయించారంటూ నిలదీశారని మంత్రి తెలిపారు. వాస్తవంగా తెలంగాణ చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ పరిధిలోకి వస్తుందని, అయినా పిటిషనర్ ఢిల్లీ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఎందుకు వెళ్లారంటూ న్యాయమూర్తి ఎత్తిచూపారని పేర్కొన్నారు. దీంతోపాటు ఏదైనా ప్రాజెక్టు ప్రారంభమైన ఆర్నెళ్లలోపు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి ఉంటుందని, కానీ తొమ్మిది సంవత్సరాల తర్వాత రావడాన్ని కూడా న్యాయమూర్తి తప్పుబట్టారని మంత్రి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటికే పర్యావరణ, అటవీ, సీడబ్ల్యూసీ, హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర అనుమతులన్నీ వచ్చిన విషయాన్ని పిటిషనర్ దాచిపెట్టి సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. కానీ తెలంగాణ తరపు న్యాయవాది సుప్రీంకు ఈ విషయాన్ని నివేదించారని మంత్రి చెప్పారు.

సీఎం కేసీఆర్ సంకల్పం మరింత బలపడింది

సుప్రీంకోర్టు తీర్పుతో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోయాయని, న్యాయస్థానంలో న్యాయం, ధర్మం గెలిచిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆకుపచ్చ తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే సీఎం కేసీఆర్ సంకల్పం ఈ తీర్పుతో మరింత బలపడిందని నొక్కిచెప్పారు. మరింత శ్రమించి వచ్చే వానకాలం నాటికి ప్రాజెక్టు ద్వారా నీటిని లిఫ్టు చేసేందుకు పనులు పూర్తిచేస్తామని, ఈ ఏడాది చివరినాటికి కాళేశ్వరం ప్రాజెక్టు తొలిఫలితం వస్తుందన్నారు. మనిషికి గాలి ఎట్లనో.. రైతులు, పంటలకు నీరు అలాంటిదని, అట్లాంటి నీటిని రైతులకు అందకుండా చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని మంత్రి విమర్శించారు. ప్రాజెక్టులను అడ్డుకోవడమంటే రాష్ట్ర అభివృద్ధిని, ప్రగతిని అడ్డుకోవడమేనన్నారు. సుప్రీం మొట్టికాయలతోనైనా కండ్లు తెరిచి, బుద్ధి తెచ్చుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. కోదండరాంను, కాంగ్రెస్‌ను తాము వేరుగా చూడటంలేదని, అవి ఒకచెట్టు కొమ్మలేనని ఒక ప్రశ్నకు సమాధానంగా హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. వాళ్లది ప్రజల ఎజెండా కాదని, రాజకీయ ఎజెండా మాత్రమేనన్నారు. సీఎం కేసీఆర్ ప్రాణాలకు ఒడ్డి తెలంగాణ తెచ్చారని, ఆయనకు పదవులు గొప్ప కాదని స్పష్టంచేశారు. ఏ లక్ష్యం కోసం తెలంగాణ తెచ్చామో దాని సాధనకు రాత్రింబవళ్లు పనిచేస్తున్నామని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మూడుషిఫ్టుల్లో 24 గంటలపాటు ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయా? అని మంత్రి ప్రశ్నించారు. అయినా వాటిని అడ్డుకునేందుకు కాంగ్రెస్, కోదండరాం ప్రయత్నిస్తున్నారంటే.. వాళ్లకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు అధికారమే పరమావధి అని.. అధికారం లేకుంటే వాళ్లు తట్టుకోలేక కుట్రలు పన్నుతారని మంత్రి హరీశ్ అన్నారు.



ఢిల్లీలో సుప్రీంకోర్టు వద్ద అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

పరిశోధనలకు పెద్దపీట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరిశోధనలకు పెద్దపీట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) ఏడాదికాలం పూర్తిచేసుకున్నది. ఉద్యోగాల కల్పన, ఆవిష్కరణల రంగంలో రిచ్ తోడ్పడిందని మంత్రి కేటీఆర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. మొదటి ఏడాదిలోనే రిచ్ 250 కంపెనీలతో సమావేశం అయిందని, 25 కంపెనీలకు పైగా సహాయం అందించి అవి తమ ప్రయాణంలో ముందుకు సాగేందుకు సహకరించిందని, పది సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నదని మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు.

ఉద్యోగుల శిక్షణలో టాప్ టాస్క్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కంపెనీలకు అనుగుణంగా టాస్క్ అభ్యర్థులను తీర్చిదిద్దడంతో దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని కోరుతున్నాయి. ఇటీవల టాస్క్‌తో ఐఐఐటీ ఒప్పందం చేసుకుంది. ఈ రెండు సంస్థలు కలిసి 'ఎమర్జింగ్ లీడర్స్ ప్రోగ్రాం' పేరుతో కార్యక్రమాన్ని రూపొందించాయి. ఇటీవల హైసియాతో కలిసి శిక్షణ నిర్వహించారు. టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు విశేష స్పందన వచ్చిందని ఐఐఐటీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గణేశ్ నమస్తే తెలంగాణకు తెలిపారు.

చేనేత కార్మికులకు శుభవార్త!

లక్షలోపు రుణాల మాఫీ.. ఇప్పటికే రుణాలు చెల్లిస్తే ఆ మొత్తం వారి ఖాతాల్లో జమ

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

చేనేత కార్మికులకు శుభవార్త.. రాష్ట్రంలో చేనేత కార్మికులకు లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విధంగా రుణమాఫీకి సంబంధించి వారికి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నది. 2014 జనవరి 1 నుంచి 2017 మార్చి 31 లోగా చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను, వడ్డీతో సహా వెంటనే మాఫీచేయాలని అన్ని జాతీయబ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఈ మేరకు ఆయా బ్యాంకులకు రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశారు. లక్షరూపాయలలోపు రుణాలను మాఫీచేసి, ఆ విషయం సిబిల్ రిపోర్ట్‌లో స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. వర్కింగ్ క్యాపిటల్ కింద చేనేత కార్మికులు బ్యాంకుల నుంచి తీసుకున్న లక్ష రూపాయలలోపు రుణాలను పూర్తిగా మాఫీచేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే కొందరు కార్మికులు ఈ రుణాలను చెల్లించారు. రుణ మాఫీ దరిమిలా అటువంటి వారి ఖాతాల్లో అప్పులకింద వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి జమచేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఇతర వృత్తిదారులతోపాటు చేనేత కార్మికుల సంక్షేమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతున్నది. ఇందులో భాగంగా చేనేత రుణాల మాఫీతోపాటు నూలుపై 40 శాతం వరకు సబ్సిడీని ఇవ్వాలని, చేనేత వస్త్రాలను కొనుగోలుచేయాలని ప్రభుత్వశాఖలకు ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో చేనేత కార్మికులు లక్ష రూపాయల లోపు చెల్లించాల్సిన రుణాల మొత్తం రూ.14.76 కోట్ల మేరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ కార్మికులు పూర్తిగా చెల్లించిన రుణాల మొత్తం రూ.76 లక్షలు కాగా, లక్ష రూపాయలకు పైగా ఉన్న రుణాలలో ఇంకా చెల్లించాల్సిన మొత్తం రూ.8.22 కోట్ల లక్షల వరకు ఉంటుందని వారు వివరించారు.

సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం

రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం

వడ్డీ చెల్లింపునకు బోర్డు ఆమోదం సీఎం హామీని అమలుచేసిన సింగరేణి

ఇప్పటికే హోంలోన్ తీసుకొన్నవాళ్లకూ పథకం వర్తింపు : సీఎండీ ఎన్ శ్రీధర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ సింగరేణి యాజమాన్యం అమలు చేస్తున్నది. సింగగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ. 10 లక్షల వడ్డీ లేని రుణ హామీకి సంబంధించిన విధి విధానాలకు అంగీకారం తెలిపింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. రూ. పది లక్షల వరకు వడ్డీ లేని రుణానికి సంబంధించి.. మార్గదర్శకాలతో కూడిన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయనున్నట్టు సంస్థ చైర్మన్, ఎండీ ఎన్ శ్రీధర్ ప్రకటించారు. సింగరేణి కార్మికుల కష్టాన్ని, త్యాగాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ వారి సేవలకు సముచిత గుర్తింపుగా పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వినూత్న పథకాన్ని అమలుచేయాలని ఆదేశించారన్నారు. ఈ తరహా పథకం కోలిండియాతో సహా దేశంలోని ఏ ప్రభుత్వరంగ సంస్థలోనూ లేదని తెలిపారు.

ఇప్పటికే గృహనిర్మాణ రుణం పొందినవారికీ వర్తింపు

సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం సింగరేణి కార్మికుడు (ఎన్సీడబ్ల్యూఏ ఉద్యోగులు) ఎవరైనా బ్యాంకు ద్వారా తీసుకొన్న రుణంలో రూ.10 లక్షల వరకు అతను చెల్లించే వడ్డీ సొమ్మును యాజమాన్యం తిరిగి కార్మికుడికి చెల్లిస్తుంది. ఇప్పటికే రుణం తీసుకొన్నవారికి కూడా దీన్ని వర్తింపజేస్తారు. ఇందుకోసం సుమారు రూ.130 కోట్ల వరకు భారం పడుతుందని సింగరేణి ఆర్థికశాఖ అంచనాలు వేస్తున్నది. దీన్ని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని సీఎండీ శ్రీధర్ పిలుపునిచ్చారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో బొగ్గు మంత్రిత్వశాఖ డైరెక్టర్లు జేఎస్ బింద్ర, సయీద్ అష్రాఫ్, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే రామకృష్ణారావుతోపాటు సింగరేణి ఉన్నతాధికారులు డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్‌పా) జే పవిత్రన్ కుమార్, డైరెక్టర్ (పీ అండ్ పీ) బీ భాస్కర్‌రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్ చంద్రశేఖర్, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎస్ శంకర్ పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి , చెప్పింది చేసే నేత అందుకే కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని టీబీజీకేఎస్ నేత కెంగర్ల మల్లయ్య హర్షం వ్యక్తంచేశారు.

మోడల్ దవాఖానగా గాంధీ

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యాధులపై అవగాహన, నివారణ, చికిత్స, శస్త్రచికిత్సలపై ప్రజల్లో ప్రచారం కల్పిస్తూ ఆరోగ్య తెలంగాణను సాధించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు. కిడ్నీ మార్పిడులను విజయవంతంగా పూర్తిచేసిన ఘనత గాంధీలోని కిడ్నీ విభాగానిదని కితాబిచ్చారు. భవిష్యత్‌లో గాంధీ దవాఖానను రాష్ట్రంలోనే మోడల్ దవాఖానగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గాంధీలో కిడ్నీ చికిత్స విభాగాన్ని ఏర్పాటు చేసి 25ఏండ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం దవాఖాన ఆడిటోరియంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు మంత్రి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గాంధీలో కిడ్నీ, గుండె, కాలేయం వంటి అవయవ మార్పిడుల కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు. గాంధీ దవాఖాన కిడ్నీ విభాగం రూపొందించిన వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. కిడ్నీ విభాగం ప్రారంభమైన నాటినుంచి 25 ఏండ్ల ఫొటోలతో కూడిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, గాంధీ వైద్యకళాశాల ప్రిన్సిపల్ మంజుల, కిడ్నీ విభాగం అధిపతి డాక్టర్ మంజూష, దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు లండన్ నుంచి వచ్చిన కిడ్నీ వ్యాధి నిపుణులు, గాంధీ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


నిర్మాణాల్లో నాణ్యతతో దేశాభివృద్ధి పటిష్ఠం

నిర్మాణరంగంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించాలి

న్యాక్ సెమినార్‌లో సీఎస్ జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్మాణరంగంలో ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని నాణ్యమైన నిర్మాణాలను భవిష్యత్‌తరాలకు అందించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి అన్నారు. శుక్రవారం జాతీయ నిర్మాణ అకాడమీ (న్యాక్)లో జరిగిన ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియో నిర్వహణ సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఇంజినీర్లు, వృత్తినిపుణులు నిర్మాణరంగంలో మార్పులను టెక్నాలజీ పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వినియోగించాలని జోషి పిలుపునిచ్చారు. నిర్మాణాలు నాణ్యంగా, దృఢంగా ఉంటే దేశాభివృద్ధి పటిష్ఠంగా ఉంటుందన్నారు. న్యాక్ డైరెక్టర్ భిక్షపతి మాట్లాడుతూ తమసంస్థకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, ప్రతిష్ఠాత్మక నిర్మాణరంగ సంస్థల సిబ్బంది కూడా తమ వద్ద శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ రవీందర్‌రావు, ఆ శాఖల ఇంజినీర్లు, హెచ్‌ఎండీఏ, జీహెచ్ఎంసీ, ప్రజారోగ్యం, పంచాయత్‌రాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.


రుణ రత్నాలు



బ్యాంకుల పుట్టి ముంచుతున్న వజ్రాల వ్యాపారులు

మోసపోవడంలో పీఎన్‌బీ టాప్.. ఎస్‌బీఐ కంటే నాలుగు రెట్లు ఎక్కువ నష్టం

బెంగళూరు, ఫిబ్రవరి 23: ఉద్దేశ్యపూర్వకంగా రుణాలను ఎగ్గొట్టి బ్యాంకులను నట్టేట ముంచడంలో రత్నాల వ్యాపారులు అందరి కంటే ముందున్నట్లు స్పష్టమవుతున్నది. ఇటువంటి 90 మంది ఎగవేతదారుల వల్ల గత ఏడాది మార్చి చివరి నాటికే బ్యాంకులకు దాదాపు రూ.5 వేల కోట్ల నష్టం వాటిల్లిందన్న గణాంకాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. బ్యాంకులకు ఉద్దేశ్యపూర్వకంగా రుణాలను ఎగ్గొట్టిన జెమ్స్ అండ్ డైమండ్ కంపెనీల వివరాలను క్రోడీకరించి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగ సంఘాల సమాఖ్య (ఎఫ్‌బీఐఎస్‌యూ) వెల్లడించిన ఈ గణాంకాలు అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. ఈ ఎగవేతదారుల వల్ల ఎక్కువగా నష్టపోయిన బ్యాంకుల జాబితాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అగ్రస్థానంలో ఉన్నది. ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో రెండవదిగా ఉన్న పీఎన్‌బీకి కేవలం 9 మంది ఎగవేతదారుల వల్లనే రూ.1,790 కోట్ల నష్టం వాటిల్లింది. పీఎస్‌బీల్లో అతిపెద్దదైన ఎస్‌బీఐకి ఇటువంటి 15 మంది ఎగవేతదారుల వలన కలిగిన నష్టం (రూ.410 కోట్లు)తో పోలిస్తే పీఎన్‌బీకి వాటిల్లిన నష్టం నాలుగు రెట్లు ఎక్కువ. దేశంలో ఉద్దేశ్యపూర్వక రుణ ఎగవేతదారుల మొత్తం సంఖ్య 5 వేల కంటే కొంచెం ఎక్కువగా ఉందని, వీరి వలన బ్యాంకులకు దాదాపు రూ.49 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఎఫ్‌బీఐఎస్‌యూ గణాంకాలు వెల్లడిస్తుండగా, ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారుల సంఖ్య 8,915 మందికి, వారి వలన బ్యాంకులకు జరిగిన నష్టం రూ.92,376 కోట్లకు పెరిగినట్లు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది మార్చి నెలాఖరు నాటికి 1,120 మంది ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులతో పీఎన్‌బీ అగ్రస్థానంలో నిలువగా, 997 మంది ఎగవేతదారులతో ఎస్‌బీఐ ద్వితీయ స్థానంలో నిలిచింది. రత్నాలు, ఆభరణాల వ్యాపారులు పెద్ద రుణాలతో పాటు చిన్న చిన్న రుణాలను సైతం తిరిగి చెల్లించకుండా బ్యాంకులను ముంచుతున్నారు. విన్సమ్, బ్యూటిఫుల్ డైమండ్స్, ఆరో గోల్డ్ జువెల్లరీ లాంటి సంస్థలు ఇప్పటికే ఎన్నో బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టాయి. ఇటువంటి కొన్ని కేసుల్లో బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకులు చర్యలు చేపడుతుండగా, మరికొన్ని కేసుల్లో దర్యాప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాంకులను దోచుకునేందుకు ఎన్నో మార్గాలను అనుసరిస్తున్న వ్యాపారులు ప్రధానంగా తమ కంపెనీల పేర్లను తరచుగా మార్చి ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతున్నది. గతంలో స్ప్లెండర్ జెమ్స్ పేరుతో ఏర్పాటైన సంస్థ ఆ తర్వాత బ్యూటిఫుల్ డైమండ్స్‌గా పేరు మార్చుకోవడం ద్వారానూ, ఔరో గోల్డ్ జువెల్లరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆ తర్వాత తన పేరులో 'ప్రైవేట్' అనే పదాన్ని తొలగించడం ద్వారానూ, అలాగే ఘనశ్యామ్‌దాస్ జెమ్స్ అండ్ జువెల్స్ సంస్థ ఆ తర్వాత 'ఘన్‌శ్యామ్‌దాస్'గా అవతరించడం ద్వారానూ పలు బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టినట్లు ఎఫ్‌బీఐఎస్‌యూ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



'టైమ్' అయ్యింది



- నీరవ్ ఆస్తులపై జోరుగా ఈడీ దాడులు
- ఖరీదైన విదేశీ గడియారాలు సహా రూ.44 కోట్ల డిపాజిట్లు, షేర్లు స్వాధీనం

ముంబై/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి సంబంధించిన ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడుల పరంపర కొనసాగుతున్నది. తాజాగా శుక్రవారం రూ.44 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. వీటిలో బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యంత విలువైన గడియారాలు కూడా ఉన్నాయి. మనీ లాండరింగ్ నిరోధక (పీఎంఎల్) చట్టానికి లోబడి చర్యలు తీసుకుంటున్న ఈడీ.. పలు బ్యాంకుల్లో రూ.30 కోట్ల డిపాజిట్లు, రూ.14.86 కోట్ల విలువైన షేర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. స్వాధీనం చేసుకున్న వాటిలో 176 స్టీల్ అల్మారాలు, 158 బాక్స్‌ల నిండా వస్తువులు, 60 ఇతర కంటైనర్లలో ఉన్న సామాగ్రిని సీజ్ చేసింది. గడిచిన వారం రోజుల నుంచి హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, పుణెలలో నీరవ్ మోదీకి ఉన్న ఆస్తులపై దాడుల చేసింది. గురువారం నీరవ్ మోదీకి సంబంధించిన రూ.100 కోట్ల విలువైన డిపాజిట్లు, షేర్లు, లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

నీరవ్ కాంట్రాక్టుకు ప్రియాంకా గుడ్‌బై



నీరవ్ మోదీ బ్రాండ్ అంబాసిడర్ నుంచి తప్పుకుంటున్నట్లు బాలీవుడ్ నటి ప్రియాంకా చోప్రా ప్రకటించింది. పీఎన్‌బీలో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నది. నీరవ్ మోదీకి సంబంధించి వజ్రాలను మార్కెట్లో మరింత ప్రచారం కల్పించడానికి గతంలో ప్రియాంకా, నటుడు సిద్ధార్థ మల్హోత్రా కలిసి ఒక ప్రకటనలో నటించారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో నీరవ్ మోదీ బ్రాండ్‌తో ఉన్న సంబంధాన్ని తెంచుకోవడానికి చోప్రా మొగ్గుచూపారని ఆమె తరపున ఒక ప్రతినిధి వెల్లడించారు. కంపెనీతో కుదుర్చుకున్న కాంట్రాక్టు గడువు ఇప్పటికే ముగిసిందని, సంస్థపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు లేవని సిద్ధార్థ మల్హోత్రా తెలిపారు. మరోవైపు నీరవ్ మోదీ మామ మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న బాలీవుడ్ నటి బిపాషా బసు కూడా వైదొలుగాలని చూస్తున్నది.

'పప్పూ' అనుకుంటే తప్పే!

- ప్రముఖులకు ఎర వేయడంలో చోక్సీ నేర్పరి
- పార్టీలు, బహుమతులు ఇవ్వడంలో ఘనాపాటి



మెహుల్ చోక్సీ... పది రోజుల క్రితం వరకూ ఈయన గురించి చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. కానీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత ఈయన 'ఖ్యాతి' సర్వత్రా వ్యాపించింది. ఈ కుంభకోణంలో తన అల్లుడు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతో పాటు ప్రధాన నిందితుడిగా ఉన్న మెహుల్ చోక్సీని సహచర వజ్రాల వ్యాపారులు 'పప్పూ' అని పిలుస్తుంటారు. పాలన్‌పూర్ (గుజరాత్‌లోని చిన్న పట్టణం)లో పెరిగి 'పెద్దవాడైన' మెహుల్ చోక్సీకి చిన్ననాటి నుంచి అదే ముద్దుపేరు. అంతమాత్రాన ఆయనను నిజంగానే 'పప్పూ' అనుకుంటే తప్పులో కాలు వేసినట్లే. వ్యాపారిగా ముంబైలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ 'పప్పూ' బాలీవుడ్ సినీ జనాలతో నిరంతరం ఎంతో సన్నిహిత సంబంధాలను నెరపుతూ ఇప్పుడు ఏకంగా 22 కంపెనీలకు అధిపతిగా వ్యవహరిస్తున్నాడు. ఘనమైన పార్టీలు, అత్యంత ఖరీదైన బహుమతులతో ప్రముఖులకు ఎరవేసి తనకు కావలసిన పనులను చేయించుకోవడంలో ఆయన ఘనాపాటి. ముఖ్యంగా అధికారంలో ఉండే వ్యక్తుల కుటుంబ సభ్యులను, వారితో సన్నిహితంగా మెలిగేవారిని ప్రసన్నం చేసుకుని రీటైనర్‌షిప్ ఒప్పందాలపై సంతకాలు చేయించుకోవడంలో ఆయనది అందె వేసిన చెయ్యి. పీఎన్‌బీ కేసు పరిధి పెరుగుతుండటంతో దర్యాప్తు సంస్థలు ఇప్పుడు 'పప్పూ'తో పాటు ఆయన కంపెనీల్లోని డైరెక్టర్లపై కూడా దృష్టి కేంద్రీకరించాయి. వీరిలో పది మంది డైరెక్టర్లు రూ.4,800 కోట్ల మోసానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్నారు. అయితే ఈ టాప్ ఎగ్జిక్యూటివ్‌లలో అనేక మంది సెలబ్రిటీ జువెల్లర్ల గ్లామర్ ప్రపంచానికి చాలా దూరంగా మురికివాడల్లో కూలిపోయేందుకు సిద్ధంగాఉన్న చిన్నచిన్న ఇళ్లలో సాదాసీదా జీవనం గడుపుతున్నారని, దీనిని బట్టి చూస్తుంటే వీరంతా మెహుల్ చోక్సీ వ్యాపార సామ్రాజ్యానికి కేవలం 'ముసుగు' లాంటి వారేనని స్పష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు.

ఎవ్వర్నీ వదలం

పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ప్రభుత్వ రంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారీ కుంభకోణంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎట్టకేలకు మౌనంవీడారు. ఆర్థిక అసమానతలు, అప్పనంగా ప్రజల డబ్బును దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల కుంభకోణానికి పాల్పడి విదేశాలకు పారిపోయిన నీరవ్ మోదీ లాంటివారు మోసాలకు పాల్పడకుండా ఆర్థిక సంస్థలు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి మోసాలకు చెక్‌పెట్టే అవకాశం ఉంటుందని ప్రముఖ ఇంగ్లీష్ పత్రిక ఏర్పాటు చేసిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన వెల్లడించారు. ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపడానికి కేంద్రం త్వరలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనున్నట్లు చెప్పారు. కానీ నీరవ్‌ను లేదా పీఎన్‌బీలో జరిగిన కుంభకోణాన్ని నేరుగా ఆయన ప్రస్తావించలేదు.

34 వేల పైకి సెన్సెక్స్

323 పాయింట్లు లాభపడ్డ సూచీ

ముంబై, ఫిబ్రవరి 23: గడిచిన కొన్ని రోజులుగా దిగువ ముఖం పట్టిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కోలుకున్నాయి. మార్చి నెల డెరివేటివ్ కాంట్రాక్టుపై మదుపరులు గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేయడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల వార్తలతో సూచీలు భారీగా బలబడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పెరుగడంతో బీఎస్‌ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ మళ్లీ 34 వేల మార్క్‌ను దాటింది. ప్రారంభం నుంచి లాభాల బాట పట్టిన సూచీ ఏ దశలోనూ నష్టపోలేదు. ఇంట్రాడేలో 32,167.60 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ వారాంతం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 322.65 పాయింట్లు(0.95 శాతం) పెరిగి 34,142.15 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 15 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 108.35 పాయింట్లు(1.04 శాతం) లాభపడి 10,491.05 వద్ద స్థిరపడింది. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 131.39 పాయింట్లు, నిఫ్టీ 38.75 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి. టాటా స్టీల్ 6.26 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా 5.17 శాతం లాభపడింది.



అలాగే యెస్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు ఒకశాతంకు పైగా మార్కెట్ వాటా పెరిగింది. వీటితోపాటు ఎల్ అండ్ టీ, ఐటీసీ, కొటక్ బ్యాంక్, మారుతి, విప్రో, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీల షేర్లు బలపడ్డాయి. కానీ, హెచ్‌యూఎల్, మహీంద్రా, ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, ఏషియన్ పెయింట్స్ నష్టాల్లో ముగిశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు ధర మరో ఒక శాతం పతనం చెందింది. రంగాలవారీగా చూస్తే మెటల్, హెల్త్‌కేర్, మౌలికం, విద్యుత్, బ్యాంకెక్స్, పీఎస్‌యూ లాభాల్లో ముగిశాయి.

పాతాళంలోకి గీతాంజలి షేర్లు

పీఎన్‌బీలో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణం బహిర్గతమైన నాటి నుంచి గీతాంజలి జెమ్స్ షేర్లు భారీగా పతనమయ్యాయి. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 4.98 శాతం తగ్గి రూ.24.80కి జారుకున్నది. గడిచిన ఎనిమిది వరుస ట్రేడింగ్‌లలో షేరు ధర ఏకంగా 60.5 శాతం తగ్గినట్లు అయింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.450.83 కోట్లు కరిగిపోయింది.

పెరిగిన విదేశీ మారకం నిల్వలు

విదేశీ మారకం నిల్వలు మరింత పెరిగాయి. జనవరి 16తో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు మరో 1.960 బిలియన్ డాలర్లు పెరిగి 421.720 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతక్రితంవారంలో 2.154 బిలియన్ డాలర్లు పెరిగి 419.760 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే.

రూ.200 కోట్లతో 500 రిటైల్ అవుట్‌లెట్లు

- మొబైల్ స్టోర్లను ఏర్పాటు చేయనున్న సెలెక్ట్
- 15న హైదరాబాద్‌లో తొలి షోరూం ప్రారంభం



హైదరాబాద్, ఫిబ్రవరి 23: మొబైల్ రిటైల్ రంగంలో నూతన ఒరవడిని సృష్టించడానికి మరో సంస్థ సిద్ధమైంది. హైదరాబాద్ కేంద్రస్థానంగా విధులు నిర్వహిస్తున్న 'సెలెక్ట్' తాజాగా మొబైల్ రిటైల్ రంగంలోకి ప్రవేశించింది. మార్చి 15న హైదరాబాద్‌తోపాటు తిరుపతిలో ఒకేరోజు తన తొలి షోరూంను ప్రారంభించనున్నట్లు కంపెనీ సీఎండీ వై గురు తెలిపారు. అన్ని రకాల బ్రాండ్లు లభ్యమయ్యే ఈ అవుట్‌లెట్లను వినూత్నంగా డిజైన్ చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా 23 స్టోర్లను ప్రారంభించనున్న సంస్థ..2019 చివరి నాటికి దేశవ్యాప్తంగా సొంతంగా 500 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకోసం సంస్థ రూ.200 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. వీటిని అంతర్గత వనరులు, బ్యాంకుల వద్ద రుణం తీసుకోనున్నారు. మొదటి విడుతలో 500 స్టోర్లను ఏర్పాటు చేయనున్న సంస్థ.. రెండో విడుతలో 300, మూడో విడుతలో మరో 200 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో వచ్చే నాలుగేండ్లకాలంలో స్టోర్ల సంఖ్య వెయ్యికి చేరుకోనున్నది. తద్వారా 3 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఎంపిక చేసిన ఈ రిటైల్ అవుట్‌లెట్లలోనే సర్వీసింగ్ సెంటర్లను సైతం అందుబాటులోకి తీసుకురానున్నది.

సెలబ్రిటీలకు నకిలీ వజ్రాలు!

- నీరవ్ కేసులో మరో కోణం
- బ్యాంకు స్కామ్ కంటే వజ్రాల కుంభకోణమే ఎక్కువ?
- దర్యాప్తు సంస్థల వేట ముమ్మరం



ప్రత్యేకప్రతినిధి, నమస్తేతెలంగాణ: వేల కోట్ల బ్యాంకు రుణాలను ఎగవేసి పరారీలో ఉన్న ప్రముఖ వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీలోని వజ్రాలలో అసలు కంటే నకిలీవే ఎక్కువ ఉన్నాయా....? వజ్రాల విలువ బహిరంగ మార్కెట్‌లో చాలా తక్కువగా ఉందా...? అనే విషయం ఇప్పుడు సంచలనంగా మారింది. నీరవ్ మోదీ దేశంలోని ప్రముఖులకు విక్రయించిన లేదా బహుమతిగా ఇచ్చిన వజ్రాలలో కొన్ని నకిలీవని తేలుతుండటం కలకలం రేపుతున్నది. నీరవ్ మోదీ భారత్‌లో వదిలి వెళ్లిన వజ్రాలలో అసలైనవి ఎన్ని ...? నకిలీవి ఎన్ని..? వాటి విలువ ఎంత? అనే దానిపై ఆదాయం పన్ను శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)లు దృష్టి సారించాయి. హైదరాబాద్‌తో పాటు సూరత్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)ల నుంచి గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీ దాదాపు రూ.1,200 కోట్ల కంటే ఎక్కువ విలువ చేసే వజ్రాలను అడ్డదారిలో విక్రయించినట్లు ప్రాథమిక ధర్యాప్తులో తేలింది. అందులో కొన్ని నకిలీవని ఫిర్యాదు లందుతున్నాయి. ముంబైలో ఒక సినిమాస్టార్ నీరవ్ మోదీ తనకు ఇచ్చిన వజ్రం నకిలీదని తెలుసుకుని లబోదిబోమంటూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కంపెనీ తరపున ఒక కార్యక్రమంలో ప్రచారం చేయాలని నీరవ్ మోదీ కోరగా తనకు రూ. 60 లక్షలు కావాలని సినిమా స్టార్ డిమాండ్ చేశారు. నగదుకు బదులుగా అందుకు సమాన విలువ కలిగిన వజ్రాన్ని ఇస్తానని నీరవ్ మోదీ అతనితో ఒప్పందం కుదుర్చుకున్నారు. బ్యాంకు కుంభకోణం వెలుగు చూసిన క్రమంలో సదరు సినిమా స్టార్ అనుమానంతో వజ్రాల నిపుణుల వద్ద పరీక్షలు జరుపగా అసలు గుట్టు రట్టయింది. అసలు ఆభరణంలో వజ్రం కేవలం పది శాతం మాత్రమే ఉందని, దాని విలువ 60 లక్షలు కాదు కదా ఆరు లక్షలు కూడా ఉండదని నిపుణులు తేల్చారు. ఇలా దేశ వ్యాప్తంగా ప్రముఖులను, సెలిబ్రిటీలను వజ్రాల పేరిట నీరవ్ బురిడీ కొట్టించినట్లు తెలుస్తున్నది. నీరవ్ బ్యాంకులకు ఎగవేసిన రుణాల కంటే వజ్రాల ముసుగులో చేసిన మోసం ఎక్కువగా ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'రొటోమాక్' నిందితులను కోర్టులో హాజరుపర్చిన సీబీఐ

- ట్రాన్సిట్ రిమాండ్‌పై లక్నో తీసుకెళ్లేందుకు అనుమతి



రొటోమాక్ అధినేత విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌ను ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ప్రభుత్వ రంగంలోని ఏడు బ్యాంకుల కన్సార్టియంకు ఉద్దేశ్యపూర్వకంగా రూ.3,695 కోట్ల అప్పులను ఎగ్గొట్టిన కేసులో రొటోమాక్ సంస్థ అధినేత విక్రమ్ కొఠారీతో పాటు ఆయన కుమారుడు రాహుల్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శుక్రవారం ఢిల్లీలోని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చింది. వీరిద్దరినీ లక్నో కోర్టులో హాజరుపరిచేందుకు వీలుగా రెండు రోజులు ట్రాన్సిట్ రిమాండ్‌ను మంజూరు చేయాలని సీబీఐ విజ్ఞప్తి చేయగా.. ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమర్ విశాల్ ఒక రోజు రిమాండ్‌ను మంజూరు చేశారు. ఏడు ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.2,919 కోట్ల రుణాలు, వడ్డీ కలిపి మొత్తం రూ.3,695 కోట్ల అప్పులను ఎగ్గొట్టినట్లు రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై పంజాబ్ బ్యాంక్ ఆఫ్ బరోడా ఫిర్యాదు చేయడంతో విక్రమ్ కొఠారీ, ఆయన భార్య సాధన, కుమారుడు రాహుల్‌పై కేసు నమోదు చేసిన సీబీఐ గురువారం రాత్రి తండ్రీ, కొడుకులను అరెస్టు చేసిన విషయం విదితమే.

బ్యాంకింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయండి: ఏఐబీఏసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకుల రుణ కుంభకోణాలపై పరస్పరం నిందలు వేసుకునే బ్లేమ్ గేమ్ ఆడే కంటే రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక మంత్రిత్వశాఖ బాధ్యత తీసుకోవాలని ఆల్ ఇండియా బ్యాంక్ అసోసియేషన్ కాన్ఫడరేషన్ ప్రధాన కార్యదర్శి డీటీ ఫ్రాన్కో డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలను తొలిగించి ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు. బ్యాంకుల రుణాలను చెల్లించకుండా జాప్యం చేసే డిఫాల్టర్ల జాబితాను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రుణాలను ఎగవేసే డిఫాల్టర్‌లు దేశం విడిచి వెళ్లకుండా బ్యాంకులు.. హోంమంత్రిత్వశాఖకు లేఖ రాసి వారికి ఎమ్మిగ్రేషన్ క్లియరెన్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్కామ్‌లలో ఉన్నత స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి వారిని బలిపశువు చేయడమేమిటని, అలాగే ఒకేసారి 18 వేల మందిని బదిలీ చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు.

ఏసీబీ కస్టడీలోకి పురుషోత్తంరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ మాజీ అధికారి పురుషోత్తంరెడ్డిని ఏసీబీ అధికారులు శుక్రవారం కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు గురువారం పురుషోత్తంరెడ్డిని ఆరురోజుల కస్టడీకి తీసుకునేందుకు అనుమతించిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలునుంచి అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదైననాటినుంచి ఎక్కడున్నావు.. ఆస్తుల వివరాలు, వ్యాపారంలో భాగస్వాములు, బినామీలు ఎవరెవరు అనే కోణంలో శుక్రవారం విచారించినట్టు తెలిసింది. పురుషోత్తంరెడ్డి ఊ.. ఆ.. అనే సమాధానాలు మాత్రమే చెప్పినట్టు తెలిసింది. కేసు నమోదైన విషయం తెలిసిన వెంటనే కేరళకు పారిపోయి దాచుకున్నట్టు వెల్లడించినట్టు సమాచారం. పురుషోత్తంరెడ్డిని ఏసీబీ కార్యాలయంలో విచారిస్తున్నామని, రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచనున్నట్టు అధికారులు తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో బినామీగా అరెస్టయిన శ్రీనివాస్‌రెడ్డిని విచారణ నిమిత్తం ఐదురోజుల కస్టడీ కోరుతూ ఏసీబీ శుక్రవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని స్వీకరించిన ఏసీబీ కోర్టు నిందితుడి తరపు న్యాయవాదులకు నోటీసులు జారీచేసింది.

రైతు జీవితానికి బంగారు బాటలు

- రైతులకు పెట్టుబడి పథకాన్ని సమన్వయ సమితులు చేరువ చేయాలి
- మంత్రులు పోచారం, చందూలాల్



రవీంద్రభారతిలో సాంస్కృతిక సారథి కళాకారుల అవగాహన సదస్సులో మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, చందూలాల్, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతు జీవితానికి బంగారుబాటలు వేయనున్న పెట్టుబడి పథకాన్ని, రైతు సమన్వయ సమితి లక్ష్యాలను మహత్తర స్ఫూర్తితో రైతులకు చేరువచేయాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులకు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. రాష్ట్రంలోని 72 లక్షల రైతు కుటుంబాలకు బాసటగా నిలువనున్న రైతు పెట్టుబడి పథకాన్ని దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తున్నదని పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో రైతు సమన్వయ సమితులు, వ్యవసాయ పెట్టుబడి, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ అంశాలపైన రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆట, పాట, మాటలకు గొప్ప శక్తి ఉంటుందని.. కళలు, కళారూపాల ద్వారానే గొప్ప ఆలోచనలను ప్రజలకు చేరువ చేయగలుగుతామని మంత్రులు తెలిపారు. సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి రాష్ట్ర సాధన ఉద్యమ ఘట్టాలనుంచి రైతు సమన్వయ సమితిల వరకు ఒక్కొక్క విషయాన్ని వివరిస్తూ వాటి లక్ష్యాలను పాటలతో వివరించారు. కార్యక్రమంలో రచయిత యశ్‌పాల్, వ్యవసాయశాఖ డైరెక్టర్ జగన్మోహన్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, 'ధరణి' వెబ్‌సైట్ అధికారి కిషన్‌రావు పాల్గొన్నారు.

సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పోచారం

25న రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో జరిగే రైతు సమన్వయ సమితుల సదస్సు ఏర్పాట్లను వ్యవసాయశాఖ మంత్రి పోచారం పరిశీలించారు. ఆయనవెంట ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్మోహన్, వీసీ ప్రవీణ్‌రావు ఉన్నారు.

ఆదిలాబాద్ డీఈఈ ఆస్తులు ఆరుకోట్లు

కొండల్‌రావును ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన అధికారులు



కొండల్‌రావు ఇంటి నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన ఆదిలాబాద్ మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ కొండల్‌రావును శుక్రవారం ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. కొండల్‌రావు వద్ద ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు సమాచారం రావడంతో ఏసీబీ అధికారులు గురువారం అతడి ఇంటితో పాటు పలుచోట్ల సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో రూ.6 కోట్ల ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. సోదాలు పూర్తయ్యాక శుక్రవారం ఏసీబీ అధికారులు ఆస్తుల వివరాలను వెల్లడించారు.



కరీంనగర్‌లో నిర్వహించిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

ఏడువేల మంది విద్యార్థులతో వెంకన్న కల్యాణోత్సవం

కరీంనగర్ కల్చరల్: లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కోసం కరీంనగర్‌కు చెందిన 7001మంది విద్యార్థులు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. 'ట్రస్మా' ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్న వయస్సులోనే పిల్లల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమ వివరాలను లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కోసం పంపుతామన్నారు.

జూలై నాటికి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

- ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం
- నాగర్‌కర్నూల్‌లో ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టుపై మంత్రి హరీశ్ సమీక్ష



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎంజీకేఎల్ఐ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల్లోని పెండింగ్ పనులన్నీ జూలై నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి కలెక్టర్ శ్రీధర్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ పాలమూరు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. మార్చి నెలలోనూ పాలెం చెరువు మత్తడి పారుతుండటం, బీడుపడ్డ పొలాలన్నీ పచ్చగా ఉండటం గతంలో ఎన్నడూ జరుగలేదన్నారు. ఎంజీకేఎల్ఐ పనులపై కలెక్టర్ తరుచూ సమీక్షించాలన్నారు. ప్రాజెక్టు పనుల్లో పెండింగ్‌లో ఉన్న 250 ఎకరాల భూములకు సంబంధించి రూ.12.86 కోట్లు శనివారం సాయంత్రంలోగా విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఏవో సాకులు చూపుతూ ప్రాజెక్టు పనులను జాప్యం చేయరాదన్నారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి నివాసంలో రాత్రి బస

మంత్రి హరీశ్‌రావు శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో బస చేశారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం మినీ ట్యాంక్‌బండ్ పనులను సందర్శించనున్నారు.

షాదీముబారక్ అర్హుల ఎంపికను
మైనారిటీ కార్పొరేషన్‌కు అప్పగించండి
సీఎంకు విన్నవించిన టీఎస్ఎంఎఫ్‌సీ చైర్మన్ అక్బర్‌హుస్సేన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: షాదీముబారక్ పథకం అర్హుల ఎంపిక, చెక్కుల పంపిణీని రెవెన్యూశాఖ నుంచి తప్పించి తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎఫ్‌సీ)కు అప్పగించాలనే డిమాండ్ మైనారిటీవర్గాల్లో బలపడుతున్నది. ప్రస్తుతం ఈ పథకానికి నిధులు టీఎస్ఎంఎఫ్‌సీ అందజేస్తుండగా, అర్హుల ఎంపిక మాత్రం రెవెన్యూశాఖ చేపడుతున్నది. దీంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, రెవెన్యూ అధికార సిబ్బంది పనిభారం కారణంగా సకాలంలో మైనార్టీలు లబ్ధిపొందలేకపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని చైర్మన్ అక్బర్ హుస్సేన్ ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలిసినప్పుడు షాదీముబారక్ అర్హుల ఎంపిక, చెక్కుల పంపిణీని టీఎస్ఎంఎఫ్‌సీకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమ్‌సాగర్‌రావుకు ముందస్తు బెయిల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లంబాడాలు, ఆదివాసీలకు మధ్య తలెత్తిన వివాదంలో ఆదివాసీలకు ఆర్థికసాయం చేశారనే ఆరోపణలతో నమోదైన కేసుల్లో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకు ఉమ్మడి హైకోర్టు కొన్ని షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఉదయం 10 గంటల నుంచి 5గంటలలోపు సంబంధిత ఠాణాలో హాజరుకావాలని, పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. గతంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది.

కేయూలో తోపులాట
ఇద్దరు విద్యార్థి సంఘాల నాయకులకు గాయాలు



చికిత్సపొందుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నయీంనగర్(వరంగల్): కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం తోపులాట జరుగగా, ఇద్దరు విద్యార్థి సంఘాల నాయకులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. పీహెచ్‌డీ అక్రమ అడ్మిషన్లను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నాయి. తాజాగా తీసుకున్న నిరవధిక సమ్మె నిర్ణయంలో భాగంగా శుక్రవారం యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి తరగతులు బహిష్కరించాలని విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ క్రమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాలకు మధ్య తోపులాట జరుగగా, టీఆర్ఎస్వీ వరంగల్ రూరల్ జిల్లా కోఆర్డినేటర్ లంక రాజ్‌గోపాల్, పీడీఎస్‌యూ నాయకుడు రాజుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి విద్యార్థులను దవాఖానలో పరామర్శించారు. అనంతరం యూనివర్సిటీకి చేరుకొని వీసీ, రిజిస్ట్రార్లతో చర్చించారు. ఉద్యమంలో పాల్గొన్న అర్హులైన విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో మాట్లాడుతామని విద్యార్థి సంఘాలకు హామీ ఇచ్చారు. గొడవకు కారణమైన ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆ స్థానం నుంచి తొలగిస్తున్నట్లు రిజిస్ట్రార్ పురుషోత్తం ప్రకటించారు.

తాగుబోతు తండ్రిపై బాలుడి ఫిర్యాదు



జమ్మికుంట: కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రే కర్కశుడిగా మారాడు. మద్యం మత్తులో నిత్యం 11ఏండ్ల కొడుకును కొడుతూ.. చిత్ర హింసలకు గురి చేస్తున్నాడు. ఓపిక నశించిన బాలుడు, శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ ప్రశాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. జమ్మికుంట పరిధిలో ని మోత్కులగూడెంలో మోలుగూరి శ్రీనివాస్-రమ్యకు ఇద్దరు పిల్లలు. దంపతులు కూలీ చేసుకొని జీవిస్తున్నారు. కొడుకు శశికుమార్(11) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. కాగా, శ్రీనివాస్ నిత్యం ఏదో ఒక కారణంతో భార్య, కొడుకును కొడుతున్నాడు. ఇంట్లో నగదు పోయిందని బా లుడిని రెండు రోజులుగా కొడుతున్నాడు. గురువారం సాయంత్రం బాలుడిని ఇంట్లోకి తీసుకెళ్లి దుడ్డు కర్రకు కారం పూసి విచక్షణరహితంగా చితకబాదగా, భరించలేక బాలుడు గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. భార్యనూ శ్రీనివాస్ వెళ్లగొట్టాడు. దీంతో బాలుడు జమ్మికుంట సీఐని ఆశ్రయించాడు. మొత్తం విన్న సీఐ చలించిపోయి, శ్రీనివాస్‌పై కేసు నమోదు, అరెస్ట్ చేశారు.

సిరిసిల్ల ఠాణాలో ఖాకీల కొట్లాట

వీర్నపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిల ఠాణాలో ఎస్సై నరేశ్‌కుమార్, కానిస్టేబుల్ మోహన్ శుక్రవారం రాత్రి ఒకరికొకరు గల్లాలు పట్టుకోవడం కలకలం రేపింది. స్థానికులు, పోలీసువర్గాల సమాచారం ప్రకారం.. కానిస్టేబుల్ మోహన్ పలుమార్లు ఎస్సైతో కొన్ని విషయాల్లో విభేదించడంతోపాటు కావాలనే అవసరానికి మించి డ్యూటీలిచ్చి ఇబ్బంది పెడుతున్నాడనే భావనతో ఎస్ఐతో గొడవకు దిగినట్లు సమాచారం. ఇదే విషయమై శుక్రవారం మాటామాట పెరిగి వ్యక్తిగత దూషణతోపాటు పరస్పర దాడులకు పాల్పడినట్లు తెలిసింది. ఎస్పీ డీఎస్పీ, సీఐ ఠాణాకు చేరుకొని వివరాలు సేకరించారు.

తాగి కారు నడిపిన సీఐపై చర్యలు



సీఐ ధరావత్ కృష్ణ

నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తాగి డ్రైవింగ్ చేసిన నిజామాబాద్ డివిజన్ ధర్పల్లి సీఐ ధరావత్ కృష్ణను ఏఆర్ అటాచ్ చేస్తూ శుక్రవారం రేంజ్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి సీఐ ధరావత్ కృష్ణ గురువారం రాత్రి తాగి, కామారెడ్డి జిల్లా సదాశివనగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై కారు(టీఎస్ 08 ఈకే 6804) నడుపుకుంటూ వచ్చాడు. అప్పటికే మల్లుపేట వద్ద ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టి పారిపోగా, స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. గాంధారి క్రాస్‌రోడ్డు వద్ద ఆపి ఉంచగా, అదే వాహనమని పోలీసులు గుర్తించారు. అప్పటికే చిత్తుగా తాగి ఉన్న ఆయన, పోలీసులపై వీరంగం సృష్టించాడు. స్థానిక ఎస్సై విషయాన్ని కామారెడ్డి ఎస్పీ శ్వేతారెడ్డికి తెలిపారు. ఆమె నిజామాబాద్ సీపీ కార్తికేయశర్మకు వివరించారు. దీంతో సీపీ డిచ్‌పల్లి సీఐ రామాంజనేయులును సంఘటనా స్థలానికి చేరి, పరిస్థితిని సీపీకి వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ధరావత్ కృష్ణపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు నిజామాబాద్ రేంజ్ డీఐజీ శివశంకర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'కి తెలిపారు.

'కాళేశ్వరం'తో ముందడుగు

- బంగారు తెలంగాణ దిశగా పయనం
- శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్
- ముఖ్యమంత్రి కేసీఆర్ సాహసోపేత నిర్ణయం: డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ
- మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ సందర్శించిన ఎమ్మెల్సీల బృందం



భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. చిత్రంలో ఎమ్మెల్సీలు

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు బంగారు తెలంగాణకు ముందడుగు అని శాసన మండలి చైర్మన్ కే స్వామిగౌడ్ అన్నారు. ఈ ప్రాజెక్టు మహా అద్భుతమని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు శాసనమండలి సభ్యుల బృందం రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి రెండు బస్సుల్లో బయలుదేరివచ్చింది. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ నేతృత్వంలో ఈ బృందం తొలుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ బృందానికి శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మండలి చీఫ్‌విప్ సుధాకర్‌రెడ్డి, విప్ బీ వెంకటేశ్వర్లు, సభ్యులు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, పురాణం సతీశ్‌కుమార్, భానుప్రసాద్‌రావు, నారదాసు లక్ష్మణ్‌రావు, భూపతిరెడ్డి, వీ భూపాల్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, రాంచందర్‌రావు, జాఫ్రీ, కశిరెడ్డి నారాయణరెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, గంగాధర్‌గౌడ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఫరీదుద్దీన్, కొంపల్లి యాదవరెడ్డి, రాములునాయక్, ఎం శ్రీనివాస్‌రెడ్డి సహా 23 మంది సభ్యులు ఈ బృందంలో ఉన్నారు. వీరు సాయంత్రం భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డను సందర్శించారు. మేడిగడ్డ బరాజ్‌తోపాటు ఎమ్మెల్సీల బృందం కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించారు. రెండు రోజుల పర్యటనలో తొలిరోజు ఎమ్మెల్సీలు మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయి లో పరిశీలించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి సాగునీటి శాఖ ఇంజినీర్లు ఈ బరాజ్, పంపుహౌస్‌ల వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు ఎమ్మెల్సీలకు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు గురించి వివరించారు. మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ వద్ద మండలి చైర్మన్ స్వామిగౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. రివర్స్ పంపింగ్ విధానం ద్వారా గోదావరి నదిలోని నీటిని తెలంగాణ ప్రభుత్వం వాపస్ తీసుకు రావడానికి నిర్మిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును విదేశీయులు సైతం సందర్శించి ప్రశంసల జల్లు కురిపిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్ పనులు జరుగుతున్న తీరు చూసి ఆశ్చర్యపోయామని, ప్రపంచ స్థాయిలో శరవేగంగా ప్రాజెక్టు పనులు జరుగుతుండటం మహా అద్భుతమన్నారు. రివర్స్ పంపింగ్ విధానం ద్వారా ఒక నదీ జలాలను సాగు, తాగునీటి కోసం తరలిస్తుంది చైనా తర్వాత మన దేశంలో తెలంగాణలోనే మొదటిదన్నారు.

సాహసోపేత నిర్ణయం: డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో సీఎం ఇలాంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని తెలిపారు. మొదటి రోజు పర్యటన పూర్తికాగా రాత్రి కాళేశ్వరం సమీపంలోని హరిత గెస్ట్‌హౌస్‌లో బస చేశారు.

టీఆర్ఎస్‌లో పలువురి చేరిక



యాదగిరిగుట్టలో టీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి. చిత్రంలో విప్ గొంగిడి సునీత, టీఆర్ఎస్ నేత మహేందర్‌రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గొల్లగూడెంలో టీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే జలగం వెంకటరావు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. శుక్రవారం యాదగిరిగుట్టలో వివిధ యూనియన్లకు చెందిన సుమారు 300 మంది ఆటో కార్మికులు టీడీపీ సీనియర్ నాయకుడు ర్యాకల రాజు ఆధ్వర్యంలో, గుట్ట మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాత్రి దానయ్య ఆధ్వర్యంలో సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఏరాజ్‌పల్లికి చెందిన ఆయా పార్టీల నాయకులు, పద్మశాలీ సంఘ నాయకులు, వీడీసీ చైర్మన్‌తోపాటు 30 మంది సభ్యులు బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాలకు చెందిన 100 కుటుంబాలు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చెలక పంచాయతీ గొల్లగూడెం గ్రామానికి చెందిన 50 కుటుంబాల్లోని సుమారు వంద మంది ఎమ్మెల్యే జలగం వెంకటరావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

వయోజనవిద్యలో రూ.కోటి గోల్‌మాల్!
వీసీవో, ఎంసీవోల జీతాల చెల్లింపులో అవినీతి

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని వయోజనవిద్య (సాక్షర భారత్) కార్యాలయంలో రూ.కోటి గోల్‌మాల్ జరిగింది. సాక్షార భారత్‌లో ప్రతినెలా విలేజ్ కోఆర్డినేటర్ (వీసీవో), మండల కోఆర్డినేటర్ (ఎంసీవో)ల జీతాల చెల్లింపులో దాదాపు రూ.కోటి 13 లక్షల 74 వేలు స్వాహా అయినట్టు సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసి సస్పెండైన డీడీ ఉషామార్త స్వర్ణలత ఇందుకు సూత్రధారి అని తేలింది. ప్రస్తుతం డీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు ఉషామార్త స్వర్ణలతతోపాటు ఇద్దరు మహిళా సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఏప్రిల్ 2014 నుంచి సెప్టెంబర్ 2016 వరకు వీసీవోలు, ఎంసీవోలకు చెల్లించాల్సిన వేతన డబ్బులను వేరే ఖాతాలకు మళ్లించి నిధులు స్వాహా చేసినట్టు ఆడిటింగ్‌లో బయటపడింది. కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేసిన ఉమ, జిల్లా కోఆర్డినేటర్ కల్పన ఆమెకు సహకరించినట్టు సమాచారం.

బావిలో పడ్డ అడవిదున్న
రక్షించిన అధికారులు.. ఆపై జూపార్కుకు తరలింపు



బావిలోంచి అడవి దున్నను బయటకు తీస్తున్న దృశ్యం


వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం పెంచికలపేటలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తూ అడవి దున్న బావిలో పడింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు, హైదరాబాద్ అధికారులు, జూపార్క్ వైద్యులు,సిబ్బందితో అక్కడికి చేరుకుని బావిలో నుంచి అడవి దున్నను శుక్రవారం బయటకు తీశారు. సుమారు 25 ఫీట్ల లోతైన బావిలో పడటంతో గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం దానిని హైదరాబాద్ జూపార్క్‌కు తరలించారు.

పశువుల ఎముకలతో నూనె తయారీ

నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని ఓ ఇంట్లో పశువుల ఎముకలతో నూనె తయారీ వ్యవహారాన్ని స్థానిక పోలీసులు గుట్టురట్టు చేశారు. పక్కాసమాచారం మేరకు పోలీసులు పట్టణంలోని కరస్‌గుత్తి రోడ్డు ప్రాంతంలో గల ఓ ఇంటిపై దాడి చేయగా పశువుల ఎముకలతో నూనెను తయారు చేస్తుండగా పట్టుకున్నారు. ఇంటి యజమానిని పోలీసులు విచారించి మహాకాళీనగర్‌లోని ఓ ఇంట్లో భద్రపర్చిన 15 లీటర్ల సామర్థ్యం గల 54 నూనె డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో మండలంలోని జగన్నాథ్‌పూర్ శివారులో డంప్ చేసిన పశువుల ఎముకల నిల్వలను స్థానిక సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై నరేందర్ పరిశీలించారు.

దేశానికే దిక్సూచి తెలంగాణ

- మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి
- రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సు ఏర్పాట్ల పరిశీలన



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ప్రాంతీయ సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రైతులకు పెట్టుబడి సహాయం పథకం అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచీగా మారిందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలనే ఆలోచనలు వస్తున్నాయన్నారు. ఈ నెల 26న సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రైతు సమన్వయ సమితి 16 జిల్లాల ప్రాంతీయ సదస్సు ఏర్పాట్లను మంత్రి పోచారం శుక్రవారం పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో 14 జిల్లాలు, 26న మరో 16 జిల్లాలకు కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం మండల, జిల్లా సమితులకు శిక్షణ ఇస్తామని, త్వరలోనే హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో 1.70 లక్షల మంది గ్రామ రైతు సమన్వయ సమితుల సభ్యులతో పెద్ద ఎత్తున సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు. గ్రామాలు వదిలి వెళ్తున్న యువతకు వ్యవసాయ రంగంలో ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులకు వచ్చే మే నెలలో మొదటి విడుతగా రూ.6 వేల కోట్లు పెట్టుబడి సహాయం కింద అందిస్తున్నామని మంత్రి చెప్పారు.

వారం రోజుల్లో 'నందిమేడారం' పూర్తి

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో తొలి రిజర్వాయర్ ఇదే

వచ్చే నెల నుంచి చెరువులు నింపేందుకు సిద్ధమైన యంత్రాంగం

1.65 లక్షలకు సాగునీరు అందే అవకాశం

కరీంనగర్ ప్రధానప్రతినిధి/ధర్మారం, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన నంది మేడారం రిజర్వాయర్ పనులు తుది దశకు చేరుకున్నాయి. వారం రోజుల్లో ఈ పనులన్నీ పూర్తికానున్నాయి. వచ్చే నెల నుంచి గోదావరి జలాలతో చెరువులు నింపేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సీఎం కేసీఆర్, భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నిత్య పరిశీలన, పర్యవేక్షణలో ఈ రిజర్వాయర్ పనులు సాగుతుండగా.. అతి తక్కువ సమయంలో మెజార్టీ పనులు పూర్తిచేసి ఇప్పటికే రికార్డు సృష్టించింది. ఎల్లంపల్లి నుంచి మేడారం రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసి.. అక్కడి నుంచి ఎల్లంపల్లి ఎత్తిపోతల పైపుల ద్వారా చెరువుల్లోకి పంపించి 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది.

అత్యంత కీలకం..

ప్రాజెక్టులో రీడిజైనింగ్‌లో భాగంగా సీఎం కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో నందిమేడారం రిజర్వాయర్ కీలకమైంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామ పరిధిలో ఈ జలాశయాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ 0.16 టీఎంసీల సామర్థ్యంతో చెరువు ఉండేది. కాళేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు రెండు టీఎంసీలు ఎత్తిపోసే ప్రణాళికలో భాగంగా ఈ చెరువును రిజర్వాయర్‌గా మార్చడమే కాకుండా సామర్థ్యాన్ని 0.74 టీఎంసీలకు పెంచారు. గతంలో 226.83 మీటర్ల ఎత్తు ఉన్న కట్టను ప్రస్తుతం 233 మీటర్లకు పెంచారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏకకాలంలో గోదావరిపై మూడు బ్యారేజీలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కడుతున్న విషయం తెలిసిందే. రీడిజైనింగ్‌లో భాగంగా మేడిగడ్డ నుంచి అన్నారం.. అక్కడి నుంచి సుందిళ్ల.. అక్కడి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని ఎత్తిపోస్తారు. ఈ నాలుగు ప్రాజెక్టులు గోదావరిపైనే ఉన్నాయి. ఇక ఎల్లంపల్లి నుంచి మొదటగా నీటిని నందిమేడారం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తారు. ఈ రిజర్వాయర్ నుంచే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద ఉండే అన్ని అనుసంధాన ప్రాజెక్టులకు నీరు సరఫరా అవుతుంది. అందుకే నంది మేడారం రిజర్వాయర్ అత్యంత కీలకం.

ఈ నెలాఖరుకు పనులు పూర్తి..

ఈ రిజర్వాయర్ పనులను అతి తక్కువ సమయంలో పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే రిజర్వాయర్‌కు తూము, మత్తడి, కాల్వ నిర్మాణం పూర్తయింది. రెండున్నర కిలోమీటర్ల పొడువు కట్ట పనులు చివరి దశలో ఉన్నాయి. ఇవి వారంరోజుల్లో పూర్తికానున్నాయి.



నిర్మాణం పూర్తయిన నందిమేడారం కట్ట

మూడు జిల్లాల్లోని చెరువులకు నీరు..

ఎల్లంపల్లి నుంచి నందిమేడారం రిజర్వాయర్‌కు నీటిని లిఫ్టింగ్ చేసి అక్కడి నుంచి రాజన్న-సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లోని 15 ప్రధాన చెరువులు, వాటి అనుబంధ చెరువులకు నీటిని ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విధానం వల్ల 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు తాగునీరు అందనుంది. ప్రధానంగా ఎల్లంపల్లిలోని గోదావరి జలాలను వినియోగించుకోవడానికి ఆస్కారం ఉంది. వచ్చే నెల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని నింపడంతో పాటు ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కింద వేసిన పైపులైన్ల ద్వారా నిర్ధారిత చెరువులను నింపి సాగుకు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెపుతున్నారు.

సిరీస్ అటా.. ఇటా.!

- భారత్, దక్షిణాఫ్రికా మూడో టీ20 నేడు
- ఒత్తిడిలో విరాట్‌సేన
- ఆత్మవిశ్వాసంతో సఫారీలు

రాత్రి 9.30 నుంచి సోనీ టెన్-1, 3లో

ఒకసారి చేజారిన లక్ష్యానికి.. కాలం ఇస్తున్న గొప్ప అవకాశం ఇది. ఎన్నో ఏండ్ల కలల అద్భుతానికి.. సత్తా చాటాల్సిన సమయం ఇది. సఫారీ గడ్డపై ఒకేసారి రెండు సిరీస్‌లు గెలువాలన్న తపన భారత్‌ది. ఈ సిరీస్‌లోనైనా నెగ్గి పరువు కాపాడుకోవాలన్న ఆకాంక్ష సఫారీలది. గెలుపు ఖాయమనుకున్న వేళ.. ఓటమి దెబ్బను చూశారు. పోరాటమే ఉండదనుకున్న వేళ.. పోటీ తీవ్రతను చూపెట్టారు. అవకాశాలు సమానం.. ఆటగాళ్లూ సమానం.. వాళ్లకేమో అనుకూలతలు.. మనవేమో ఘనతలు. ఇక తేల్చుకోవాల్సింది పైచేయి ఎవరిదో..? ఓ రకంగా ఇద్దరికీ చావో.. రేవో పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ బ్యాటింగ్ బలానికి.. సఫారీల బౌలింగ్ బలగానికి రసవత్తరంగా సాగనున్న సిరీస్ నిర్ణయాక మూడో టీ20కి రంగం సిద్ధమైంది.





డుమిని

జట్లు అంచనా

భారత్: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధవన్, రైనా, మనీష్, ధోనీ, పాండ్యా, భువనేశ్వర్, ఉనాద్కట్, చాహల్, శార్దూల్ / బుమ్రా / అక్షర్ పటేల్ / కుల్దీప్
దక్షిణాఫ్రికా: డుమిని (కెప్టెన్), హెండ్రిక్స్, స్మట్స్, క్లాసెన్, మిల్లర్, బెహర్డీన్, పెహెల్‌కావో, మోరిస్, డాల, పీటర్సన్ / షమ్సీ / ఫాంగిసో.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలం. పరుగుల వరద పారొచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. స్పిన్నర్లకు కాస్త ఇబ్బందే.

కేప్‌టౌన్: నెలన్నర రోజుల దక్షిణాఫ్రికా పర్యటనకు విజయంతో వీడ్కోలు పలుకాలని భారత్ జట్టు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఒకే మ్యాచ్‌తో అటు సిరీస్‌ను ఇటు చరిత్రను సరికొత్తగా చూపెట్టాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో శనివారం జరిగే సిరీస్ నిర్ణయాక మూడో టీ20లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. రెండో టీ20లో ఎదురైనా ఓటమి నుంచి పుంజుకోవాలని టీమ్‌ఇండియా భావిస్తుండగా, అదే తీవ్రతను చూపెట్టేందుకు సఫారీలు సిద్ధమవుతున్నారు. మొత్తానికి సిరీస్‌ను కాపాడుకోవాలని ఆతిథ్య జట్టు.. వరుసగా రెండు సిరీస్‌లు గెలిచామన్న ఆనందంతో తిరిగి వెళ్లాలన్న లక్ష్యంతో భారత్ ఈ పోరుకు సిద్ధమయ్యాయి.

బుమ్రా ఆడుతాడా?

బ్యాటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. విరాట్‌సేనకు బౌలింగ్ సమస్యగా మారింది. రోహిత్ మినహా మిగతా బ్యాట్స్‌మెన్ ఫామ్‌లో ఉండటం అనుకూలాంశం. రైనా, ధవన్ చెలరేగితే సఫారీలకు ఇబ్బందులు తప్పవు. కెప్టెన్ కోహ్లీ గాడిలో పడాల్సి ఉంది. మనీష్ పాండే, ధోనీ టచ్‌లోకి రావడం శుభపరిణామం. ఒత్తిడికి లోనవుతున్న పాండ్యాపైనే అందరి దృష్టినెలకొంది. ఆరంభంలో రోహిత్, చివర్లో పాండే చూపే తెగువపైనే భారత్ స్కోరు ఆధారపడి ఉంటుంది. కడునొప్పితో బాధపడుతున్న పేసర్ బుమ్రా ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై సందిగ్ధత నెలకొంది. అతను కోలుకున్నా.. ఫిట్‌నెస్ ప్రశ్నార్థకంగా మారింది. శ్రీలంకతో ముక్కోణపు టీ20 సిరీస్‌కు రెండు వారాలే విరామం ఉండటంతో మేనేజ్‌మెంట్ రిస్క్ తీసుకుంటుందో లేదో చూడాలి. సెంచూరియన్‌లో బహిర్గతమైన బౌలింగ్ లోపాలను సరిదిద్దుకోవడంపై దృష్టిపెట్టిన టీమ్‌ఇండియా ఎలాంటి కూర్పుతో దిగుతుందో చూడాలి. ఉనాద్కట్ 3.4 ఓవర్లే వేసి 42 పరుగులిచ్చాడు. చాహల్ ఏకంగా 64 పరుగులు సమర్పించుకున్నాడు. ముఖ్యంగా చాహల్ బౌలింగ్‌ను క్లాసెన్ పూర్తిగా చదివేశాడు. కాబట్టి కొత్త అస్ర్తాలను సిద్ధం చేసుకోవాలి. లేదంటే మూల్యం తప్పదు. ఒకవేళ ఉనాద్కట్, చాహల్‌ను పక్కనబెడితే బుమ్రా, కుల్దీప్‌ను ప్రయత్నించొచ్చు. పాండ్యా బంతితోనే కాస్తోకూస్తో నెట్టుకొస్తున్నాడు.

మార్పుల్లేవు..!

మరోవైపు ఈ మ్యాచ్ కోసం దక్షిణాఫ్రికా తుది జట్టులో ఎలాంటి మార్పులు చేయడం లేదు. ఓపెనింగ్‌లో హెండ్రిక్స్ దంచుతున్నా.. స్మట్స్ పేలవ ఫామ్ ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఇద్దరు ఇచ్చే శుభారంభంపైనే భారీ స్కోరు ఆధారపడింది. భారీ హిట్టర్ మిల్లర్ మెరుపులు ఇప్పటివరకు కనిపించలేదు. కెప్టెన్ డుమిని నిలకడగా ఆడుతుండటం కలిసొచ్చే అంశం. వీళ్లందర్ని పక్కనబెడితే క్లాసెన్ బ్యాటింగ్‌పై ఇప్పుడు సర్వత్రా చర్చ మొదలైంది. సెంచూరియన్‌లో అతను భారత బౌలింగ్‌ను ఎదుర్కొన్న తీరు అమోఘం. ఈ మ్యాచ్‌లోనూ వీరిద్దరు కీలకం కానున్నారు. మరి రెండో మ్యాచ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు వీళ్లను ఎలా నిలువరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. చివర్లో బెహర్డీన్ కొద్దిగా తోడ్పాటు అందించాల్సి ఉంది. బౌలింగ్‌లో మోరిస్, పీటర్సన్ పరుగులు ధారాళంగా ఇవ్వడం ప్రతికూలంగా పరిణమించింది. జూనియర్ డాల, పెహెల్‌కావో టీమ్ ఇండియా పాలిట విలన్లుగా మారారు. షమ్సీ, స్మట్స్, డుమిని స్లో బౌలింగ్‌తో ఆకట్టుకోవడం అదనపు బలం. ఫీల్డింగ్‌లోనూ మెరిస్తే సఫారీల విజయం నల్లేరు మీద నడకే.

ఐదింటిలో ఓడింది

మూడో టీ20కి వేదికైన న్యూలాండ్స్‌లో దక్షిణాఫ్రికాకు మెరుగైన రికార్డేమీ లేదు. ఇక్కడ ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఐదింటిలో ఓడి.. మూడింటిలో నెగ్గింది. 2007 వరల్డ్‌కప్‌లోనే రెండు మ్యాచ్‌లు గెలువడం విశేషం. 2016లో ఇంగ్లండ్‌పై ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించింది. కాగా, భారత్‌కు ఈ వేదికపై ఇదే తొలి మ్యాచ్.

చరిత్రకు అడుగు దూరంలో..

- భారత మహిళా జట్టును ఊరిస్తున్న సిరీస్
- నేడు సఫారీలతో చివరి టీ20 మ్యాచ్



సాయంత్రం 4.30 నుంచి సోనీ టెన్-1లో

కేప్‌టౌన్: సూపర్ ఫాంలో ఉన్న భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా గడ్డపై రెండు సిరీస్‌లను గెలిచి చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. నిర్ణయాత్మక చివరిదైన ఐదో టీ20లో విజయం సాధించేందుకు హర్మన్‌ప్రీత్ సేన పక్కా ప్రణాళికతో సై అంటున్నది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.వర్షం కారణంగా నాలుగో టీ20 తుడిచిపెట్టుకు పోవడంతో ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలిస్తేనే భారత్‌కు సిరీస్ వశమవుతుంది. సఫారీ పర్యటనకు అద్భుతమైన ముగింపు పలుకాలని భారత అమ్మాయిలు ఉవ్విళ్లూరుతున్నారు.. మరోవైపు ఇప్పటికే వన్డే సిరీస్‌ను కోల్పోయిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు టీ20 సిరీస్‌లో కీలకమైన చివరి టీ20లో గెలిచి సిరీస్‌ను కాపాడుకోవాలని ఆరాటపడుతున్నది. సొంతగడ్డపై పరువు నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతున్నది.

ముగ్గురిపైనే బ్యాటింగ్ భారం

భారత మహిళా జట్టు బ్యాటింగ్ విభాగం మిథాలీ రాజ్, స్మృతి మందన, హర్మన్‌ప్రీత్‌పైనే ఆధారపడి ఉన్నది. తొలి రెండు మ్యాచుల్లో రెండు అర్ధశతకాలు (54, 76) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన మిథాలీ మూడో వన్డేలో డకౌట్ అయింది.దీంతో చివరి టీ20లో సత్తా చాటేందుకు మిథాలీ సిద్ధమైంది. మరో ఓపెనర్ మందన 28, 57,37 స్కోర్లతో మూడు మ్యాచ్‌ల్లోనూ ఆకట్టుకున్నది. ఇదే ఫాంను కొనసాగిస్తూ భారత్‌కు మరో విజయాన్ని అందించాలని మందన ఆరాటపడుతున్నది. ఇక మూడో టీ20లో ఒంటరి పోరాటం చేసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ నుంచి మరో మెరుపు ఇన్నింగ్స్‌ను జట్టు ఆశిస్తున్నది. వేద కృష్ణమూర్తి దూకుడైన బ్యాటింగ్ జట్టుకు అదనపు బలం కానున్నది. బౌలింగ్ విభాగంలో అనూజ పాటిల్, పూనమ్ యాదవ్‌ల స్పిన్ మాయాజాలం, పూజా వస్ర్తాకర్, శిఖాపాండేల పేస్ బౌలింగ్ ప్రత్యర్థిని కట్టడి చేయడంపైనే భారత విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.దక్షిణాఫ్రికా మహిళా జట్టులో కెప్టెన్ నీకెర్క్ బ్యాటింగ్ కీలకం కానున్నది. ఈమెకు తోడు లీ, క్లాస్, షబ్నిమ్ భారత్‌పై ఆధిపత్యం చూపించేందుకు వ్యూహరచన చేశారు.

కబడ్డీ చాంప్ శాలి గౌరారం జట్టు

- తొలి కేసీఆర్ కప్



తుంగతుర్తిలో కేసీఆర్ కప్ ప్రథమ బహుమతిని శాలిగౌరారం జట్టుకు అందజేస్తున్న మేడే రాజీవ్‌సాగర్

తుంగతుర్తి : ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీల్లో శాలిగౌరారం జట్టు చాంపియన్‌గా నిలిచింది. శాలిగౌరారం జట్టుకు రూ.50వేలు, ద్వితీయ బహుమతి వెంపటి రూ.35వేలు, తృతీయ బహుమతి మోత్కూరు రూ. 25వేలు, నాలుగోబహుమతి నూతనకల్ రూ. 15వేలు, ప్రత్యేక బహుమతి అడ్డగూడూరు జట్టు రూ. 10వేలు గెలుచుకున్నాయి. సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడె రాజీవ్‌సాగర్ నగదు ప్రోత్సాహకంతోపాటు కేసీఆర్ కప్ షీల్డును విజేతలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్లకుంట్ల కవిత ఆశీస్సులతో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించానని వివరించారు. ఈ కార్యక్రమంలో జాగృతి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంచాల వరలక్ష్మి, ప్రభావతి, అధికార ప్రతినిధి కుమారస్వామి సూర్యాపేట జిల్లా కన్వీనర్ రంగినేని ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమయం లేకనే..

- లోధా సిఫారసుల అమలుపై బీసీసీఐకి గంగూలీ లేఖ



గంగూలీ

న్యూఢిల్లీ: లోధా సిఫారసులను అమలుపరిచే విషయంలో రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్స్‌కు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉన్నాయని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ బీసీసీఐకి తెలిపాడు. లోధా నిబంధనలను అనుసరించి రాజ్యాంగంలో మార్పులు చేసే విషయమై లోధా నిబంధనలను అనుసరించి రాజ్యాంగంలో మార్పులు చేసే విషయమై బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌదరి లేఖ రాయగా..మరోసారి ఎస్‌జీఎం నిర్వహిస్తేనే బోర్డు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలమన్నాడు. ఇప్పటికిప్పుడు సమావేశం నిర్వహించేందుకు సమయం లేదని, దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నాడు.

మెదక్ X హైదరాబాద్

- జీ వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ20 లీగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న జీ వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ20 లీగ్ టోర్నీ నాకౌట్ దశకు చేరింది. రెండోదశ లీగ్‌లో తొలి నాలుగుస్థానాలలో నిలిచిన హైదరాబాద్ థండర్‌బోల్ట్స్, రంగారెడ్డి రైజర్స్, ఆదిలాబాద్ టైగర్స్, మెదక్ మావెరిక్స్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి. నేటి శనివారం ఉప్పల్ స్టేడియంలో తొలి సెమీపైనల్లో హైదరాబాద్, మెదక్ జట్లు తలపడనుండగా.. రెండో సెమీఫైనల్లో ఆదిలాబాద్, రంగారెడ్డి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆదివారం ఉప్పల్ స్టేడియంలోనే ఫైనల్ జరుగనుంది.

రాణికి భారత హాకీ పగ్గాలు

- మార్చి 3 నుంచి కొరియా పర్యటన



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లే భారత హాకీ జట్టుకు కెప్టెన్‌గా రాణి రాంపాల్‌ను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి 20 మంది జట్టు సభ్యులతో కూడిన భారత మహిళా హాకీ జట్టును శుక్రవారం ప్రకటించారు. కెప్టెన్‌గా రాణి రాంపాల్‌ను ఎంపిక చేశారు. ఈ పర్యటనలో భాగంగా భారత మహిళల జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. మార్చి 3 నుంచి 12 వరకు జిన్‌చున్ జాతీయ అథ్లెటిక్ సెంటర్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిర్ ఇండియాలో 500 ఖాళీలు

ఎయిర్ ఇండియా లిమిటెడ్ నార్తర్న్/వెస్టర్న్ రీజియన్‌ల్లోని ఖాళీగా ఉన్న ఎక్స్‌పీరియన్స్ క్యాబిన్ క్రూ (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అవివాహిత అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఈ పోస్టులను తాత్కాలికంగా ఐదేండ్ల కాలవ్యవధికి భర్తీ చేస్తారు. ఆ తర్వాత సంస్థ అవసరం దృష్ట్యా, అభ్యర్థి పని తీరునుబట్టి మరో ఐదేండ్లవరకు పొడగించే అవకాశం ఉంది.

- పోస్టు పేరు: ఎక్స్‌పీరియన్స్ క్యాబిన్ క్రూ
- మొత్తం పోస్టుల సంఖ్య: 500

రీజియన్ల వారీగా పోస్టుల వివరాలు

- నార్తర్న్ రీజియన్ ఢిల్లీ -450 ఖాళీలు
- పురుషులు- 150 పోస్టులు (జనరల్-35, ఓబీసీ-87, ఎస్సీ-11, ఎస్టీ-17)
- మహిళలు-300 పోస్టులు (జనరల్-169, ఓబీసీ-126, ఎస్సీ-1, ఎస్టీ-4)
- వెస్టర్న్ రీజియన్ ముంబై -50 ఖాళీలు
- పురుషులు- 13 పోస్టులు (జనరల్-7, ఓబీసీ-5, ఎస్టీ-1)
- మహిళలు-37 పోస్టులు (జనరల్-19, ఓబీసీ-17, ఎస్టీ-1)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10+2 లేదా ఇంటర్‌లో ఉత్తీర్ణత. షెడ్యూల్ ఎయిర్‌లైన్‌లో క్యాబిన్ క్రూలో ఏడాది అనుభవంతోపాటు ఎయిర్‌బస్/బోయింగ్ ఫ్యామిలీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో వినియోగంలో ఉన్న ఎస్‌ఈపీ ఉండాలి.
- **వయస్సు :** 2018 మార్చి 1 నాటికి 18 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

శారీరక ప్రమాణాలు:

- **ఎత్తు:** సంస్థ నిబంధనల ప్రకారం కనీసం పురుషులు 172 సెం.మీ , మహిళలు 160 సెం.మీ. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 2.5 సెం.మీ వరకు ఎత్తులో మినహాయింపు ఉంటుంది.

బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)

- పురుషులు-18-25 (నార్మల్ రేంజ్‌లో ఉండాలి)
- మహిళలు-18-22 (నార్మల్ రేంజ్‌లో ఉండాలి)
- **కంటిచూపు:** ఎయిర్ ఇండియా నిర్దేశించిన కంటి చూపు, ఇతర వైద్య ప్రమాణాలు ఉండాలి.స్పష్టమైన కంటిచూపు (దగ్గరి కంటిచూపు: ఎన్/5; దూరపు కంటిచూపు 6/6, 6/9 ప్రమాణాలకు తగ్గట్లు) ఉండాలి. రేచీకటి, వర్ణాంధత్వం ఉండకూడదు.
- **భాష:** ఇంగ్లిష్, హిందీలో అనర్గళంగా మాట్లాండాలి. ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు గల ఒక విదేశీభాష మాట్లాడేవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **పే స్కేల్:** ట్రెయినింగ్ పీరియడ్‌లో నెలకు రూ. 15,000/- స్టయిఫండ్‌గా ఇస్తారు. శిక్షణ పూర్తయిన తర్వాత నెలకు రూ. 39,525 చెల్లిస్తారు. జీతంతోపాటు అదనంగా ఫ్లయింగ్ అలవెన్స్‌లు, లేఓవర్ అలవెన్స్‌లు, స్టాండ్‌బై అలవెన్స్‌లు ఇస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/- (ఎయిర్ ఇండియా లిమిటెడ్ ఢిల్లీ/ముంబైలో చెల్లేవిధంగా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో) ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులకు ఫీజు లేదు.

ఎంపిక విధానం:

- గ్రూప్ డైనమిక్స్, పర్సనల్ అసెస్‌మెంట్ టెస్ట్, రాత పరీక్ష ద్వారా
- జీడీ అండ్ పీఏటీ జరిగే రోజున ఒరిజినల్ సర్టిఫికెట్లు, డిమాండ్ డ్రాఫ్ట్‌తో హాజరుకావాలి.
- రాతపరీక్ష ఇంగ్లిష్/హిందీ భాషల్లో ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 12
- **వెబ్‌సైట్:** www.airindia.in

సికింద్రాబాద్ కేవీఎస్‌లో కొలువులు

సికింద్రాబాద్ (పికెట్)లోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అనేది కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలో పని చేస్తున్న సంస్థ. దీన్ని 1963 డిసెంబర్ 15న ఏర్పాటుచేశారు.

పోస్టుల వివరాలు:

- పీజీటీ (ఎకనామిక్స్, హిస్టరీ, కామర్స్, బయోటెక్, హిందీ, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్, బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, జాగ్రఫీ)
- టీజీటీ(హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ స్టడీస్)
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్, పీజీ, బ్యాచిలర్ డిగ్రీతో పాటు బీఈడీ. హిందీ/ఇంగ్లిష్ భాష మాధ్యమంలో నైపుణ్యం కలిగి ఉండాలి.
- **పే స్కేల్:** పీజీటీ పోస్టులకు రూ. 27,500/- టీజీటీ పోస్టులకు రూ. 26,250/-

కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్

- **అర్హత:** బీఈ/బీటెక్, ఎమ్మెస్సీ, బీఎస్సీ/ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 26,250/- (క్లాస్ 3 నుంచి 5 వరకు బోధించే వారికి రూ. 21,250/-)

ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ)

- **అర్హత:** ఇంటర్‌తో పాటు రెండేండ్ల డీఈడీ కోర్సుల్లో ఉత్తీర్ణత. సీటెట్‌లో అర్హత సాధించాలి.
- డాక్టర్, నర్స్, కౌన్సెలర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్/క్రాఫ్ట్ టీచర్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కోచ్, జర్మన్ టీచర్, డాటా ఎంట్రీ ఆపరేటర్
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో డిగ్రీ/



డిప్లొమా, ఎంబీబీఎస్, డిప్లొమా ఇన్ నర్సింగ్, డిగ్రీ, ఇంటర్‌లో ఉత్తీర్ణత.

గమనిక: పోస్టులను బట్టి అర్హతలు ఉన్నాయి.

- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.kvpicket.edu.in

హాల్‌లో ప్రైమరీ టీచర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)లో ప్రైమరీ టీచర్ (కాంట్రాక్టు ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

బెంగళూరు, హాల్‌లోని జ్ఞానజ్యోతి స్కూల్‌లో కింది ఖాళీలు ఉన్నాయి.

- ప్రైమరీ టీచర్ – 7 ఖాళీలు
- **పేస్కేల్:** రూ. 9,300 – 34,800 + గ్రేడ్ పే రూ. 4,200/-
- **అర్హతలు:** బీఏ, బీఈడీ
- ఆయా (ఫిమేల్) – 3 ఖాళీలు
- **పేస్కేల్:** నెలకు రూ. 10,000/-
- **అర్హత:** మిడిల్ స్కూల్ ఉత్తీర్ణత.
- **పనిచేయాల్సిన ప్రదేశం:** బెంగళూరు
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు ఫీజు:** రూ. 200/-
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** మార్చి 7
- **వెబ్‌సైట్:** http://www.hal-india.com

ఎన్‌ఐఓసీలో ఎగ్జిక్యూటివ్‌లు

నోయిడాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 26

విభాగాలవారీగా ఖాళీలు:

- సీనియర్ కన్సల్టెంట్-1, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్-6, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్-9, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్-10
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత. పోస్టులను బట్టి వేర్వేరు అర్హతలు ఉన్నాయి.
- **పే స్కేల్:** ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌కు రూ. 21,100/- సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు రూ. 33,000/-, పోస్టులను బట్టి వేర్వేరు పే స్కేల్స్ ఉన్నాయి.

राष्ट्रीय मुक्त विद्यालयी शिक्षा संस्थान
National Institute of Open Schooling

- **ఎంపిక విధానం:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ :** మార్చి 6,7
- **వెబ్‌సైట్:** www.nios.ac.in

రైస్ రిసెర్చ్‌లో టెక్నికల్ అసిస్టెంట్లు

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్ (ఐఐఆర్ఆర్) ఖాళీగా ఉన్న జేఆర్‌ఎఫ్/ఎస్ఆర్‌ఎఫ్,యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) పరిధిలో ఐఐఆర్ఆర్ పనిచేస్తుంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 22

విభాగాలవారీగా ఖాళీలు:

- సీనియర్ రిసెర్చ్ ఫెలో-3, యంగ్ ప్రొఫెషనల్ (గ్రేడ్ 2)-5, ఫీల్డ్/ల్యాబ్ అసిస్టెంట్-1, యంగ్ ప్రొఫెషనల్ (గ్రేడ్ 1)-2, ఆఫీస్ అసిస్టెంట్-1, టెక్నికల్ అసిస్టెంట్/ప్రాజెక్టు అసిస్టెంట్-7, జేఆర్‌ఎఫ్-1, ఫీల్డ్ వర్కర్/హెల్పర్-2,
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టు/లైఫ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ/డిప్లొమాతోపాట నెట్‌లో ఉత్తీర్ణత
- **పే స్కేల్ :** ఎస్ఆర్‌ఎఫ్/యంగ్ ప్రొఫెషనల్ (గ్రేడ్ 2) పోస్టులకు రూ. 25,000/-, మిగతా పోస్టులకు రూ. 15,000/-



- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. ఇంటర్వ్యూతేదీన ఒరిజనల్ సర్టిఫికెట్లతో పర్సనల్ అధికారివద్ద హాజరుకావాలి.

చిరునామా: ICAR- IIRR, Rajendranagar,

- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 12,13,14,15,16,17 & 21
- **వెబ్‌సైట్:** www.iirr.org.in


ఐసీఏఆర్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

హైదరాబాద్‌లోని సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రిరల్చర్ (సీఆర్ఐడీఏ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న యంగ్ ప్రొఫెషనల్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది

వివరాలు:

సీఆర్ఐడీఏ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య: 28
- యంగ్ ప్రొఫెషనల్స్ (గ్రేడ్ 1)-4 పోస్టులు
- యంగ్ ప్రొఫెషనల్స్ (గ్రేడ్ 2)-23 పోస్టులు
- ఆఫీస్ అసిస్టెంట్-1 పోస్టు
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, బీఈ/బీటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ/ఎంఈ/ఎంటెక్ తోపాటు సంబంధిత విభాగంలో అనుభవం.



- **పే స్కేల్ :** యంగ్ ప్రొఫెషనల్స్ (గ్రేడ్ 2) పోస్టులకు రూ. 25,000/-, ఆఫీస్ అసిస్టెంట్/ యంగ్ ప్రొఫెషనల్స్ (గ్రేడ్ 1) పోస్టులకు రూ. 15,000/-
- **దరఖాస్తు :** ఆఫ్‌లైన్‌లో
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 13,13,14
- **వెబ్‌సైట్:** www.crida.in

ఆదిలాబాద్‌లో బ్యాక్‌లాగ్ పోస్టులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ శాఖల్లో వికలాంగులకు రిజర్వ్ (గ్రూప్ - 4, గ్రూప్ - 4 కాని ఉద్యోగాలు) చేసిన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

గ్రూప్ – 4 ఉద్యోగాలు:

- జూనియర్ అసిస్టెంట్ – 5 ఖాళీలు. వీటిలో అంధులు (మహిళ) -3, బధిరులు (మహిళ) – 1, శారీరక వికలాంగులు (జనరల్) -1
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం, ఎంఎస్ ఆఫీస్ వచ్చి ఉండాలి.

గ్రూప్ – 4 కాని పోస్టులు:

- వాచ్‌మెన్ – 1 (అంధులు – మహిళ) పోస్టు
- **అర్హత:** ఐదోతరగతి ఉత్తీర్ణత.
- ఆఫీస్ సబార్డినేట్ – 5 ఖాళీలు (అంధ మహిళలకు-3, శారీరక వికలాంగులు: జనరల్ -1, మహిళ – 1), వాచ్‌మెన్ – 1 (అంధ మహిళ), పబ్లిక్ హెల్త్ వర్కర్ – 2, కామాటి – 4, తోటి – 1 ఖాళీ ఉన్నాయి. మొత్తం 13 ఖాళీలు.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** http://adilabad.telangana.gov.in

ధనుష్ ప్రయోగం విజయవంతం



ధనుష్ క్షిపణి

బాలాసోర్: అణు సామర్థ్యం కలిగిన ధనుష్ ఖండాంతర క్షిపణి ప్రయోగం శుక్రవారం విజయవంతమైంది. ఒడిశా కోస్తా తీరంలో వాయుసేన నౌక నుంచి దీనిని పరీక్షించారు. 350 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం ధనుష్‌కు ఉన్నదని రక్షణశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధిపర్చిన భూ ఉపరితలం నుంచి ఉపరితల క్షిపణి పృథ్వీకి స్వల్పమార్పులు చేసి.. సముద్రం నుంచి ప్రయోగించగల క్షిపణిగా ధనుష్‌ను రూపొందించారు. బంగాళాఖాతంలోని పారదీప్ సమీపంలో నౌక నుంచి ఉదయం 10.52 నిమిషాలకు ధనుష్‌ను ప్రయోగించారు. ఈ క్షిపణి 500 కిలోల బరువును మోసుకెళ్లగలదు. ఇది భూమి, సముద్రంపై లక్ష్యాలను సైతం ఛేదిస్తుంది. ప్రయోగాన్ని రక్షణశాఖలోని స్ట్రాటజిక్ ఫోర్స్ కమాండ్ (ఎస్‌ఎఫ్‌సీ) నిర్వహించిందని అధికారవర్గాలు పేర్కొన్నాయి. క్షిపణి ప్రయోగం, దాని ప్రదర్శనను ఒడిశాతీరంలోని రాడార్ సౌకర్యాలు, టెలిమెట్రీ ద్వారా డీఆర్డీవో పర్యవేక్షించిందని చెప్పాయి.

64 వేల ఏండ్ల కిందటే గుహ చిత్రాలు

- నియాండర్తల్స్ వేసినట్టు తేల్చిన శాస్త్రవేత్తలు
- ఆధునిక మానవుడి కన్నా 20 వేల ఏండ్లు ముందువని నిర్ధారణ

లండన్, ఫిబ్రవరి 23: ప్రపంచంలోకెల్లా పురాతన గుహ చిత్రాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని ఆధునిక మానవుడి కన్నా ముందు జీవించిన నియాండర్తల్స్ గీసినట్టు తేల్చారు. దీంతో ఇప్పటివరకు అందరూ భావిస్తున్నట్టు గుహచిత్రాలు వేసే కళ ఆధునిక మానవులు ప్రారంభించలేదని తేలింది. ఇటీవల స్పెయిన్‌లోని మంచు కొండల్లో బయటపడిన పురాతన గుహలను అమెరికా, జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాలకు చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. మూడు పురాతన గుహల్లో బయటపడ్డ చిత్రాల కాలాన్ని నిర్ధారించేందుకు యురేనియం-థోరియం డేటింగ్ పరీక్షలు నిర్వహించగా అవి 64వేల ఏండ్ల కిందట గీసినవని తేలింది. ఈ చిత్రాలు ఆధునిక మానవుడి ఉనికి కన్నా 20 వేల ఏండ్ల ముందు గీసినట్టు తేలింది. ఈ చిత్రాల్లో జంతువుల ఆకారాలు, చుక్కలు, గీతలు ఉన్నాయన్నారు. నియాండర్తల్స్ 40వేల ఏండ్లకు ముందు వరకు మనుగడ సాగించారని శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి. వీరు ముందుగా ఆర్కిటిక్ ప్రాంతంలో నివసించి, ఆ తర్వాత వివిధ ఖండాలకు విస్తరించారు. నియాండర్తల్స్‌ను ఆధునిక మానవుడి సోదర జాతిగా చెప్తుంటారు. రెండు జాతుల డీఎన్ఏను పోల్చినప్పుడు 99శాతం సమానంగా ఉన్నది. 'ఇప్పటివరకు మనం ఊహించిన దానికంటే నియాండర్తల్స్ చాలా తెలివైన వారని ఈ చిత్రాలను బట్టి తెలుస్తున్నది. మూడు గుహల్లోని చిత్రాల్లో ఎరుపు, నలుపు రంగులను వాడారు. జంతువుల బొమ్మలు, చుక్కలు, రేఖలు, చేతిగుర్తులను గీసిన ఆనవాళ్లు ఉన్నాయి' అని బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీకి చెందిన క్రిస్ స్టాన్‌డిష్ తెలిపారు.



గుహలో గీసిన నిచ్చెనలాంటి రేఖలు, జంతువుల ఆకారాలు